www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
28-08-2024
సంపుటి : 01 । సంచిక : 116 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS



డా॥ కాచం సత్యనారాయణ
CMD



మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మంగళవారం రాత్రి 9:12 గంటలకు విడుదలయ్యారు. కవిత జైలు నుంచి బయటకు రాగానే అక్కడే ఉన్న తన కుమారుడిని ఆలింగనం చేసుకొని భావోద్వేగానికి లోనయ్యారు. ఆ తర్వాత భర్త అనిల్, అన్నయ్య కేటీఆర్‌ను గుండెలకు హత్తుకుని ఆనందభాష్పాలు రాల్చారు. ఈ సమయంలో హరీశ్‌రావు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. 165 రోజుల తర్వాత ఆమె జైలు నుంచి బయటకు వచ్చారు. లిక్కర్ స్కామ్‌కు సంబంధించి ఈడీ, సీబీఐ నమోదు చేసిన రెండు కేసుల్లోనూ సుప్రీంకోర్టు మంగళవారం కవితకు బెయిల్ మంజూరు చేసింది. అనంతరం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆమె బెయిల్ కోసం రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించారు. బుధవారం ట్రయల్ కోర్టులో విచారణకు హాజరైన అనంతరం మధ్యాహ్నం 2:45 గంటలకు ఢిల్లీ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. కవిత వెంట ఆమె భర్త అనిల్ కుమార్, సోదరుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు రానున్నారు. మరోవైపు బుధవారం ఉదయం బీఆర్ఎస్ నేతలు ఢిల్లీలో ప్రెస్ మీట్ పెట్టే అవకాశం ఉంది.

# జైలు నుంచి కవిత విడుదల



## షరతులతో బెయిల్ మంజూరు చేసిన సుప్రీం కోర్టు

### రెండు కేసుల్లో రూ.10 లక్షల చొప్పున పూచీకత్తు సమర్పణ

### 165 రోజుల తర్వాత బయటికి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ

### నేడు మధ్యాహ్నం హైదరాబాద్‌కు రాక

**ఢిల్లీ:**

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ ఎస్ ఎమ్మెల్సీ కవితకు మంగళవా రం సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆమె బెయిల్ పిటిషన్‌పై విచారించిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్ ద్విసభ్య ధర్మాసనం, ఈడీ, సీబీఐ కేసులో బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బెయిల్ మంజూరుకు సుప్రీంకోర్టు 3 ప్రధాన కారణాలు చెప్పింది. సీబీఐ తుది ఛార్జిషీట్ దాఖలు చేసిందని, ఈడీ దర్యాప్తు పూర్తి చేసిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నిందితురాలు జైలులో ఉండాల్సిన అవసరం లేదని, అందుకే కవితకు బెయిల్ మంజూరు చేస్తున్నామని స్పష్టం చేసింది. మహిళగా కూడా పరిగణించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఇదే సమయంలో బెయిల్‌తో పాటు కొన్ని షరతులు విధించిన ధర్మాసనం, ఒక్కో కేసులో రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించాలని, మిగతా2లో...

ఎవరినైనా ఎంపిక చేసుకొని

## నిందితులుగా పేర్కొంటారా?

2

- మీరు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి
- మద్యం కుంభకోణంలో కవిత పాత్ర ఉందని చెప్పేందుకు మీ దగ్గర ఉన్న ఆధారాలేంటి?
- ఈడీ, సీబీఐ తీరును ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం

నన్ను జైలుకు పంపి జగమొండిని చేశారు..

## వడ్డీతో సహా చెల్లిస్తాం

నేను కేసీఆర్ బిడ్డను.. తప్పు చేసే ప్రసక్తే లేదు: ఎమ్మెల్సీ కవిత



2

## ఐసీసీ కొత్త చైర్మన్‌గా జై షా

- ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటన
- డిసెంబర్ 1న బాధ్యతల స్వీకరణ
- ఈ పదవికి చేపట్టనున్న అత్యంత పిన్నవయస్కుడు
- క్రికెట్ గ్లోబల్ గవర్నింగ్ అథారిటీకి నాయకత్వం వహించిన ఐదవ భారతీయుడు



2

రాజ్యసభ సభ్యునిగా అభిషేక్ మనుసింఘ్వీ

## ఏకగ్రీవంగా ఎన్నిక

- అభ్యర్థిత్వానికి రెండు నామినేషన్లు దాఖలు
- స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ



2

# సెప్టెంబర్ 17 నుంచి ప్రజా పాలన

## పది రోజుల పాటు అన్ని గ్రామాలు, వార్డుల్లో నిర్వహణ



### రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీకి వివరాల సేకరణ

### ఈ రెండు కార్డులకు ఇక లింక్ ఉండదు

### అధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** సెప్టెంబర్ 17 నుంచి పది రోజుల పాటు రాష్ట్రమంతటా ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేసేందుకు ఈసారి ప్రజాపాలన కార్యక్రమం చేపడుతామని చెప్పారు. ఇకపై రేషన్ కార్డులు, హెల్త్ కార్డులకు లింక్ ఉండదని, వేర్వేరుగా కార్డులు జారీ చేస్తామని సీఎం చెప్పారు. ప్రజా పాలనలో ప్రతి కుటుంబం నుంచి అందుకు అవసరమైన వివరాలను సేకరిస్తామన్నారు. రాష్ట్రమంతటా అన్ని గ్రామాలు, వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమానికి నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ, మిగతా2లో...

## ప్రభుత్వ ఆసుపత్రులకు శాపంగా కాంగ్రెస్ ప్రభుత్వం

- మందులు లేక ప్రైవేటు ఫార్మసీలకు వెళ్లాల్సిన దుస్థితి
- మాజీ మంత్రి హరీశ్‌రావు



**విశ్వంభర , తెలంగాణ బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రభుత్వాసుపత్రులకు శాపంగా మారుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో మిగతా2లో...

## ఓరల్ కలరా వ్యాక్సిన్ తీసుకొచ్చిన భారత్ బయోటెక్



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**

ప్రముఖ ఫార్మా దిగ్గజం భారత్ బయోటెక్ మంగళవారం ఇంటర్నేషనల్ లిమిటెడ్ 'ఓరల్ కలరా వ్యాక్సిన్' విడుదల చేసింది. 'హిల్ కాల్' పేరుతో కలరా వ్యాక్సిన్‌ను తీసుకొచ్చినట్లు తెలిపింది. 2023 మార్చి నుంచి మిగతా2లో...

జన్వాడ ఫాంహౌస్ లో

## అధికారుల కొలతలు

ఏ క్షణమైనా కూల్చివేత?



2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 109 | ₹ 131 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 190 | ₹ 216 |



## పకడ్బందీగా గణేశ ఉత్సవాలు

- ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి
- మట్టి విగ్రహాల ఏర్పాటుకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలి
- ఉత్సవాల సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ లో గణేశ్ ఉత్సవాలు, నిమజ్జనాన్ని ఘనంగా, పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు సూచించారు. వినాయక ఉత్సవాలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు ఏర్పాట్లపై మంగళవారం జరిగిన సన్నాహక సమావేశంలో వారు పాల్గొన్నారు. హైదరాబాద్ లో జరిగే గణేశ్ ఉత్సవాలలో మన రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా మిగతా2లో...

## ప్రపంచ క్రీడా పోటీల్లో పతకాలే లక్ష్యం

- అందుకోసమే స్పోర్ట్స్ యూనివర్సిటీ
- ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో క్రీడల కోసం ఒక పీరియడ్
- నిధుల కొరత లేదు క్రీడల అవసరాలకు తగిన విధంగా నిధులు కేటాయిస్తాం
- జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఎల్ బి స్టేడియంలో క్రీడా పోటీలను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




2



2

## వణుకు పుట్టిస్తున్న హైడ్రా

### పాతబస్తీ నేతలకు బుల్డోజర్ల భయం

మజ్లిస్ నేతల ఆక్రమణలపై చర్యలుంటాయా?

రాజకీయ ప్రత్యర్థులకు ఆయుధంగా మారుతుందా?

సిటీలో హాట్ టాపిక్‌గా మారిన పాతబస్తీ ఆక్రమణలు

# జైలు నుంచి కవిత విడుదల

**(మొదటి పేజీ తరువాయి)**
సాక్షులను ప్రభావితం చేయరాదని ఆదేశించింది. పాస్‌పోర్టును కింది కోర్టులో డిపాజిట్ చేయాలని సూచించింది. అంతకుముందు కవిత తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. ఈడీ కేసులో కవిత 5 నెలలుగా, సీబీఐ కేసులో 4 నెలలుగా జైలులో ఉన్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేసులో 493 మంది సాక్షులను విచారించారని, ఒక మహిళగా కవిత బెయిల్‌కు అర్హురాలని తెలిపారు. కవిత మాజీ ఎంపీ అని, ఆమె ఎక్కడికీ వెళ్లరని చెప్పారు. రూ.100 కోట్ల ముడుపుల ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్న ముకుల్ రోహత్గి, కవిత నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సొమ్ము రికవరీ చేయలేదన్నారు. ఇదే కేసులో మనీశ్ సిసోదియాకు బెయిల్ మంజూరైందని, సిసోదియాకు వర్తించిన నిబంధనలే కవితకూ వర్తిస్తాయని ధర్మాసనానికి వివరించారు. ఇరువైపుల సుదీర్ఘంగా సాగిన వాదనల అనంతరం సుప్రీంకోర్టు ధర్మాసనం, కవితకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో ఈడీ అధికారులు కవితను మార్చి 15న అరెస్ట్ చేయగా, అప్పటి నుంచి దాదాపు 5 నెలలకు పైగా ఆమె తిహాడ్ జైలులోనే ఉన్నారు.

### నన్ను జైలుకు పంపి జగమొండిని చేశారు..

# వడ్డీతో సహా చెల్లిస్తాం

### నేను కేసీఆర్ బిడ్డను.. తప్పు చేసే ప్రసక్తే లేదు: కవిత

నేను కేసీఆర్ బిడ్డను.. తప్పు చేసే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. నన్ను అనవసరంగా జైలుకు పంపి నన్ను జగమొండిని చేశారు అని ఆమె అన్నారు. తీహార్ జైలు నుంచి విడుదలైన అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. పిడికిలి బిగించి జై తెలంగాణ నినాదాలు చేశారు ఆమె. భర్త అనిల్, అన్నయ్య కేటీఆర్, కుమారుడిని గుండెలకు హత్తుకుని కవిత భావోద్వేగానికి లోనయ్యారు. అయిదు నెలల పాటు కుమారుడికి దూరంగా ఉండటం తల్లిగా ఎంతో కష్టతరమైన విషయం అన్నారు. ఈ కష్ట సమయంలో తమ కుటుంబానికి అండగా నిలచిన అందరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# ఐసీసీ కొత్త చైర్మన్‌గా జై షా

**విశ్వంభర (క్రీడా విభాగం):** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) కొత్త చైర్మన్‌గా బిసిసిఐ కార్యదర్శి జై షా నియమితులయ్యారు.గ్రెగ్ బార్క్‌లే తర్వాత జై షా బాధ్యతలు చేపట్టనున్నారు. జగ్‌మోహన్ దాల్మియా (అధ్యక్షుడు), శరద్ పవార్, ఎన్ శ్రీనివాసన్, షాహంక్ మనోహర్ తర్వాత క్రికెట్ గ్లోబల్ గవర్నింగ్ అథారిటీకి నాయకత్వం వహించిన ఐదవ భారతీయుడిగా షా నిలిచారు. 34 ఏళ్ల వయసులో ఐసీసీ చీఫ్ గా బాధ్యతలు చేపట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా షా నిలిచారు. బీసీసీఐ కార్యదర్శిగా ఉన్న ఆయన.. ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐసీసీ స్వతంత్ర చైర్మన్‌గా డిసెంబర్ 1, 2024న ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం చైర్మన్ గా గ్రెగ్ బార్క్ కొనసాగుతున్నారు. అతడు మరో దఫా చైర్మన్ గా కొనసాగడానికి అర్హత ఉన్నా.. కొనసాగడానికి విముఖత చూపారు. ఈ మేరకు ఆగస్టు 20న ప్రకటన కూడా చేశారు. నవంబర్‌లో ఆయన పదవీ కాలం ముగియనుంది. దీంతో చైర్మన్ పదవికి ఏకైక నామినీ అయిన జై షా ఏకగ్రీవంగా ఈ పదవికి ఎన్నికయ్యారు. ప్రపంచ దేశాల్లో క్రికెట్ పరిధిని పెంచడానికి, జనాల్లో ఆదరణ పెంచడానికి నిబద్ధతగా పనిచేస్తానని ఆయన చెప్పారు.

# జన్వాడ ఫాంహౌస్‌లో అధికారుల కొలతలు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** కేటీఆర్ మిత్రుడికి చెందిన జన్వాడ ఫాం హౌస్ లో ఇరిగేషన్ అధికారులు మంగళవారం కొలతలు వేస్తున్నారు. దీంతో ఈ ఫాంహౌస్ కూల్చివేతకు ఏర్పాట్లు సాగుతున్నాయన్న చర్చ జోరుగా సాగుతోంది. హైకోర్టు సైతం ఈ ఫాం హౌస్ కూల్చివేతపై స్టే ఇవ్వకపోవడంతో అధికారులు యాక్షన్ లోకి దిగినట్లు తెలుస్తోంది. ఈ ఫాంహౌస్ నిబంధనలకు ఉల్లంఘించి నిర్మించారన్న ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి.. నాడు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో సైతం ఈ ఫాంహౌస్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఇది కేటీఆర్ దేనని ఆయన పేర్కొన్నారు.

# ప్రపంచ క్రీడా పోటీల్లో పతకాలే లక్ష్యం

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రపంచంలో క్రీడా పోటీల్లో తెలంగాణ ప్రాతినిధ్యానికి, బంగారు పతకాలు సాధించేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీలను ప్రారంభించి ప్రసంగించారు. క్రీడల పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి నిలిపిందని తెలిపారు. మనిషి జీవితంలో ప్రతినిత్యం గెలుపు ఓటముల కోసం పోరాటం జరుగుతుంది.. క్రీడల్లో గెలిచినవారు మరోసారి గెలుపొందేందుకు.. ఓడినవారు గెలిచేందుకు ప్రయత్నం చేస్తారు. స్పోర్ట్స్ ద్వారా వచ్చే స్ఫూర్తి మానవ జీవితానికి పెద్ద ఎత్తున ఉపయోగపడుతుందని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొరియా పర్యటనకు వెళ్లారు. ఒక యూనివర్సిటీ నుంచి పెద్ద సంఖ్యలో క్రీడా పతకాలు సాధించారని ఎక్కువగా పతకాలు రావడానికి కారణాలు విశ్లేషించగా దృష్టి కేంద్రీకరించడం, నిధులు కేటాయించడమే కారణమని గుర్తించారు. అదే తరహాలో మన రాష్ట్రంలోనూ స్పోర్ట్స్ యూనివర్సిటీ పెట్టాలని ప్రపంచంలో కూడా తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించేలా చేయాలని.. బంగారు పతకాలు సాధించాలని ఇందుకుగాను స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు ప్రకటించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి, సంకల్పబలం అన్నారు. హైదరాబాదులో వరల్డ్ క్లాసు క్రీడా మైదానాలు ఉన్నాయని, ఏ క్రీడనైనా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాము.. ప్రాతినిధ్యం కల్పించేందుకు అవకాశం ఇవ్వాలని ఇటీవల దిల్లీలో కేంద్ర క్రీడాల మంత్రిని కలిసి కోరామని తెలిపారు. యువజన కాంగ్రెస్ నుంచి ఎదిగి వచ్చిన నాయకుడు శివసేనారెడ్డిని ఇటీవల నేను పిలిచి అభినందించాను.. క్రీడల పై ప్రత్యేక దృష్టి సారించాలని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చాం. అందులో భాగంగా ఏ జిల్లాలో ఏ క్రీడలు నిర్వహించాలనేది శివసేనారెడ్డి నివేదిక రూపొందించారు. క్రీడలు నిర్వహించేందుకు తగినన్ని నిధులు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది, గత పాలకులు నిర్మించిన క్రీడా మైదానాలు మరమ్మతు చేసి అభివృద్ధి చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలో గతంలో క్రీడల కోసం ఒక పిరియడ్ ఉండేది... రాష్ట్రంలో ఇకనుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల అనే తేడా లేకుండా ఒక పీరియడ్ క్రీడల కోసం కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, విసీఎండీ సోనీ బాలాదేవి, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ప్రెసిడెంట్ ఏలూరు శ్రీనివాసరావు, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎవరినైనా ఎంపిక చేసుకొని నిందితులుగా పేర్కొంటారా?

**ఢిల్లీ:** ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేసిన సుప్రీం కోర్టు.. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులపై దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ తీరును ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం.. కేంద్ర దర్యాప్తు సంస్థల నిష్పక్షపాత వైఖరిపై అనుమానాలు వ్యక్తం చేసింది. ఎవరినైనా ఎంపిక చేసుకొని నిందితులుగా పేర్కొంటారా? అని ప్రశ్నించింది. ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఈడీ, సీబీఐ తీరును ఎండగట్టిన ధర్మాసనం.. కేవలం అప్రూవర్లుగా మారిన మాజీ నిందితుల వాంగ్మూలాలపైనే ఆధారపడలేరని పేర్కొంది. "మీరు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి సాక్షిగా మారారా? ఎంపిక చేసుకొన్నంత మాత్రాన వారిని నిందితులుగా చూస్తారా. ఇందులో న్యాయమెక్కడ?" అని ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది.



**కవిత పాత్ర ఉందని చెప్పేందుకు మీ దగ్గర ఉన్న ఆధారాలేంటి?**

మద్యం కుంభకోణంలో కవిత పాత్ర ఉందని చెప్పేందుకు మీ దగ్గర ఉన్న ఆధారాలేంటని ఈడీ, సీబీఐలను సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. దర్యాప్తు సంస్థల తరఫున అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు బదులిస్తూ.. సాక్షులుగా మారిన బుచ్చిబాబు, మాగుంట రాఘవరెడ్డిలు ఇచ్చిన ఆధారాలను ప్రస్తావించారు. కవిత తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ జోక్యం చేసుకుంటూ.. ఈ వ్యక్తులు ఇచ్చిన వాంగ్మూలాల్లోనే అనేక అంశాలను ఇతర (కేజ్రీవాల్) కేసుల్లో ఆధారాలుగా చూపించారని గుర్తుచేశారు." కేజ్రీవాల్ సూత్రధారి, మనీశ్ సిసోదియా సూత్రధారి.. ఇప్పుడు కవిత సూత్రధారి అని చెబుతున్నారు. అప్రూవర్లుగా మారిన వాళ్లు ఇచ్చిన స్టేట్‌మెంట్లు మినహా ఎటువంటి ఆధారాలు లేవు" అని అన్నారు.

**'మెసేజ్ లు డిలీట్ చేయడం తప్పేంకాదు..'**

ఈ క్రమంలో జోక్యం చేసుకున్న సుప్రీం ధర్మాసనం.. అప్రూవర్ల వాంగ్మూలాలను వేరుగా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ నేరంలో పాత్ర ఉందని నిరూపించడానికి ఆధారాలు ఏవని ప్రశ్నించింది. అంతేకాకుండా మొబైల్ ఫోన్లను ఫార్మాట్ చేసి అందులోని మెసేజ్‌లను కవిత తొలగించారని పిటిషనర్ చేసిన వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది."ఫోన్లు అనేవి వ్యక్తిగత అంశానికి సంబంధించినవి. ఫోన్లలో మెసేజ్ లు అందరూ డిలీట్ చేస్తుంటారు. స్కూళ్లు, కాలేజీ గ్రూపులలో వచ్చే మెసేజ్‌లను నేనూ డిలీట్ చేస్తుంటా. సాధారణంగా అందరూ చేసే ప్రక్రియే. ఇక్కడున్నవాళ్లు ఇదే చేస్తుంటారు. కేవలం ఫోన్ ఫార్మాట్ చేసినంత మాత్రాన నేరం చేసినట్లు భావించకూడదు. నేర నిరూపణకు అదనపు సమాచారం ఉండాలి. లేదంటే కేవలం ఇది ఫోన్ ను ఫార్మాట్ చేయడం కిందికే వస్తుంది" అని జస్టిస్ విశ్వనాథన్ వ్యాఖ్యానించారు.

# పకడ్బందీగా గణేశ ఉత్సవాలు

**(మొదటి పేజీ తరువాయి)**
లక్షలాది గా పాల్గొన్న అవకాశం ఉన్నందున చేయాల్సిన ఏర్పాట్ల వారు డిపార్ట్‌మెంట్ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ లో జరిగే గణేశ్ ఉత్సవాల కోసం అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకొని పని చేయాలని ఆదేశించారు 11 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో శాంతి భద్రతల సమస్య వస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో రంజాన్ , మొహర్రం , బోనాలు విజయవంతంగా చేసుకున్నామని, గణేశ్ ఉత్సవాలు కూడా ఎలాంటి విఘ్నాలు లేకుండా ప్రశాంతంగా నిర్వహంకోవాలన్నారు. పోలీస్ , విద్యుత్, రవాణా, ఆర్టీసి ,మెట్రో ,జీహెచ్ఎంసీ, హెచ్ఎండిఏలు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.గత సంవత్సరం కంటే 10 శాతం విగ్రహాలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలో 141 లాగింగ్ పాయింట్స్ దగ్గర త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. బేబీ పాండ్స్ ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు కు అనుగుణంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలను పూజించేలా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 7 జోన్ల పరిధిలో జోనల్ కమిషనర్, డిసిపి లతో మండపాల నిర్వాహకులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. భాగ్య నగర్ గణేశ్ ఉత్సవ సమితి సూచించిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మట్టి విగ్రహాల పంపిణీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు...
సెప్టెంబర్ 7-17 మధ్య జరిగే గణేశ్ ఉత్సవాల్లో శాంతి భద్రతల విషయంలో , నిమజ్జనం త్వరగా పూర్తి అయ్యేందుకు హైదరాబాద్, సైబరాబాద్ , రాచకొండ కమిషనరేట్ ల పరిధిలో తీసుకుంటున్న చర్యల పై పోలీసు అధికారులు వివరించారు. ఖైరతాబాద్ వినాయకుడిని నిమజ్జనం చేసేటప్పుడు పూర్తిగా మునిగేలా జీహెచ్ఎంసీ అధికారులు అక్కడ ఏర్పాట్లు చేయాలని, లేదంటే అక్కడికి భక్తులు అధికంగా వచ్చి ఇతర విగ్రహాల నిమజ్జనం ఆలస్యం జరిగే అవకాశం ఉందని మంత్రులు తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు శానిటేషన్ సిబ్బంది ని ఏర్పాటు చేసి వెంట వెంటనే తొలగించాలని సూచించారు. పండగ లోపు రోడ్ల మరమత్తులు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. రవాణా శాఖ అధికారులు నిమజ్జనం కోసం వాహనాలు సిద్ధం చేసుకోవాలని టస్కర్ వాహనాలు , డ్రైవర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండపాల నుండి నిమజ్జనం వరకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ప్రతి వినాయకుడితో ఒక పోలీస్ ఉంటే త్వరగా నిమజ్జనం కావడానికి అవకాశం ఉంటుందని సూచించారు . హైదరాబాద్ సిటీలోనే కాకుండా శివారు ప్రాంత ట్యాంక్ లలో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. గణేశ్ ఉత్సవాలు జరిగే 11 రోజుల పాటు నగరంలో ట్రాఫిక్ విషయంలో తీసుకోవాల్సిన చర్యల పై సూచించారు. ధూల్‌పేట్ లో విగ్రహాల తీసుకుపోవడానికి అధిక ట్రాఫిక్ ఉంటుందని అక్కడ రోడ్లు ఇబ్బందులు లేకుండా చూసుకోవడంతో పాటు రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు,జంక్షన్ లో వద్ద మండపాలు ఏర్పాటు చేయవద్దని ఉత్సవ కమిటీ లకు సూచించారు. పెద్ద వినాయకులు వెళ్ళే ప్రాంతాల్లో ట్రీ ట్రిమ్మింగ్ చేయాలని ,చిన్న విగ్రహాలను టస్కర్ లాంటి పెద్ద వాహనాలు కాకుండా చిన్న వాహనాలు వాడితే పెద్దగా ఇబ్బందులు ఉండవన్నారు. ఫిట్నెస్ ఉన్న వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలని,మంచి డ్రైవర్ ,డీజిల్ కూడా అదనంగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ట్యాంక్ బండ్ ,ఎన్టీఆర్ మార్గ్ లో విగ్రహాల నిమజ్జనానికి 22 ప్లాట్ ఫారం లు ఏర్పాటు చేస్తున్నామని హెచ్ఎండిఏ కమిషనర్ వెల్లడించారు. ట్యాంక్ బండ్ పైన 33 క్రేన్లుపెడుతున్నామని, అదనంగా అవసరం ఉంటే మరిన్ని క్రేన్స్ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 100 స్టాటిస్టిక్ క్రేన్స్,150 మొబైల్ క్రేన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈసారి గత సంవత్సరం కంటే ఎక్కువ విగ్రహాలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశామని అందుకు తగిన విధంగానే ఏర్పాట్లు చేస్తున్నారు. 10,500 మంది నిమజ్జనం ప్రాంతంలో శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు . నిమజ్జనం తరువాత వెస్టేజ్ కవరేజ్ డంప్ కోసం 100 టిప్పర్స్ ,20 జేసిబి లు ఏర్పాటు చేశారు. ఈసారి జీహెచ్ఎంసీ ,హెచ్ఎండిఏ నుండి 5 లక్షల మట్టి విగ్రహాలు పంపిణీ చేయనున్నారు. అర్అండ్ బి అధికారులు బారికేడ్ల విషయంలో జాగ్రత్త చర్యలు తీసుకోవాలనీ సూచించారు. ఖైరతాబాద్ దగ్గర డిమాండ్ మేరకు ఉత్సవాల సమయంలో అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లను నడిపిస్తామని నిమజ్జనం సమయంలో అర్ధరాత్రి వరకు 1-2 వరకు నడుస్తాయని మెట్రో అధికారులు తెలిపారు. ప్రత్యేకంగా అదనంగా మెట్రో నడిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఎంటీఎస్ రైళ్లు అదనంగా , 650 వరకు అందనంగా ఆర్టీసి బస్సులు నడుపుతున్నట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2000 మంది కళాకారులతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు కల్చరల్ డిపార్ట్మెంట్ ప్రత్యేకంగా సిద్ధమవుతుంది. గణేష్ మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్లు విద్యుత్ ఉద్యోగులతోనే తీసుకోవాలని లేదంటే షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఉత్సవాల కోసం 57 ట్రాన్స్ ఫార్మర్లు ,22 మొబైల్ ట్రాన్స్ ఫార్మర్లు ,3457 మంది విద్యుత్ సిబ్బంది పని చేయనున్నారు. ప్రధాన రోడ్లు ,గల్లీలో విద్యుత్ కేబుల్ లు వ్రేలాడకుండా చూడాలని ఆదేశించారు. 108 అంబులెన్స్ లు ప్రత్యేక వైద్య సిబ్బంది ,నిమజ్జనం జరిగే ప్రాంతంలో ప్రాథమిక చికిత్స కేంద్రాల ఏర్పాటు చేయనున్నారు. ఖైరతాబాద్ బడా గణేష్ వద్ద ప్రత్యేక హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నారు. నగరంలో ఉన్న 4 ప్రధాన వినాయక దేవాలయాలలో నవరాత్రి ఉత్సవాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. భాగ్య నగర్ గణేశ్ ఉత్సవ సమితి తో పాటు పలు కమిటీ లు ప్రభుత్వం దృష్టికి పలు అంశాలు తీసుకొచ్చారు. భక్తులకు మొబైల్ టాయిలెట్స్ , మంచి నీటి సౌకర్యం,భక్తులకు ఆహార ఏర్పాట్లు చేయాలని సూచించారు.పోలీసులు అనుమతులు విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి మాట్లాడుతూ నగరంలో రోడ్ల మరమత్తులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. సెప్టెంబర్ 1 నుండి స్వయంగా అన్ని ప్రాంతాల్లో పర్యవేక్షిస్తున్నారు. బేబీ పాండ్స్ లో ఫ్రెష్ వాటర్ ఉండేలా చేయడంతో నిమజ్జనం జరుగుతున్న చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మి, డిప్యూటీ మేయర్ ,రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్,మోతే శ్రీలత శోభన్ రెడ్డి , డీజీపీ జితేందర్ , రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ , హైదరాబాద్ ,మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు ,హైదరాబాద్ , రాచకొండ కమిషనర్లు హైదరాబాద్ నగర ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# ఓరల్ కలరా వ్యాక్సిన్ తీసుకొచ్చిన భారత్ బయోటెక్

**(మొదటి పేజీ తరువాయి)**
ప్రపంచవ్యాప్తంగా 8,24,749 మందికి కలరా సోకగా అందులో 5,900మంది మరణించారు. సుమారు 31దేశాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఈ నేపథ్యంలోనే వ్యాక్సిన్ కొరతను తీర్చేందుకు ఓరల్ వ్యాక్సిన్‌ను తీసుకొచ్చినట్లు భారత్ బయోటెక్ సంస్థ వెల్లడించింది.. దీనిని సింగపూర్‌కు చెందిన హిల్‌మాన్ లేబొరేటరీస్ లైసెన్స్‌తో అభివృద్ధి చేసినట్లు భారత్ బయోటెక్ వెల్లడించింది. కలరా అనేది నివారించదగినది. అయినప్పటికీ 2021 నుంచి ఈ వ్యాధి వల్ల మరణిస్తున్న వారి సంఖ్య ఏ మాత్రం తగ్గడం లేదు. 2023 ప్రారంభం నుంచి 2024 మార్చి వరకు 31 దేశాల్లో 8,24,479 కేసులు నమోదయ్యాయి. ఇందులో సుమారు 5,900 మంది మరణించారు. ఈ మరణాల సంఖ్యను తగ్గించడానికి భారత్ బయోటెక్ ఓరల్ కలరా వ్యాక్సిన్ తీసుకొచ్చింది. భారత్ బయోటెక్ ఈ వ్యాక్సిన్‌ను 200 మిలియన్ డోస్‌ల వరకు ఉత్పత్తి చేయడానికి హైదరాబాద్, భువనేశ్వర్‌లలో పెద్ద ఎత్తున తయారీ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసినట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. దీన్ని బట్టి చూస్తే సంస్థ ఈ వ్యాక్సిన్ ఉత్పత్తిని వేగంగా అభివృద్ధి చేయడానికి కావలసిన ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా కలరా నివారించడానికి 'హిల్‌చోల్' ఓ అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుంది. ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినందుకు భారత్ బయోటెక్ బృందాన్ని నేను అభినందిస్తున్నాను. 2030 నాటికి కలరా సంబంధిత మరణాల సంఖ్య 90 శాతం తగ్గించాలనేది ప్రధాన లక్ష్యం అని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా అన్నారు.

**కలరా ఎలా వ్యాపిస్తుంది?**

పరిశుభ్రత లేని ప్రాంతాల్లో కలరా ఎక్కువగా వ్యాపిస్తుంది. కలరా వ్యాప్తికి ప్రధాన కారణం కలుషిత నీరు, ఆహార పదార్థాలు. ఈ సమస్య ప్రకృతి వైపరీత్యాల వల్ల, పరిశుభ్రమైన నీరు లభించని ప్రాంతాల్లో నివసించే ప్రజలలో ఎక్కువగా కనిపిస్తుంది. కలరా సోకినా తరువాత ఏ మాత్రం నిర్లక్ష్యం చేసిన మనిషి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది.

## సెప్టెంబర్ 17 నుంచి ప్రజా పాలన

**(మొదటి పేజీ తరువాయి)**



మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి ఈ సమావేశంలో పాల్గొన్నారు. హెల్త్ డిజిటల్ కార్డుల జారీకి ఎలాంటి పద్ధతి అనుసరించాలి? ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ ను నమోదు చేసేందుకు ఏయే వైద్య పరీక్షలు చేయాలి?గ్రామాల్లోనే హెల్త్ చెకప్ శిబిరాలు ఏర్పాటు చేయాలా... రాష్ట్రంలో ఉన్న లాబోరేటరీల సాయం తీసుకోవాలా...? వెంటనే పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. హెల్త్ డిజిటల్ కార్డుకు సంబంధించి ఫ్రాన్స్‌లో ఉత్తమమైన విధానం అనుసరిస్తున్నట్లు ఇటీవల విదేశీ పర్యటనలో తనను కలిసిన ప్రతినిధులు చెప్పారని, అక్కడ అనుసరించే విధానాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలకు, సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించేందుకు ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే హెల్త్ కార్డు ప్రామాణికంగా ఉంటుందని సీఎం అన్నారు.

**ఆరోగ్యంతో చెలగాటమాడితే సస్పెన్షనే...**

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డెంగ్యూ, చికున్ గున్యా, వైరల్ జ్వరాలతో వివిధ ఆసుపత్రుల్లో పెరుగుతున్న కేసులపై ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధులు రాకముందే తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్తో పాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్, స్ప్రే ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని, ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేయాలని సీఎం ఆదేశించారు. పని చేయని ఉద్యోగులను, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టే చర్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేయాలని సీఎం హెచ్చరించారు.

**అధికారుల మధ్య సమన్వయం అవసరం**

జీహెచ్ఎంసీ పరిధిలోని అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ సమన్వయంతో పని చేయాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే పోలీసు విభాగం, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సహకారంతో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని జిల్లాల్లోనూ కలెక్టర్లు, పంచాయతీరాజ్ అధికారులు సీజనల్ వ్యాధులపై వెంటనే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, పలు గ్రామాలు, పట్టణాలకు వెళ్లి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. డెంగ్యూ, చికున్ గున్యా కేసులు నమోదైన ప్రాంతాలకు వెళ్లి కారణాలను గుర్తించాలని, అవసరమైన పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

### రాజ్యసభ సభ్యునిగా అభిషేక్ మనుసింఘ్వీ

# ఏకగ్రీవంగా ఎన్నిక

**విశ్వంభర , తెలంగాణ బ్యూరో:** తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మనుసింఘ్వీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజ్యసభ అభ్యర్థిత్వానికి రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. వీటిలో కాంగ్రెస్ నుంచి అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ వేయగా, రెండోది స్వతంత్ర అభ్యర్థిగా పద్మరాజన్ నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేలు బలపరచకపోవడంతో పద్మరాజన్ నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించింది. దీంతో అభిషేక్ మను సింఘ్వీ ఏకగ్రీవంగా రాజ్యసభకు ఎన్నిక అయ్యారు. అభిషేక్ మను సింఘ్వీ తరఫున కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

**కాంగ్రెస్‌లో అభిషేక్ మను సింఘ్వీ ప్రస్థానం**

అభిషేక్ సింఘ్వీ సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారు. 2001 నుంచి కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారు. రెండు దఫాలు రాజ్యసభ సభ్యుడుగా ఉన్నారు. అవి 2006, 2018లో రెండుసార్లు ఆ హోదాను పొందారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్ నుంచి పోటీ చేసి బీజేపీ చేతిలో ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలో ఆయన తెలంగాణ నుంచి పోటీ చేయాలని ఏఐసీసీ నిర్ణయించింది. కానీ తెలంగాణలో రాజ్యసభ సభ్యత్వం కోసం స్థానిక నాయకులు కొందరు ప్రయత్నించారు. కానీ జాతీయ రాజకీయాల్లో సింఘ్వీ సేవలు కాంగ్రెస్‌కు కీలకమైనందున ఆయనకే అధిష్ఠానం అవకాశం ఇచ్చింది. ఇప్పుడు ఆయన రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.తెలంగాణ రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ ఆగస్టు 19వ తేదీన శాసనసభలో నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పాల్గొన్నారు. కేశవరావు రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీకి కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నిక నిర్వహించాలని నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్ వేసేందుకు గడువు ఇచ్చారు. అయితే అభిషేక్ సింఘ్వీతో పాటు స్వతంత్ర అభ్యర్థిగా పద్మరాజన్ నామినేషన్ దాఖలు చేశారు. రెండు నామినేషన్ వచ్చినట్లు అయితే ఎన్నిక నిర్వహించాలి. కానీ స్వతంత్ర అభ్యర్థికి ఎమ్మెల్యేల మద్దతు లేకపోవడంతో సింఘ్వీనే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# ప్రభుత్వ ఆసుపత్రులకు శాపంగా కాంగ్రెస్ ప్రభుత్వం

**(మొదటి పేజీ తరువాయి)**
మంగళవారం పోస్ట్ చేశారు. ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కు అయిన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి కాంగ్రెస్ పాలనలో దిక్కులేకుండా పోయిందని అన్నారు. నిత్యం వేలాదిమందికి వైద్యసేవలు అందించే ఆసుపత్రి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల ఆవరణలో ప్రైవేటు ఫార్మసీలు ఎందుకని ప్రశ్నించారు. ఆసుపత్రిలో మందుల కొరత కారణంగా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మందులు లేవని చేతులెత్తేయడంతో చేసేది లేక రోగులు ప్రైవేటు ఫార్మసీలకు వెళ్తున్నారని పేర్కొన్నారు. డబ్బులు చెల్లించి మందులు కొనుగోలు చేస్తూ ఆర్థిక భారాన్ని మోస్తున్నారని అన్నారు. మూడు నెలల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఒక్క ఎంజీఎం ఆసుపత్రే కాదు దాదాపు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు నిండుకున్నాయని హరీశ్‌రావు తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం మూడు నెలలకు సరిపడా మందులు బఫర్ స్టాక్‌గా పెట్టుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తున్నదని ప్రశ్నించారు. ప్రైవేటు మెడికల్ షాపులకు లాభం చేకూర్చేందుకే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల సరఫరా నిలివేస్తున్నట్లా అని నిలదీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల ఆవరణలో ప్రైవేటు ఫార్మసీలను ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. ఆసుపత్రులకు మందులు సరఫరా చేయాల్సిన టీఎస్ఎంఎస్ఐడీసీ ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రభుత్వ ఆసుపత్రులకు శాపంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజల మన్ననలు పొందిన ప్రభుత్వ ఆసుపత్రులు కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆగ్రహానికి గురవుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా స్పందించి అన్ని రకాల మందులు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులపై ఆర్థిక భారం పడకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# హుస్సేన్‌సాగర్‌లో భారీగా పెరిగిన కాలుష్యం



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** వినాయక నిమజ్జనంతో హుస్సేన్ సాగర్‌లో కాలుష్యం అనూహ్యంగా పెరిగినట్లు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) తాజా నివేదిక వెల్లడించింది. నిమజ్జనానికి ముందు, ఆ తర్వాత రోజుల్లో సాగర్ నీటి నమూనాలను సేకరించి.. పరీక్షించగా పలు ఆందోళనకర అంశాలు వెలుగు చూశాయి. నీటి రంగు, బురద రేణువులు, కరిగిన ఘన పదార్థాలు, బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్, కెమికల్ ఆక్సిజన్ డిమాండ్, భార లోహాల మోతాదు పరిమితికి మించి పెరిగినట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. నిమజ్జనానికి ముందు ఆగస్టు 29 తోపాటు నిమజ్జనం జరిగిన తేదీలు సెప్టెంబరు 2,5, 7, 9 తేదీలలో.. నిమజ్జనం అనంతరం సెప్టెంబరు 12న సీబీ నిపుణులు.. ఎన్‌టీఆర్‌పార్క్, లుంబినీ పార్క్, నెక్లెస్ రోడ్, లేపాక్షి పాయింట్, సాగరం మధ్యనున్న బుద్ధవిగ్రహంవద్ద నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షించారు.

నిమజ్జనంతో పీసీబీ సేకరించిన అన్ని పాయింట్ల వద్ద కాలుష్య మోతాదు భారీగా పెరిగినట్లు గుర్తించారు. ఎన్‌టీఆర్ పార్క్ నిమజ్జనానికి ముందు సరాసరిన లీటరు నీటిలో బురద రేణువుల మోతాదు 45 మిల్లీగ్రాములుండగా.. అనంతరం ఏకంగా 152 మిల్లీ గ్రాములకు చేరింది. నీటి గాఢత కూడా 7.24 పాయింట్లుగా నమోదైంది. కరిగిన ఘన పదార్థాల మోతాదు 712 మిల్లీగ్రాముల నుంచి 848 మిల్లీగ్రాములకు పెరిగింది. కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ 37 మిల్లీగ్రాములుండగా.. నిమజ్జనం తర్వాత ఏకంగా 164 మిల్లీగ్రాములకు చేరింది. బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్ 10 మిల్లీగ్రాముల నుంచి 30 మి.గ్రా మేర పెరిగింది. భార లోహాలు క్రోమియం, లెడ్, జింక్, కాపర్, క్యాడ్మియం తదితరాల మోతాదు కూడా పెరిగినట్లు నివేదిక వెల్లడించింది.

లుంబినీ పార్క్ వద్ద నీరు ఆకుపచ్చ రంగులోకి మారింది. బురద రేణువుల మోతాదు అత్యధికంగా 1340 మి.గ్రా నమోదైంది. గాఢత 8.12 పాయింట్లకు చేరింది. కరిగిన ఘన పదార్థాల మోతాదు 831 మి.గ్రా నమోదైంది. కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ 284 మిల్లీ గ్రాములుగా.. నీటి కాఠిన్యత మి.గ్రాములకు చేరింది. నెక్లెస్‌రోడ్ వద్ద: బురద రేణువులు 112 మి.గ్రాములకు చేరువయ్యాయి. గాఢత 8.24 పాయింట్లుగా ఉంది. కరిగిన ఘన పదార్థాలు 829 మిల్లీగ్రాములుగా ఉన్నాయి. ఈ-కోలి బ్యాక్టీరియా ఆనవాళ్లు బయటపడ్డాయి.

కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ 160 మిల్లీగ్రాములుగా ఉంది. నీటి కాఠిన్యత 404 మి.గ్రాములకు చేరింది. లేపాక్షి: బురద రేణువులు 100 మి.గ్రాములకు చేరాయి. నీటి గాఢత 8.50 పాయింట్లకు చేరింది. కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ 126 మిల్లీగ్రాములుగా ఉంది. కాఠిన్యత 326 మి.గ్రా ఉంది. బుద్ధ విగ్రహం వద్ద: బురద రేణువులు 96 మి.గ్రా నమోదయ్యాయి. కరిగిన ఘన పదార్థాలు 832 మి.గ్రా ఉన్నాయి. కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ 101 మి.గ్రా.. కాఠిన్యత 426 మి.గ్రా ఉంది. బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్ 24 మిల్లీగ్రాములుగా ఉంది.

### అనర్థాలివే..

* సాగర్‌లో సహజ ఆవరణ వ్యవస్థ దెబ్బతింటుంది. చేపలు, పక్షులు, వృక్ష, జంతు అనుఘటకాల మనుగడ ప్రశ్నార్థకమవుతుంది.
* పర్యావరణం దెబ్బతింటుంది. సమీప ప్రాంతాల్లో గాలి, నీరు కలుషితమవుతుంది. దుర్వాసన వెలువడే ప్రమాదం ఉంది.
* సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు గరళంగా మారతాయి.
* వీటితో పాటు క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియం, మాలిబ్డినమ్, సిలికాన్‌లు జలాశయం ఉపరితలంపై తెట్టుగా ఏర్పడతాయి.
* జలాశయాల అడుగున క్రోమియం, కోబాల్ట్, నికెల్, కాపర్, జింక్, కాడ్మియం, లిథియం వంటి హానికారక మూలకాలు అవక్షేపంగా ఏర్పడతాయి.

# కవితకు బెయిల్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ కీలక వ్యాఖ్యలు

- కవిత బెయిల్ ఊహించిందేనన్న మహేష్ కుమార్ గౌడ్
- ఇక మిగిలింది బీజేపీలో బీఆర్ఎస్ విలీనమేనని జోస్యం



**విశ్వంభర, హైదరాబాద్ :** దేశంలో సంచలనంగా మారిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితురాలిగాగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఎట్టకేలకు 153 రోజుల జైలు తర్వాత బెయిల్ దొరికింది. అయితే.. ఈ పరిణామంపై బీఆర్ఎస్ శ్రేణులు, జాగృతి కార్యకర్తలు సంబురాలు చేసుకుంటుంటే.. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ నేతలు రకరకాల విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే.. ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కవిత బెయిల్ ఊహించిందేనని.. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కుతోనే బెయిల్ వచ్చిందంటూ మహేష్ కుమార్ ఆరోపించారు.

మొన్నటి వరకు చీకటి ఒప్పందాలతో కాంగ్రెస్‌ని ఆ రెండు పార్టీలు దెబ్బతీయాలని చూశారని మహేష్ కుమార్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై.. బీజేపీకి బీఆర్ఎస్ దాసోహం అయ్యిందని ఆరోపించారు. ఢిల్లీలో హరీష్ రావు, కేటీఆర్.. బీజేపీ నేతల చుట్టూ ఆపద మొక్కులు మొక్కారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతల ఇళ్ల చుట్టూ తిరిగి కాళ్ల మీద పడి కవితకు బెయిల్ తెచ్చుకున్నారన్నారు. ఈ విషయాన్ని తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఈ బెయిల్ మంజూరుతో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు బయటపడ్డాయని తెలిపారు. ఇక కవితకు బెయిల్ రావటంతో ఇక మిగిలింది ఒకటే అని మహేష్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణ చేశాదరు . త్వరలోనే బీజేపీలో బీఆర్ఎస్ విలీన ప్రక్రియ మొదలు అవుతుందంటూ జోస్యం చెప్పారు.

# దోమల నిర్మూలన నిరంతరంగా కొనసాగాలి

- జీహెచ్ఎంసీ అధికారులతో టెలీ కా న్ఫరెన్స్
- సిటీలో ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ పీఎస్ దాన కిషోర్



**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రేటర్ పరిధిలో దోమల నివారణ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిరంతరంగా జరిగేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ అధికారులను ఆదేశించారు. ప్రజలు దోమకాటు బారిన పడకుండా చూడాలని కూడా సూచించారు.

మంగళవారం సాయంత్రం హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ పరిధిలోని జోనల్ కమిషన్ కమిషనర్లు డిప్యూటీ కమిషనర్లు సహాయ కమిషనర్లు , ఎంటమాలజిస్ట్, వైద్యాధికారులతో గ్రేటర్ పరిధిలో అమలు చేస్తున్న దోమల నివారణ కార్యక్రమాలు ప్రభావవంతంగా చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించటంతో పాటు సిటీలో పలు ప్రాంతాల్లో ఆకస్మికబుంగా తనిఖీలు నిర్వహించారు. గ్రేటర్ పరిధిలో దోమల నియంత్రణకు ఆంటీ లార్వా ఆపరేషన్ లను రెగ్యులర్ గా చేపట్టాలన్నారు.

బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి డెంగ్యూ కేసుల వివరాలను తెలుసుకోవాలన్నారు. హాట్ స్పాట్ ఏరియాలను సందర్శించి దోమల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని పాఠశాలలోని విద్యార్థులకు దోమ కాటు వల్ల వచ్చే వ్యాధులు, వాటి నివారణ తీసుకోవలసిన చర్యల పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నీటి వనరుల లో గాంబూసియా చేపలను వదలాలన్నారు. లార్వా వృద్ధి చెందకుండా అయిల్ బాల్ లు వేయాలన్నారు. సాయంత్రం వేళల్లో ఫాగింగ్ యాక్టివిటీని రెగ్యులర్ గా చేపట్టాలన్నారు. అవసరమైన చోట హెల్త్ క్యాంపుల ను నిర్వహించాలన్నారు. జోనల్ కమిషన్ కమిషనర్లు డిప్యూటీ కమిషనర్లు, సహాయ కమిషనర్లు , ఎంటమాలజిస్ట్ లు దోమల నివారణ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించాలని అదేశించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వా ఆపరేషన్ లు ముమ్మరంగా చేపట్టాలన్నారు.

### దోమల నివారణ కార్యక్రమాల ఆకస్మిక తనిఖీ

నగనరంలోని ఎన్ బీటీ నగర్ , మినిస్టర్స్ క్వార్టర్స్, మిథిలా నగర్, రేషం బాగ్ లలో దోమల నివారణ కార్యక్రమాలను మంగళవారం రాత్రి ముఖ్య కార్యదర్శి దాన కిషోర్జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, చీఫ్ ఎంటమాలజిస్ట్ రాంబాబు లతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. దోమల నివారణ ఆక్టివిటీస్ ను రెగ్యులర్ గా నిర్వహించాలని ఈ సందర్భంగా దాన కిషోర్ అధికారులను ఆదేశించారు.

# దేశ రాజకీయ కుట్రలో తెలంగాణ ఆడబిడ్డ బలి

- రాష్ట్రంలో బీఆర్ఎస్ లేకుండా చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ పెద్దలు వ్యవహరించారు
- మాజీ ఎంపీపీ పడగల మానస రాజు
- ఎమ్మెల్సీ కవిత బెయిల్ మంజూరుపై తంగళ్ళపల్లిలో బిఆర్ఎస్ నాయకురాలు సంబురాలు



**విశ్వంభర, తంగళ్లపల్లి :** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు ఎమ్మెల్సీ కవితను అన్యాయంగా కేసులు పెట్టి ఒక ఆడబిడ్డను ఇబ్బందులకు గురిచేసారని బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ పడగల మానస రాజు విమర్శించారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరుపై తంగళ్లపల్లి పట్టణంలోని బాణసంచ పేల్చి మిఠాయిలు తినిపించుకొని సంబురాలు జరుపుకున్నారు. ఈరోజు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తున్నామని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయడమే లక్ష్యంగా కొంతమంది కేంద్ర ప్రభుత్వ పెద్దలు వ్యవహరించాలని దీనిని దేశ ప్రజలు గమనించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఈడి ఎమ్మెల్సీ కవితపై పెట్టిన కేసులు ఆరోపణలుగా మాత్రమే మిగిలిపోయాయని, 100 కోట్లు గాని ఇలాంటి ఆస్తులను కానీ రికవరీ చేయలేకపోయారని విమర్శించారు. ఎప్పటికైనా కవిత పై పెట్టిన కేసుల్లో న్యాయమే గెలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏ.ఐ.పీ.ఎస్.ఓ) కార్యాచరణ

ప్రియమైన పీస్ లవింగ్ మిత్రులకు

అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏ.ఐ.పీ.ఎస్.ఓ) జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఢిల్లీలో ఆగస్టు 16 నుండి 18 తారీకు వరకు జరిగిన విషయాలు మీకు తెలిసిందే. ఈ సమావేశాల్లో అంతర్జాతీయ, జాతీయ సమస్యల గురించి, మన సంఘం బలోపేతం గురించి, నిర్మాణం గురించి, విస్తరణ గురించి, చర్చించడం జరిగింది. అదేవిధంగా ఈ సంవత్సరం చేయవలసిన సభ్యత్వ కోటాలు పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగింది. ఇప్పటి వరకు సభ్యత్వం చేయని జిల్లాలలో వెంటనే సభ్యత్వం చేర్పించాలి. ఈ క్రింది కార్యక్రమాలను కూడా కచ్చితంగా నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పక్షాన మీ అందరిని కోరుతున్నాం.

**కార్యక్రమాలు :**

**సెప్టెంబర్ ఒకటి:** ప్రపంచ శాంతి దినోత్సవం. ఈ సందర్భంగా అన్ని జిల్లాల్లో సమావేశాలు జరపాలి. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు ఏదైనా నిర్వహించవచ్చు. ప్రపంచ శాంతి ప్రాముఖ్యత గురించి తెలియజేయాలి.

**సెప్టెంబర్ 21:** ప్రపంచ శాంతి దినోత్సవం జరపాలని ఐక్యరాజ్యసమితి పిలుపు. ఈ పిలుపుని జయప్రదం చేయాలని ఐప్ సో పిలుపు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించినట్లే రాష్ట్ర కేంద్రంలో కవి సమ్మేళన కార్యక్రమం నిర్వహించబడుతుంది. మీ జిల్లాల్లో వీలైన చోట్ల విద్యార్థులకు యువ కవులను ఆహ్వానించి ప్రపంచ శాంతి మీద కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తే బాగుంటుంది.

**అక్టోబర్ రెండు :** గాంధీ జయంతి ఈ సందర్భాన్ని పురస్కరించుకొని "ఫైట్ ఫర్ గాంధీజీ డ్రీమ్ ఫర్ సెక్యులరిజం అండ్ ఫ్రీ పాలస్తీనా" అంశంపై విస్తృతంగా సమావేశాలు, ప్రదర్శనలు, సెమినార్లు, డిబేట్స్ నిర్వహించ వలెననే పిలుపునిచ్చింది.

అన్ని జిల్లాలో సెప్టెంబర్ చివరినాటికి గాని అక్టోబర్ 15 వరకు గానీ వెంటనే సభ్యత్వాన్ని పూర్తి చేయాలని నిర్ణయం చేయడం జరిగింది. కాబట్టి మీ కోటాల మేరకు మీరు సభ్యత్వాన్ని పూర్తి చేయాలని కోరుతున్నాం.

ఇప్పటివరకు రాష్ట్ర మీ కోటాలో కొంతమేరకు సభ్యత్వాన్ని చెల్లించిన జిల్లాల బాధ్యులకు అభినందనలు. మీరు మిగిలిన సభ్యత్వంతో పాటు మిగిలిన జిల్లాలు వెంటనే సభ్యత్వాన్ని పూర్తి చేయాలి.

**శాంతి ఉద్యమాభినందనలతో**


**రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కే.వీ.ఎల్,**
**ప్రధాన కార్యదర్శులు జీ. నాగేశ్వరరావు, కోత్వాల్ ఒబేదుల్లా, డా. కాచం సత్యనారాయణ**






# హాస్యంలో మేటి ...భమిడిపాటి

## నేడు (ఆగస్టు 28) హాస్యబ్రహ్మ వర్ధంతి



హాస్య చమత్కార మాటలు, సంభాషణలు, రచనల కోసం జీవితాంతం తపించి, తపస్సు చేసిన వ్యక్తి భమిడిపాటి కామేశ్వర రావు. ఆయన హాస్య బ్రహ్మగా గుర్తింపు పొందారు.

భమిడిపాటి కామేశ్వరరావు (ఏప్రిల్ 28, 1897 - ఆగస్టు 28, 1958) రచయిత, నటుడు, నాటక కర్త. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో 1897 ఏప్రిల్ 28న నరసావధానులు, లచ్చమ్మ దంపతులకు జన్మించారు. వీరు భీమవరం లో పాఠశాల విద్యను పూర్తి చేసి, ప్రతిభావంతులైన విద్యార్థులకిచ్చే ఉపకార వేతనం సహాయంతో, పిఠాపురం మహారాజా కళాశాలలో గణితంలో పట్టా పొందారు. తరువాత కొంత కాలం నరసాపురం, కాకినాడ లలో ఉపాధ్యాయునిగా పని చేశారు. 1922లో ఎల్.టి పరీక్షలో ఉత్తీర్ణులై రాజమండ్రి వీరేశలింగం ఆస్తిక ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర అధ్యాపక పదవిలో స్థిరపడి, అదే పాఠశాలకు రెండు సంవత్సరాలు ప్రధానోపాధ్యాయ బాధ్యతలను కూడా నిర్వహించారు. ఉపాధ్యాయునిగా పనిచేస్తూ చాలా నాటకాలు, నాటికలు, కథలు రచించారు. సమకాలీన సాంఘిక సమస్యలను తమ రచనలలో హాస్యరసాను రంజకంగా మలచిన ప్రజ్ఞాశాలి కావడం వల్ల హాస్య బ్రహ్మగా గుర్తింపు పొందారు. త్యాగరాజు రచనలను, జీవితాన్ని చక్కగా పరిశీలించి రాగ, తాళ, వాద్యాలను ఆ గాయకుని భావానికి అనుగుణంగా సమకూర్చుకుని 'త్యాగరాజు ఆత్మ విచారం' రచన చేశారు. తన అభిప్రాయాలకు అనుగుణంగా రచించిన తన నాటకాలను రాజమండ్రి కళాశాల వార్షికోత్సవాలలో ఆయనే దర్శకత్వం వహించి ప్రదర్శించే వారు. ఆయన స్వయంగా నటులు కూడా. ద్విజేంద్రలాల్ రచించిన 'చంద్రగుప్త'లో శక్తి సింహ పాత్ర పోషణ ద్వారా ఖ్యాతిని పొందారు.

కామేశ్వర రావు ఎక్కువగా నాటికలు ముఖ్యంగా హాస్య ప్రధానమైన రచనలు చేశారు. ఆయన నాటికలకు చాలాభాగం ఫ్రెంచి నాటక కర్త మోలియర్ రాసిన నాటికలు ఆధారం. ఆయన

### మన తెలుగు వ్యాసం నుంచి...

**నూటికి నూరుమంది పైచిలుకు మాట్లాడే తెలుగు కలగాపులగమే. ఈ పులగంలో సంస్కృతం, పార్శీ, ఇంగ్లీషు మాత్రం జోరుగా పడ్డాయి. తెలుగు యొక్క మెత్తదనం వల్లనే ఇన్నిన్ని భాషల పదాలు బాణాల్లాగ హృదయంలో నాటే లాగ తెలుగులో గుచ్చుకుని ఉన్నాయి. తెలుగు శరీరంలో వాటిని నిల్చి ఉండనిస్తే అవి సెలలు వేసి ప్రాణం తీసేస్తాయని కొందరూ, లేక వాటిని పైకి లాగిపారేస్తే వెంటనే ప్రాణం పోకట అని కొందరూ.**

అనేక విషయాల మీద రాసిన వ్యాసాలు 20వ శతాబ్దపు మొదటి అర్ధ భాగం లోని సామాజిక పరిస్థితులను తెలియ చేస్తాయి. ఆయన హాస్యం చదువరికి చురుక్కు మనిపిస్తుంది. ఆయన ఉత్తమ మైన హాస్య రచనలతో ఎందరినో మనసారా నవ్వించిన 1958, ఆగస్టు 28 న పరమ పదించారు. భమిడిపాటి కామేశ్వర రావు అనేక హాస్య రచనల నుండి కొన్ని వాక్యాలు హాస్య పూరకమై, ఈనాటికి సందర్భోచితంగా ఉంటాయి. వాటిల్లో కొన్ని తీసుకుంటే......

**పరీక్షలు వ్యాసం నుంచి...**

పరీక్షల కోసం, మార్కుల కోసం మాత్రమే బాధపడే వాడికి, విద్య అంటదు. విద్యకోసం పాటుపడే వాడికి పరీక్షవల్ల బాధే ఉండదు....జీవితం ఒక పెద్ద నిత్య పరీక్ష. జీవిత పరీక్షకి ఎప్పుడో తయా రు అవుతానులే అనడం కాక, అప్పటికప్పుడు తయారుగా ఉండడం మానవుడి విధి.

**పాలక సంఘాల్లో ఎన్నికల మజా అన్న వ్యాసం నుంచి...**

జనం పంపిన మీదట పాలక సంఘంలోకి వెళ్ళి, వెంటనే ఆ జనాన్ని మరచి పోడమే ఎన్నికల్లో మజా; ఒకవేళ జ్ఞాపకం ఉంచుకున్నా, ఆ జనుల్లో మొదటి జనుడు తనేగదా అనుకోడం మరీ మజా. ఒకడు పాడు పన్లు చేస్తూ ఉంటే, మనం కూడా, నెగ్గాలంటే, అంతకంటే పాడుపనులు చెయ్యవలసి వచ్చేది ఎన్నికల్లోనే. ఎన్నికల నిఘంటువులో అసత్యం అధర్మం, అన్యాయం, ద్రోహం క్రౌర్యం, దారుణం లాంటి మాటలుండవు.

**ఆ కన్నీళ్లకు ఇంకా కొంత సమయం ఉంది...**

గొంతు కేన్సర్ తో జీవిత చరమాంకంలో ఇంట్లో మంచంలో పడివున్న భమిడి పాటిని చూసేందుకు వచ్చిన బంధువులు, మిత్రులకు ఆయన ఉన్న పరిస్థితి చూసి కళ్ళవెంట నీళ్ళు వచ్చే సందర్భంలో, అంత బాధలో కూడా "అరే, అప్పుడే ఏడుస్తారెందుకు... ఆ కన్నీళ్ళకు ఇంకా కొంత సమయం ఉంది" అనే వారంటే భమిడిపాటి హాస్య చమత్కార ప్రియత్వం అర్థం అవుతుంది.

# మాటల మాంత్రికుడు డి.వి.నరసరాజు

## నేడు వర్ధంతి



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తన రచనలతో ఎన్నో మరపురాని చిత్రాలను అందించిన ప్రసిద్ధ రచయిత డి.వి. నరసరాజు. సినీ కథ, సంభాషణల రచయితగా సుప్రసిద్ధులు. ఆయన రచించిన సినిమాలలో హాస్యరసం తొణికిస లాడుతూ ప్రేక్షకుల్ని నవ్వించింది. తెలుగు పలుకుబడిని ఉపయోగించడంలో ఆయనది అందెవేసిన చేయి. జన సామాన్య వాడుక భాష లోని పదాలనే వాడి హాస్యం, వ్యంగ్యం పండించిన కృషీవలుడు. ఆయన మౌలికంగా నాటక రంగం తెలుగు పలుకు బడిని ఉపయోగించడంలో దిట్ట.

డి.వి. నరసరాజుగా ప్రసిద్ధుడైన దాట్ల వెంకట నరసరాజు (జూలై 15, 1920 - ఆగస్టు 28, 2006) రంగస్థల, సినిమా నటుడు, రచయిత, దర్శకుడు.1920 జూలై 15న గుంటూరు జిల్లా, సత్తెనపల్లి మండలంలోని తాళ్లూరులో జన్మించారు. ఆయన హేతువాది.

నరసరాజు గుంటూరులోని హిందూ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని, హిందూ కళాశాలలో ఇంటర్ తర్వాత మద్రాసు లయోలా కళాశాల నుండి బి.ఏ పూర్తి చేశారు. ఇప్పుడు విజయవాడలో కలసి పోయిన ముత్యాలంపాడు గ్రామంలో తొలి గ్రాడ్యుయేట్ దాట్ల వెంకట నరసరాజు. నాటక రచయితగా జీవితాన్ని ప్రారంభించారు. సినిమాల లోకి రాకముందు నాటక రచయితగా పేరు తెచ్చుకున్నారు. అంతర్వాణి, ఈ ఇల్లు అమ్మబడును, వాపసు లాంటి సూపర్ హిట్ నాటకాలు రాశారు. ఈనాడు పత్రికలో కొంతకాలం పనిచేశారు. మొదటి నుంచి సృజనాత్మక కళల మీదే నరసరాజు దృష్టి.

1951లో పాతాళభైరవి సినిమా వందరోజుల ఉత్సవం సందర్భంగా ప్రదర్శించిన నరసరాజు నాటకం నాటకం చూశారు. దర్శకుడు కె.వి.రెడ్డి. ఆయన ప్రతిభ చూసిన దిగ్దర్శకులు కేవీ రెడ్డి తన 'పెద్ద మనుషులు' చిత్రం ద్వారా నరసరాజును చిత్రసీమకు పరిచయం చేశారు. అలా నరసరాజు 1954లో పెద్ద మనుషులు సినిమాతో రచయితగా సినీరంగ ప్రవేశం చేశారు. ఆ సినిమా విజయవంతం కావడంతో సినీ రచయితగా స్థిరపడ్డారు. దొంగ రాముడు మూవీకి రచయితగా డి.వి.నరసరాజునే తీసుకున్నారు. గుండమ్మ కథకు మాటలు రాశారు. రాముడు భీముడును సూపర్ డూపర్ హిట్ కొట్టించారు.

నరసరాజుతో ఎన్టీఆర్‌కు ఎక్కువ సాన్నిహిత్యం ఉండేది. తన స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన సాంఘిక చిత్రాలకు ఎక్కువగా నరసరాజుకే స్క్రిప్ట్ బాధ్యతలు అప్పగించేవారు ఎన్టీఆర్. అలా రూపుదిద్దుకున్న చిత్రాల్లో కోడలు దిద్దిన కాపురం ఒకటి. బడి పంతులు డైలాగ్స్ కోసం డబ్బులు తీసుకున్న ఆత్రేయ రాయని స్థితిలో చివరకు నరసరాజు పూర్తి చేయాల్సి వచ్చింది. ఎన్టీఆర్ హీరోగా రూపొందిన "నాదీ ఆడజన్మే, సి.ఐ.డి., తిక్క శంకరయ్య, బడి పంతులు, వాడే-వీడు, మగాడు, యమగోల, కేడీ నంబర్ వన్, యుగంధర్ లాంటి చిత్రాలలో ఆయన చిరకాలం గుర్తుండేలా రచనలు చేశారు. అక్కినేని హీరోగా రూపొందిన మూగనోము, గృహలక్ష్మి, జై జవాన్, ఇద్దరు అమ్మాయిలు, శ్రీరంగనీతులు, రావుగారిల్లు చిత్రాలకు నరసరాజు రచన చేశారు. చిత్రపు నారాయణ మూర్తి తీవ్రమైన కష్టాల్లో ఉన్న పరిస్థితి చూసి సాధారణంగా పౌరాణికాలు పెద్దగా అంగీకరించని నరసరాజు భక్త ప్రహ్లాదకు పని చేశారు. రంగుల రాట్నం, రాజ మకుటం లాంటి సినిమాలు ఆయన ఖాతాలోకే వస్తాయి. యమగోల చిత్రంలో చాలా పొలిటికల్ డైలాగులు పేల్చి నరసరాజు జనంతో ఈలలు కొట్టించారు. ఎమర్జన్సీ మీద కాంగ్రెస్ పార్టీ మీద చాలా సెటైర్లు రాయగా, తెర మీద చెప్పేది ఎన్టీఆర్ కావడంతో ఆ డైలాగ్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. నాటకం' అనే నాటకంతో రంగస్థలం మీద సంచలనం సృష్టించిన డి.వి.నరసరాజు తెర మీద కూడా రెండు సినిమాల్లో నటించారు. ఒక సినిమాకు దర్శకత్వం వహించారు.

అలా నరసరాజు 92కు పైగా సినిమాలకు కథను, మాటలను సమకూర్చారు.. ఆయన దర్శకత్వం వహించిన కొన్ని సినిమాలలో కారు దిద్దిన కాపురం ఒకటి. ఇ.వి.వి. సత్య నారాయణ తొలి చిత్రం చెవిలో పువ్వులో నరసరాజు హీరోయిన్ సీత తాతగా నటించారు. మనసు-మమత చిత్రంలోనూ ఓ కీలక పాత్ర పోషించారు. ఈయన చివరి సినిమా 2006 లో విడుదలైన మాయా బజార్. ఆయన 2006 ఆగస్టు 28న హైదరా బాదులో మరణించారు.

# వణుకు పుట్టిస్తున్న హైడ్రా

**విశ్వంభర, హైదరాబాద్ :** అరే మా ఇంటి కాడ కూడా చెరువుల్లో ఇండ్లు కట్టిండ్రు.. అవును మా కాలేజ్ కు వెళ్లే దారిలో కూడా నాలాపై షాపులు నిర్మించిండ్రు. సిటీలో కబ్జాలను, అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు సీఎం రేవంత్ కొత్తగా ఏర్పాటు చేసిన హైడ్రా ఎలాంటి ఆక్రమణనైనా తొలగిస్తుందట. మరీ మా పాతబస్తీలో చెరువులు, కుంటల్లో నిర్మించిన ఇండ్లను, వ్యాపార సంస్థలను కూడా తొలగిస్తుందా? అన్నది సిటిలో ఎక్కడ ఏ ఇద్దరు కలిసినా చర్చించుకుంటున్న హాట్ టాపిక్. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ట్రై సిటీల్లోని ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలు, కుంటలను కాపాడేందుకు ఏర్పడిన హైడ్రా ప్రస్తుతం పేద, పెద్ద అంటూ తేడా లేకుండా ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదులను అన్ని కోణాల్లో పరిశీలించి, అది ఆక్రమణే అని తేలగానే ఆగమేఘాలపై వెళ్లి కూల్చేస్తూ సంచలనాన్ని సృష్టిస్తున్న సంగత తెల్సిందే. బంజారాహిల్స్ లో ఓ ప్రహరీగోడ కూల్చివేతకు అడ్డువచ్చినందుకు ఏకంగా అధికార పార్టీ ఎమ్మెల్యేపైనే కేసు నమోదు చేసిన హైడ్రా శివరాంపల్లిలొ మజ్లీస్ పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యేకు చెందిన అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేయటంతో పాటు అడ్డుకునేందుకు ప్రయత్నించిన సదరు ఎమ్మెల్యే, ఇద్దరు కార్పొరేటర్లను అరెస్టు చేసి తన సత్తాను చాటుకుంది. ఏర్పాటైన నెల రోజుల్లోనే వందలాది అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసిన హైడ్రా ఇప్పటి వరకు సుమారు 45 ఏకరాల చెరువుల స్తలాన్ని కైవసం చేసుకుంది. ఒక్క గండిపేట బఫర్ జోన్ లోనే కోట్లాది రూపాయల విలువ చేసే విల్లాలను కూల్చి వేసిన హైడ్రా మణికొండలోని చిత్రపురి కాలనీలో ఏకంగా 207 విల్లాలకు నోటీసులు జారీ చేసి అడ్డదిడ్డంగా నిర్మాణాలు చేపట్టిన వారికి కంటిపై కునుకు లేకుండా చేసింది. హైడ్రా కూడా గతంలో ఏర్పాటు చేసిన వివిధ బృందాలు, కమిటీల మాధిరిగానే పిచ్చులకపై బ్రహ్మాస్త్రమేనన్న విమర్శలు వస్తున్న సమయంలో సినీ నటుడు నాగార్జునకు చెందిన తమ్మిడికుంట చెరువులో నిర్మించిన ఎన్ కన్వెన్షన్ ను నేలమట్టం చేసి, తన పనితీరుపై ప్రజల్లో నెలకొన్న అపోహలను పటాపంచలు చేసిన హైడ్రా ఎక్కడ తమపై పడుతుందోనన్న భయంతో ఓ మాజీ మంత్రి తన ఫామ్ హౌస్‌ను కాపాడుకునేందుకు ముందస్తుగా కోర్టును ఆశ్రయించి స్టే అభ్యర్థించారంటే హైడ్రా అక్రమార్కుల గుండెల్లో ఏ తరహాలో రైళ్లు పరిగెత్తిస్తుందో అంచనా వేసుకొవచ్చు. తవ్వుతున్న కొద్దీ అక్రమాలు



అన్నట్టు కూల్చుతున్న కొద్దీ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వరదలా వస్తున్నాయి. ఇది పరోక్షంగా ప్రజలు హైడ్రా చర్యలను సమర్థిస్తున్నట్టేనన్న వాదనలున్నాయి. రెండు రోజుల క్రితం చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి తాను బీజేపీకి చెందిన ప్రజాప్రతినిధినే అయినా ఆక్రమణల తొలగింపు విషయంలో రేవంత్ సర్కారు చేస్తున్న హైడ్రా ఆపరేషన్ ను తన సర్వేలో వందకు 78 మంది సమర్థిస్తున్నారని వ్యాఖ్యానించిన సంగతి తెల్సిందే. ఇదే సమయంలో హైడ్రా మరో మాజీ మంత్రి, ఓ ఎమ్మెల్సీకి చెందిన అక్రమ నిర్మాణాలను గుర్తించి యాక్షన్ కు సిద్ధమవుతుండగా, సదరు అక్రమ నిర్మాణాల్లో కొనసాగుతున్న కాలేజీలను కూల్చి వేస్తే విద్యార్థుల భవిష్యత్తు పాడవుతుందని నిర్వాహకులు హైడ్రా కమిషనర్ ను కోరినా, అక్రమ నిర్మాణమైతే మీకు మీరే కూల్చేసుకోవాలి, లేదంటే ఆ పని హైడ్రా చేస్తుందని తేల్చి చెప్పటం చర్చనీయాంశంగా మారింది. రాజకీయ ప్రత్యర్థులు ఒకరిపై ఒకరు రాజకీయంగా కక్షలు తీర్చుకునేందుకు నేతలకు హైడ్రా ఓ ఆయుధంగా మారుతుందా? అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఎవరు ఫిర్యాదు చేసినా, అది అక్రమమని తేలితే నేలమట్టం చేయాలన్నదే హైడ్రా ప్రధాన లక్ష్యంగా కన్పిస్తుంది.

**పాతబస్తీ కి బుల్డోజర్లు వెళ్తాయా?**

ఇప్పటికే హైడ్రాకు ఫుల్ హ్యాండ్ ఇచ్చిన సీఎం రేవంత్ పాతబస్తీకి హైడ్రా బుల్డోజర్లు పంపుతారా? లేక మజ్లీస్ నేతల వత్తిడికి తలొగ్గి, హైడ్రా యాక్షన్ కు బ్రేక్ వేస్తారా? అన్నది కూడా రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. హైడ్రాకు కళ్లెం వేసేందుకు పలువురు రాజకీయ నేతలు, రియల్టర్లు ప్రయత్నాలు చేస్తున్నా, ఎలా ఎదుర్కోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం. ఎన్ కన్వెన్షన్ కూల్చి వేతలు చేపట్టగానే నిర్వాహకులు హై కోర్టును ఆశ్రయించటంతో కోర్టు స్టే ఇచ్చిన సంగతి తెల్సిందే. కానీ కోర్టు స్టే ఇచ్చే లోపే ఎన్ కన్వెన్షన్ పూర్తిగా నేలమట్టం కావటం, పైగా చెరువులు, కుంటల్లో నిర్మించి అక్రమ నిర్మాణాలకు ఏ మాత్రం ముందస్తు నోటీసులివ్వకుండా కూల్చి వేయాలంటూ గతంలోనే సుప్రీం కోర్టు కూడా ఆదేశాలివ్వటంతో హైడ్రాను ఎదుర్కొనే మార్గాలు అక్రమాలకు అర్థం కావటం లేదని సమాచారం.

**త్వరలో డబుల్ కానున్న హైడ్రా సైన్యం**

జీహెచ్ఎంసీలో కేవలం ఎన్ ఫోర్స్ మెంట్ సెల్ గా ఉన్న విభాగం 2017 లో ఈవీడీఎంగా ఏర్పాటు కావటంతో పాటు ఇపుడు హైడ్రాగా రూపాంతరం చెందింది. విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ , డిజాస్టర్ మేనేజ్ మెంట్ విధులు నిమిత్తం మొత్తం 3 వేల మంది సిబ్బంది ఉండగా, ఇటీవలే సర్కారు స్ట్రెంథ్ ఫార్మెట్ కు మంజూరీ ఇచ్చిన సంగతి తెల్సిందే. దీంతో 168 మంది వివిధ హోదాల్లోని అధికారులు నియమితులయ్యే అవకాశముండగా, కూల్చి వేతలను ముమ్మరం చేసేందుకు మొత్తం హైడ్రా సిబ్బంది రెట్టింపు చేయాలని, అంటే ఆరు వేలకు పెంచే యోచన ఉన్నట్లు సమాచారం.

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

**విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.**

**చిరునామా:**

V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్-500060

ఈ-మెయిల్: editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# కాకతీయ వైభవాన్ని చాటి చెప్పే కోటగుళ్ళు: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**విశ్వంభర, భూపాలపల్లి:** కాకతీయ వైభవాన్ని చాటి చెప్పే అద్భుతం కోటగుళ్లు ఘనపేశ్వరాలయం అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్లు గణపేశ్వరాలయాన్ని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సందర్శించారు. జిల్లాకు విచ్చేసిన గవర్నర్ కు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులచే గౌరవ వందనం స్వీకరించిన గవర్నర్ కు వేదపండితులు పూర్ణ కుంభం, మేళా తాళాలతో స్వాగతం పలికారు. శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు బలరాం నాయక్, భద్రాచలం శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట రావులతో కలిసి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ గణపేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేదపండితులు శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం గణపేశ్వారాలయం ఆవరణలో తవ్వకాలలో బయటపడ్డ శిల్పాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ కాకతీయుల వైభవాన్ని చాటే గొప్ప కట్టడం ఘనపేశ్వరాలయం అని, సుమారు 12వ శతాబ్దంలో కాకతీయులు ఓరుగల్లు ప్రాంతాన్ని పాలించిన సమయంలో ప్రజల సౌకర్యార్థం అద్భుతమైన కట్టడాలను నిర్మించారని అన్నారు. కాకతీయులు ఇతర రాజ్యాల పై దండయాత్ర చేసి సాధించిన విజయానికి గుర్తుగా ఒక్కొక్క గుడిని నిర్మించారని తెలిపారు. కాకతీయుల కళా సంపదను కాపడాల్సిన బాధ్యత అందరిపై ఉందని గవర్నర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,



ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టియుసిని రద్దు చేయాలి




**విశ్వంభర, భూపాలపల్లి:** బొగ్గు గని కార్మికులను ఇబ్బందులు పెడుతున్న ఐఎన్ టియుసి ని రద్దుచేసి వెంటనే ఎన్నికలు జరిపించాలని టీబీజికేఎస్ కేంద్రకమిటీ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు భూపాలపల్లి బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ అనుబంధ కేంద్రకమిటీ సమావేశానికి ముఖ్యతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఏఐటియుసి కాంగ్రెస్ అనుబంధ సంస్థ గెలిచి సుమారు 9నెలలైనా కార్మికులకు చేసిందేమీ లేదని, గెలిచిన ఆసంస్థ కార్మికుల ప్రయోజనాలను పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. గుర్తింపు హోదా లేకపోవడం విడ్డూరంగా ఉందని రాజిరెడ్డి ఎద్దేవాచేశారు. అంతేకాక సింగరేణి ప్రాంతాలలో జరుగుతున్న ప్రమాదాలను యాజమాన్యం పట్టించుకోకపోవడం ఆసంఘ నిర్లక్ష్యానికి కారణమని ఆయన విమర్శించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో భూపాలపెల్లి సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య, నాయకులు సురేందర్ రెడ్డి, మాదాసి రామ్మూర్తి, నూన్ కొమురయ్య, బడికట్ల సంపత్, బి మంగీలాల్, సదానందం తదితరులుపాల్గొన్నారు.

## కష్టపడితే సాధ్యం కానిది ఏదీ లేదు



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన సుర్వి శ్రీలేఖ శ్రవణ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్‌లో సెలెక్ట్ అయినందున సుర్వి శ్రీలేఖను తెలంగాణ ఉద్యమ ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్, హంస ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ చాంద్, గౌడ సంఘ జిల్లా అధ్యక్షులు పరిటాల రవి కుమార్ ఆమెను శాలువాతో సన్మానించారు, అనంతరం స్వీట్లు పంచారు. కష్టపడితే సాధ్యం కానిది ఏమీ లేదని అన్నారు. ఈ సందర్భంగా శ్రీలేఖను అడ్వకేట్ కోనూరు శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సుర్వి కృష్ణ, సర్ద కృష్ణ, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండలం, నీర్నెముల గ్రామంలో ఐ లవ్ నీర్నెముల ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అనంతరం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆవుల నరసింహా యాదవ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికై ఎల్లవేళలా ముందు ఉంటామని, నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తూ, గ్రామానికి మా సహాయ సహకారాలు అందిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం గ్రామాభివృద్ధి కి తోడపాటు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఓర్సు తిరుమలయ్య, ఆవుల మురళి, ఆవుల పర్వతాలు, నోముల స్వామి, సుర్వి బాలరాజు, పాక నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్‌కి స్వాగతం పలికిన ఎమ్మెల్యే



**విశ్వంభర,ములుగు:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రామప్ప దేవాలయం సందర్శించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. రామప్పకు సంబందించిన చరిత్ర , పురాతన ప్రాంతాలను అక్కడి విశిష్టతను తెలియజేసారు.

## కరాటే, కుంఫులో విద్యార్థుల ప్రతిభ



**విశ్వంభర, సరూర్ నగర్:** 35వ జాతీయస్థాయి కరాటే కుంఫు ఛాంపియన్షిప్ -2024 ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన పోటీలలో సరూర్నగర్ లోని లయోలా పాఠశాల విద్యార్థులు పది బంగారు పథకాలు సాధించినట్లు లయోల పాఠశాల డైరెక్టర్ మహమ్మద్ ఇస్తియాక్ గుల్షాన్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో బంగారు పథకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహిస్తామన్నారు. విద్యార్థులకు పాఠశాల దశ ఎంతో ముఖ్యమైనదని ఈ దశలోనే వారు ఎంచుకున్న మార్గం వైపు అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కొడటి హర్షిత, అకడమిక్ ఇంచార్జ్ ఉదయ రాణి, కరాటే మాస్టర్ మారే గౌనీ నరేందర్ గౌడ్ , విద్యార్థులు పాల్గొన్నారు.

## సెట్విన్ సేవల విస్తరణ



**విశ్వంభర, హైద్రాబాద్:** రాష్ట్రంలో సెట్విన్ సేవలను విస్తరింప చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఆ సంస్థ చైర్మన్ ఎన్ గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. త్వరలోనే జహీరాబాద్, తాండూర్, వికారాబాద్, సంగారెడ్డి, జడ్చర్ల ప్రాంతాలలో కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. మంగళవారం సెట్విన్ మోతిగల్లి శిక్షణ కేంద్రాన్ని మేనేజింగ్ డైరెక్టర్ కె వేణుగోపాల్ రావుతో కలిసి సందర్శించారు. కేంద్రంలోని బ్యూటిషన్, కటింగ్, టైలరింగ్, కంప్యూటర్ ఎయిర్లైన్ టికెట్ ,సెల్ ఫోన్ రిపేర్, కంప్యూటర్ హార్డ్ వేర్, ప్రింటింగ్ ప్రెస్ కేంద్రాలను పరిశీలించి వివారాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి సెట్విన్‌ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషిచేస్తానని అన్నారు. నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం నాయకత్వంలోని అండగా ఉంటుందని అన్నారు.

## జేఏసీ కార్యవర్గం ఏర్పాటు



**విశ్వంభర, జగిత్యాల:** ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ జగిత్యాల జిల్లాలోని వివిధ మాల సంఘాలకు చెందిన నాయకులు ఏకతాటిపైకి వచ్చి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని జేఏసీ ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాకు చెందిన గౌరవ అధ్యక్షులుగా మద్దెల నారాయణ, గౌరవ సలహాదారులు గా కొప్పుల వెంకటరమణ, కంటె అంజయ్య, న్యాయ సలహాదారులు గా నకుమల్ల లక్ష్మి నారాయణ, మీడియా ఇంచార్జి గా నర్ర రాజేందర్, కన్వీనర్లుగా కారంగుల వసంత రావు, చిత్తారి ప్రభాకర్, మ్యాదరి శ్రీహరి, వేల్పుల ప్రవీణ్, ఉరుమట్ల లక్ష్మణ్, రాగుల నర్సింగరావు, కోశాధికారిగా కడమండ కమలాకర్ లను తాత్కాలిక కార్యవర్గంగా ఎన్నుకోవడం జరిగింది.సెప్టెంబర్ మొదటి వారంలో జిల్లా మాలలకు పిలుపు నిచ్చి భారీ బహిరంగ సభ నిర్వహించి ఉత్సాహ వంతులను ఉద్యమాన్ని ముందుకు నడిపే నాయకులను ఎన్నుకొని భవిష్యత్ పోరాట కార్యాచరణ ను ప్రకటిస్తామని తెలిపారు. నల్ల శ్యామ్, కాయితీ శ్రీనివాస్, నాపరి ప్రవీణ్ కుమార్, బొల్లం ప్రభాకర్, నర్ర రాజు, నక్క సురేష్, కాయితీ కిషన్, బోనకంటి రవి పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితకు బెయిలు మంజూరు

### సంబరాలు చేసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు



**విశ్వంభర, వికారాబాద్:** అక్రమంగా పెట్టిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సర్వోన్నత న్యాయస్థానం బెయిలు మంజూరు చేయడంతో మంగళవారం వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నివాసానికి చేరుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆయనకి స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కూడా అందరికి స్వీట్లు తినిపించి సంతోషాన్ని వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా మెతుకు ఆనంద్ మాట్లాడుతూ ఇప్పటికైనా నిజమే గెలిచిందని ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యం లాగా బయటకు వచ్చారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మేక చంద్రశేఖర్ రెడ్డి, కౌన్సిలర్ గోపాల్, సీనియర్ నాయకులు పడిగళ్ళ అశోక్, అనిల్, మంగలి రమేష్, ఎస్ మోహన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలకు సేవ్ భద్రాద్రి ఆహ్వానం



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలం పట్టణంలో సేవ్ భద్రాద్రి ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన మల్టీపర్పస్ బిల్డింగ్ నిర్మాణ శంకుస్థాపన వేడుకకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని సేవ్ భద్రాద్రి కమిటీ ఆహ్వానించింది. ఈ మేరకు గండుగలపల్లిలో మంగళవారం ఉదయం మంత్రి తుమ్మలని సేవా భద్రాద్రి మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాకాల దుర్గాప్రసాద్, ఎస్కే రసూల్, యశోద రాం బాబు, షేక్ అజీమ్, పచ్చ నీలం మునికేశవ, భీమవరపు వెంకట్ రెడ్డి, పరిమి సోమశేఖర్, చారుగుళ్ళ శ్రీనివాస్, తూము చంద్రశేఖర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సుల్లో అంతా మహిళా ప్రయాణికులే



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** మహాలక్ష్మి పథకం అమలుతో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రతి ముగ్గురిలో ఇద్దరు స్త్రీలే ఉంటున్నారు. 2023 డిశంబర్ 9 నుంచి ఈ నెల 19 వరకు 122 కోట్ల మంది ప్రయాణించగా, వారిలో 79 కోట్ల మంది (64.47%) మహాలక్ష్మలే ఉన్నారు. రీజియన్ల వారీగా చూస్తే జీ.హెచ్.ఎం.సీ (67.45%) తొలిస్థానంలో ఉండగా, తర్వాత కరీంనగర్(67.37%), నిజామాబాద్ (65.17%), మెదక్(64.67%) ఉన్నాయి.

## దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**విశ్వంభర, సరూర్ నగర్:** సరూర్నగర్ డివిజన్ పంజాల అనిల్ కుమార్ కాలనీలో అభయాంజనేయ స్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవాల కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిదిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు, అర్చకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు ఇంటూరి అంకిరెడ్డి, నియోజకవర్గ యూత్ వింగ్ మాజీ అధ్యక్షులు లోకసాని కొండల్ రెడ్డి, ఆకుల అరవింద్, సాజిద్, రిషి, రమేష్ కురుమ, సుశీల రెడ్డి పాల్గొన్నారు.

## 29న నిరుద్యోగుల జాబ్ మేళా

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు పారమౌంట్ బిల్డింగ్ సొల్యూషన్స్, భారత్ మోటో కార్పొరేషన్ సంస్థల్లో పని చేయుటకు 100 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈనెల 29న స్థానిక మండల పరిషత్‌కార్యాలయం చుంచుపల్లిలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కే. శ్రీ రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెల్డర్, ఫిట్టర్, సూపర్వైజర్స్ ట్రైనీ ఇంజనీర్స్, ఫీల్డ్ సేల్స్ కన్సల్టెంట్స్ పోస్టులకు ఐటీఐ, డిప్లొమా మెకానికల్, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. జిల్లాలోని 18 నుండి 35 సంవత్సరాలలో వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనేందుకు సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ లతో హాజరు కావాలని తెలిపారు.

# సమస్యలు పరిష్కరించుకుందాం

## పెండింగ్‌లో ఉన్న డిఏలు వెంటనే విడుదల చేయాలి: టీఎన్జీవో అధ్యక్షుడు జగదీశ్వర్

**విశ్వంభర, ఎల్బీనగర్:** రాష్ట్రంలో ఉన్న 9 లక్షల మంది ఉద్యోగులందరూ సంఘటితమై సమస్యలను పరిష్కరించుకుందామని, పెండింగ్లో ఉన్న డిఏలు, ఇతర సమస్యలను వెంటనే ప్రభుత్వం తీర్చాలని టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. సోమవారం ఆర్కే పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ లోని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చిలుక నరసింహారెడ్డి, కార్యదర్శి ముక్రం ఆధ్వర్యంలో టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మారం జగదీశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేనీలకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. మారం జగదీష్ మాట్లాడుతూ పోరాడి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యోగుల గురించి మాట్లాడే నాధుడే కరువయ్యాడని అన్నారు. కొన్ని సంఘాల మాటల వల్లనే ఉద్యోగులు ప్రభుత్వానికి దూరం అవుతున్నారని, ఉద్యోగులను ఇబ్బంది పెట్టే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. పెండింగ్ బిల్లులు, డిఏ,పిఆర్సి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. చాలా శాఖలలో 10 మంది చేసే పనులు ఒక ఉద్యోగే చేస్తున్నాడని అన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీన సిపిఎస్ విద్రోహ దినం గా పాటిద్దామని తెలిపారు. అనంతరం టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ మాట్లాడుతూ 010 పద్దు నుండి మార్కెటింగ్ ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వాలని అన్నారు. మార్కెట్ ఆదాయాన్ని బట్టి పునర్విభజన చేయాలని, 25 సంవత్సరాలుగా పునర్విభజన చేయలేదని వెంటనే ఆ పనిని చేపట్టే విధంగా మంత్రిని కోరుతామన్నారు. దాదాపు మార్కెటింగ్ శాఖలో 1800 మంది ఉద్యోగులు ఉంటే 1200 మంది పదవి విరమణ చేశారని,600 మంది ఉద్యోగులే ఉన్నారని అన్నారు. ఖాళీల భర్తీపై శాఖ అధికారులు ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. అనంతరం చిలుక నరసింహారెడ్డి



మాట్లాడుతూమార్కెటింగ్ శాఖలో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ప్రతినెల 5వ తేదీ లోపు జీతభత్యాలు వెయ్యాలని అన్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్ కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, లక్ష్మణ్, కొండల్ రెడ్డి, పర్వతాలు, గోవర్ధన్ రెడ్డి, సంతోష్, వివిధ జిల్లాల మార్కెటింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు బజార్‌ను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్



**విశ్వంభర, వికారాబాద్:** రైతు బజార్ వెనక భాగాన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు నడుస్తున్న కారణంగా కూరగాయలు అమ్ముకునే రైతులకు రైతు బజార్ లోపల స్థలం లేకపోవడంతో రోడ్డు మీదకువచ్చి కూరగాయలు అమ్ముకుంటున్నారు. కూరగాయలు అమ్మే వారికి, కొనుగోలు చేసే వారికి, అటుగా వెళ్లే వాహనదారులకు అనేక ఇబ్బందులు అవుతున్నాయని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. స్పీకర్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ని ఆదేశించడంతో మంగళవారం ట్రైని కలెక్టర్ ఉమా హారతి, స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ తో కలిసి వికారాబాద్ పట్టణంలోని రైతు బజార్ ను సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, చైర్ పర్సన్ పాత కూరగాయల మార్కెట్ ను కూడా సందర్శించారు. కూరగాయల మార్కెట్ మొత్తం బురద మయంగా మారిందని, ఈ సమస్యను కూడా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చైర్ పర్సన్ ట్రైనీ కలెక్టర్ ని కోరారు. కమిషనర్ జాకీర్ అహ్మద్, కౌన్సిలర్ శ్రీదేవి సదానంద్ రెడ్డి, నాయకులు సదానంద్ రెడ్డి, శానిటేషన్ ఇన్చార్జ్ ఎస్ఐ ఏసు, ఇంజనీర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## హైడ్రాకు హ్యాట్సాఫ్



**విశ్వంభర, ఎల్బీనగర్:** నగరంలో చెరువులను నాలాలను ఆక్రమించి ప్రభుత్వ స్థలాలలో నిర్మిం చిన అక్రమ కట్టడాలపై ఉక్కు పాదం మోపుతున్న హైడ్రాకు హ్యాట్సాఫ్ అని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిజాయితీ గల అధికారి అధీనంలో హైడ్రా పనిచేయడం అభినందనీయమని అన్నారు. చెరువుల్లోనే ఆక్రమణలు జరిగిన చోట హైడ్రా తన పని పూర్తి చేస్తుందని మంత్రులు ప్రకటించిన గతంలో అవినీతికి పాల్పడ్డ మాజీ మంత్రులు అవా కులు చెవా కులు పేలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టానికి లోబడి ప్రతి పనికి నోటీసులు ఇచ్చిన తర్వాతనే చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిబద్ధతకు ఇది ఒక నిదర్శనం అని అన్నారు. హైదరాబాదు అంటేనే లేక్స్ ,రాక్స్ (సరస్సులు, రాళ్లు )నెలకొని ఉన్న ప్రాం తాలని వీటిని కాపాడు కోవాలంటూ పర్యావరణ వేత్తలు గతంలో ఆందోళనలు కూడా చేశారని గుర్తు చేశారు. చెరువుల పరిరక్షణ కోసమే హైడ్రాను ఏర్పాటు చేశారని హైడ్రా చేపట్టి న కూల్చివేతలు ప్రజలందరూ ఆహ్వానిస్తుంటే కొంత మంది బడా నేతలు అవినీతికి పాల్పడి కోట్లు వెనకేసుకున్న వాళ్ళు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని వారి మాటలను ప్రభుత్వం పట్టించుకోకుండా చట్టం తన పని తాను చేసుకోబోతుంది అన్నట్లుగా హైడ్రా తన పని తాను చేసుకుని పోతుందని అన్నారు.

### హైడ్రా కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్



**విశ్వంభర, హైద్రాబాద్ :** పేద మధ్యతరగతి కుటుంబాలకు అన్యాయం చేయొద్దు అని హైడ్రా ఒక హై డ్రామా గా కాకూడదని, కబ్జాలకు గురైన చెరువులను రక్షించాలని కోరారు. సలకం చెరువులో ఉన్న ఓవైసీ బ్రదర్స్ కాలేజ్ పై చర్యలు తీసుకోవాలని కమిషనర్ రంగనాథన్‌ని మంగళవారం సరూర్నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ కోరారు.

## విద్యుత్ సమస్యను పరిష్కరించండి



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండా లో గత మూడు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి గ్రామంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మండల విద్యుత్ అధికారులకు తెలిపారు ఈ సమస్య గురించి గ్రామ నాయకుడు రవీందర్ నాయక్ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యను త్వరగా పరిష్కరించాలని లేదంటే గ్రామ ప్రజలు అందరితో కలిసి ఏడిఈ ఆఫీస్ ముట్టడిస్తామని తెలిపారు. మా గ్రామానికి ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేసి విద్యుత్ అంతరాయం నుండి శాశ్వత పరిష్కారం చూపాలని వినతి పత్రంలో కోరారు. గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు క్యామ పరమేశ్వర్, గ్రామ పెద్దలు శంకర్ నాయక్, సేవ్య నాయక్, టీచర్ రమేష్ నాయక్, కృష్ణ నాయక్, రమ్మీ రాథోడ్ (సిమ్రాన్),హరిలాల్ నాయక్,రమేష్ నాయక్, జైరామ్ నాయక్, సాయికుమార్ నాయక్ పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన



**విశ్వంభర, మేడిపల్లి:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 23వ డివిజన్ లోని రెడ్డీస్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథులుగా టిపిసిసి ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్, మేయర్ తోటకూర అజయ్ యాదవ్,డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ హాజరై శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో ఎటువంటి సమస్యలు ఉన్న మేయర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికై కృషి చేస్తామని తెలిపారు. కాలని అభివృద్ధికి కాలనీవాసుల సహాయ సహకారాలతో వారి తోడ్పాటుతోనే ముందుకు సాగుతున్నామని వివరించారు.డివిజన్ అధ్యక్షులు కృష్ణ రెడ్డి, రెడ్డీస్ కాలనీ ప్రెసిడెంట్ ఎం. మహేష్, జనరల్ సెక్రెటరీ విజయభాస్కర్, అమృష్ మిశ్రా,బొట్టు సత్తి ,కళావతి, ప్రసాద్ ఉపేందర్ ఆరోగ్యారెడ్డి సుధీర్, నరేందర్, సత్యం బుర్ల, రవి వర్మ ,విజయ శంకర్ పాండే, శ్రీనివాసరెడ్డి, యాదగిరి చారి, పాల్గొన్నారు.

## రూ. 35 కోట్లతో అమృత్ 2.0 స్కీం ద్వారా నీటి సరఫరా



**విశ్వంభర,కామారెడ్డి:** జిల్లా పరిధిలో ఎల్లారెడ్డి పట్టణంలో మున్సిపల్ పరిధిలో 35 కోట్లతో అమృత్ 2.0 స్కీం ద్వారా నీటి సరఫరా పనులకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ శంకు స్థాపన చేశారు. స్కీం ద్వారా మున్సిపాలిటీ పరిధిలో నీటి అవసరాలకోసం 4 ఈఎల్ఎస్ ఆర్ వాటర్ ట్యాంక్ లతో 47కిలో మీటర్ల పైప్ లైన్ తో ప్రతి ఇంటికి నల్ల కనెక్షన్ ఇవ్వబోతున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుండి ఎల్లారెడ్డి మున్సిపాలిటీ కే అత్యధికంగా నిధులు కేటాయించారాని తెలిపారు. మినీట్యాంక్ బండ్, పార్క్, డబల్‌బెడ్ రూం ఇండ్లు, సీసీ రోడ్లు, డెనేజీ పనులు చర్యలు చేపట్టామని తెలిపారు. శంకుస్థాపన చేసుకుంటున్న ఈఅమృత్ స్కీంతో మున్సిపల్ ప్రజలకు స్వచ్ఛమైన తాగునిటీని అందిస్తామన్నారు. పెద్ద చెరువు కట్టపై ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో ఎల్లారెడ్డి నియోజకవర్గాని ప్రాతినిధ్యం వహించిన శాసనసభ్యుల విగ్రహాలను పెట్టి గౌరవిస్తామన్నారు. మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, మెగాకంపెనీ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రజాపాలనలో అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని అందుకు కట్టుబడి ప్రభుత్వం పని చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం బుద్దారం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా గ్రామంలోని పర్వత వర్ధిని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన రజక కమ్యూనిటీ భవనమును ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం రూ.14.1 లక్షలతో నూతనంగా నిర్మించనున్న యాదవ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.25 లక్షలతో నూతన నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించనున్న ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చివరగా, రూ.970 లక్షలతో బుద్దారం గ్రామం నుండి రామన్నగూడెం తండా వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణం మరియు రూ.297 లక్షలతో రోడ్డు వద్ద కల్వర్టుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, నాయకులు, ప్రజలు ఉన్నారు.



## సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**విశ్వంభర, భూపాలపల్లి:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మహాదేవపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి సర్వే చేసి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజు మాట్లాడుతూ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు అనేకమైన ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు .అదేవిధంగా విద్యార్థులకు కనీసం మౌలిక సదుపాయాలు వాష్రూమ్స్, క్లాస్ రూమ్స్ లో ఫ్యాన్ సరిగ్గా లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలు గత కొన్ని సంవత్సరాలుగా ఉన్నప్పటికీ దీనిపై ఇంతవరకు ఏ అధికారి కూడా స్పందించకపోవడం సిగ్గుచేటు అని తక్షణమే అమ్మాయిలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాలేజీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సందేశ్, హర్షిత్,గర్ల్స్ కమిటీ కన్వీనర్, కో కన్వీనర్ మౌనిక, ఆయేషా, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




### డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో చేరిన మహిళలు

**విశ్వంభర, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా బిక్నూరు మండలం పరిధిలో నేషనల్ రోడ్డు నుండి పెద్ద మల్లారెడ్డి వెళ్లే రోడ్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ లలో రామేశ్వర్ రెడ్డి గ్రామానికి చెందిన బస్వాపూర్ గ్రామానికి చెందిన మహిళలు వచ్చి తాళాలు పగలగొట్టి నూతన డబుల్ బెడ్ రూమ్ లలో వెళ్లి నివాసం ఉంటున్నారు. దీనిని గమనించిన పోలీసులు రెవెన్యూ అధికారులు వచ్చి వాళ్లను అక్కడి నుండి వెళ్లగొట్టారు. కలెక్టర్ చెప్పిన తర్వాతే ఎవరికి కేటాయిస్తారో వాళ్ళు రావాలని తెలిపారు. గతంలో కేటాయించిన వారికి ఇంతవరకు మాకు తాళాలు ఇవ్వడం లేదని వారు ఆలోపించారు.



## ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలి

### మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజ్

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక కొర్రాజుల గుట్టలో జరిగింది. ఈ కార్యక్రమానికి మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భద్రాచలంలో ఎస్సీ కమ్యూనిటీ హాలు ఉంటే నిరుపేదలకు ఉపయోగపడుతుందని మాజీ శాసన సభ్యుడు సున్నం రాజయ్య 42 లక్షల రూపాయలను శాంక్షన్ చేయిస్తే ఇప్పటి వరకు ఎస్సీ కమ్యూనిటీ హాల్ పూర్తి స్థాయిలో నిర్మాణం జరగకపోవడం దళితులను అవమానించడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరిగితే దళిత వర్గాల ప్రజలకు ఇతర సామాన్య ప్రజలకు అనేక విధాలుగా మేలు జరుగుతుందని భావిస్తే ఆ పని నత్త నడకన సాగడం బాధాకరమన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు చొరవ తీసుకొని కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయాలని ఆయన కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని వేరే కాంట్రాక్టర్ కు పని అప్పచెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పొట్టి రవి, వంశీ, సందీప్, బర్ల రామకృష్ణ, కొంగ సాగర్, శాంతరాజు, యేసు, సామేలు, శ్యాము, నాని పాల్గొన్నారు.



# కేసీఆర్‌ని భయపెట్టలేరు

## ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ



**విశ్వంభర, ఎల్బీనగర్:** బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుట్రలు చేసిన కేసీఆర్ ను భయపెట్టలేరని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంతో ఆర్కేపురంలో స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొట్టమొదటి నుండే కేసీఆర్ ఇది ఒక అబద్ధం, మోసపూరితమైన కేసు అని అన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆడుతున్న డ్రామా తప్పితే ఈ కేసులో అంత పసలేదన్నారు. సుప్రీంకోర్టులో వాదోప వాదనలు చూసిన తర్వాత కేసీఆర్ అన్న విధంగానే కవిత కడిగిన ముత్యం లాగా బయటికి వచ్చిందన్నారు. మహిళ అని కనికరం లేకుండానే అనారోగ్యంగా ఉన్న కూడా ఐదు నెలలుగా కవితను ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గొడుగు శ్రీనివాస్, కొండల శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, సాజిద్, శ్యామ్ గుప్తా, మహేందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, జగన్, దీపక్, మురళీ ధర్ రెడ్డి పాల్గొన్నారు.

# అవయవదాతలను సన్మానించే పథకం



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో మరణించిన అవయవదాతలను సన్మానించేందుకు కంటి, అవయవం, శరీరదాన ప్రోత్సాహక సంస్థల సంయుక్త కూటమి (జేఏసీ) మంగళవారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు బీద చేంజ్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చల్ల రాంకళ్యాణ్ ప్రతిపాదనను అందజేశారు. అనంతరం రాం కళ్యాణ్ మాట్లాడుతూ అవయవదానం చేసే వారి త్యాగాన్ని గుర్తించి, దాత కుటుంబానికి మద్దతు అందించడానికి పథకాలను రూపొందించడం కీలకంగా ఉంటుంది అని అన్నారు.సమన్వయం, తక్షణ నోటిఫికేషన్, అవయవాలను సేకరించడం, మరణించిన దాతలను సన్మానించడానికి ఆస్పత్రులు, జిల్లా అధికారుల మధ్య సమన్వయం సాధించడం.ఆర్థిక సహాయం, రవాణా సౌకర్యాలు అందించడం. దాతల త్యాగాన్ని గుర్తిస్తూ, వారి ఫోటోతో సహా వివరణాత్మక ప్రెస్ రిలీజ్ జారీ చేయడం. "బీ ది చేంజ్ వెల్ఫేర్ సొసైటీ" ఆధ్వర్యంలో అవయవదానం కార్యక్రమం ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ప్రశంసించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య పాల్గొన్నారు.

# వర్క్ ఫ్రం హెూమ్ వ్యవస్థను తీసివేయాలి




**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం పోచారం అన్నోజి గూడా ఇన్ఫోసిస్ ఐటీ ముందు హస్టల్ యజమానులు, నిర్వాహకులు భారీ ర్యాలీతో మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఐటీ కారిడార్ హస్టల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాసం అమర్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ వ్యాప్తంగా ఐటీ కారిడార్ లలో నాలుగువేల అయిదు వందల హస్టల్స్ ఉండగా ప్రత్యక్షంగా అరవై వేల కుటుంబాలు ఉపాధి పొందుతుండగా, పరోక్షంగా దాదాపు లక్ష మందికి పైగా జీవనం సాగిస్తున్నారని అన్నారు. వివిధ ఐటీ కంపెనీలు కరోనా సంక్షోభంలో ప్రవేశపెట్టిన వర్క్ ఫ్రమ్ హెూం వ్యవస్థను ఇంకా అమలు చేస్తుండడంతో లక్షలాది మంది రోడ్డున పడ్డామని అన్నారు. వెంటనే వర్క్ ఫ్రం వ్యవస్థను తీసివేసి తమ లాంటి వారిని ఆదుకోవాలని అమర్ నాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హస్టల్స్ అసోసియేషన్ సెక్రటరీ కరుణాకర్, లీగల్ అడ్వైజర్ ఆర్కే వర్మ, ట్రెజరర్ మహీధర్, వేణు, శ్రీనివాస్, బిల్డింగ్ ఓనర్లు రామిరెడ్డి, సుధీర్ రెడ్డి, ఉపేంద్ర, వెంకటేశ్వరరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కొరటికల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి 2003-2004సంవత్సరంలో చదివిన విద్యార్థులు 5,000/-ల రూపాయలు వెచ్చించి విద్యార్థులకు ఐడి కార్డులు అందిచారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డీ వెంకన్న తెలిపారు. ఉపాధ్యాయులు రవి,వరప్రసాద్, శ్రీనివాసచారి,అనురాధ, వెంకటేశంలు పాల్గొన్నారు.

# వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ హాల్‌కు శంకుస్థాపన



**విశ్వంభర, మేడిపల్లి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఇన్చార్జ్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మేడ్చల్ నియోజకవర్గంకు 10 కోట్లు ప్రభుత్వ నిధులను విడుదల చేసిన సందర్భంగా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో మంగళవారం రోజున కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ అన్నపూర్ణ కాలనీలో కమిటీ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ నిర్మాణ శంకుస్థాపన ఘనంగా నిర్వహించారు. అన్నపూర్ణ కాలనీలో స్థానిక కార్పొరేటర్ దానగల అనిత యాదగిరి ఆధ్వర్యంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రెష్ యాదవ్, మేయర్ అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ స్రవంతి కిషోర్ గౌడ్, కమిషనర్ రామలింగం, పార్టీ అధ్యక్షులు కార్పొరేటర్ పోగుల నర్సింహారెడ్డి ముఖ్య అతిథిదులుగా హాజరై కమిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు ప్రభాకర్ గుప్తా మాట్లాడుతూ కాలనీలో ఎలాంటి సమస్య ఉన్న ముందుండి పరిష్కారానికై కృషి చేస్తున్న కార్పొరేటర్ దాన గళ్ళ అనిత యాదగిరి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మేయర్ డిప్యూటీ మేయర్ సహాయ సహకారాలతో కాలనీలో ఉన్నటువంటి మరి సమస్యలను పరిష్కరించి వారికి సహకరించాలని కోరారు. అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్స్, కమిషనర్ నీ శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గోపు రాములు, కాలనీ జనరల్ సెక్రటరీ రామకృష్ణ, కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

## ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ప్రారంభించిన సమోహ్



**విశ్వంభర, బషీర్‌బాగ్:** ట్రెంట్ ద్వారా ఎలివేటెడ్ అకేషన్ వేర్ బ్రాండ్ అయిన సమోహ్ హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని ప్రధాన పరిసరాల్లో తన ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త స్టోర్ సమోహ్ గణనీయమైన విస్తరణను సూచిస్తుంది. ఉన్నతమైన ఫ్యాషన్ అనుభవాలను అందించడంలో దాని నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. 702/ఏ అర్డి నంబర్ 36, ఆదిత్య ఎన్‌క్లేవ్, వెంకటగిరి, జూబ్లీ హిల్స్, హైదరాబాద్, తెలంగాణ, 4,000 చ.అ.ల విస్తీర్ణంలో ఉన్న సమోహ్ స్టోర్, వివేకం గల కస్టమర్‌ల కోసం కొత్త గమ్యస్థానంగా మారనుంది. ప్రత్యేక సందర్భ డ్రెస్సింగ్‌కు ఆధునిక విధానం. ప్రత్యేకమైన విధానానికి పేరుగాంచిన, సమోహ్ కాలానుగుణ థీమ్‌లతో సమలేఖనం చేయబడిన సొగసైన ప్రింట్లు, జాక్వర్డ్‌లతో ప్రకటన చేసే సేకరణలను అందిస్తుంది. కస్టమర్‌లు రోజు నుండి సాయంత్రం దుస్తులు ధరించే వరకు దోషరహిత పరివర్తన కోసం రూపొందించిన వస్త్రాలను కొనుగోలు చేస్తారు. ఈ సందర్భంగా కొత్త స్టోర్‌పై ట్రెంట్ లిమిటెడ్ సీఈఓ పీ.వెంకటేశులు మాట్లాడుతూ తమ మొదటి స్టోర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందనీ, ఆధునిక వినియోగదారుల ఫ్యాషన్ సెన్సిబిలిటీలకు అనుగుణంగా అసాధారణమైన శైలి, నాణ్యతను అందించాలనే తమ నిబద్ధతకు ఇది ప్రతిబింబం అన్నారు.

# రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు స్వాగతం పలికిన ఆలేరు ఎమ్మెల్యే



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** తెలంగాణ రాష్ట్ర ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామిని మంగళవారం ఉదయం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దర్శించుకున్నారు. యాదగిరిగుట్టకు మొదటిసారిగా వచ్చిన గవర్నర్ ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘనంగా స్వాగతం పలికారు. మొదటగా పుష్కరిణి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గవర్నర్ జిష్ణుదేవ వర్మ, ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నాంసింహుడికి ప్రత్యేక పూజలు చేశారు. గవర్నర్ కు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించగా, అధికారులు స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందచేశారు.

# హామీల అమలు ప్రభుత్వ లక్ష్యం



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి.ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నిటిని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. పెద్ద శంకరంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన 31 మంది లబ్ధిదారులకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి చేతుల మీదుగా కళ్యాణ్ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుంది అన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఇచ్చిన ఉచిత బస్సు సౌకర్యం, 500 రూపాయల సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ నెరవేర్చడం జరిగిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 7 లక్షల 50 వేల కోట్లు వీ ఆర్ ఎస్ ప్రభుత్వం అప్పు మిగిల్చిందన్నారు. రైతులకు, మహిళలకు ప్రభుత్వం అన్ని రకాల అండగా ఉంటుందని వివరించారు. రైతులకు రుణమాఫీ చేయడంజరిగిందని మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ గ్రేసీ బాయ్, నారాయణఖేడ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు వినోద్ పాటిల్, పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయిని మధుసూదన్, మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, నాయకులు రాజేందర్ గౌడ్, దాచే సంగమేశ్వర్, సుభాష్ గౌడ్, దానంపల్లి నారా గౌడ్, ఆర్ ఎన్ సంతోష్ కుమార్, పెరుమాండ్లగౌడ్, బాసట రాజు, గోవిందరావు పటేల్ పాల్గొన్నారు.

# ఎన్నికల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలి



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణంలో యువజన కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా మండల, తాలూకా, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో యువజన కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని కల్వకుర్తి నియోజకవర్గం నుండి భారీ స్థాయిలో యువకులు ఓటింగ్ లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గం నుండి గతంలో ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులుగా వంశీచంద్ రెడ్డి ఇక్కడ నుండి పోటీ చేసి గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రస్థాయిలో కల్వకుర్తి నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో యువకులు ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాలాది శివకృష్ణ, వాసు రామ్ నాయక్, మేకల స్వామి, ఇర్ఫాన్ సిద్ధికి, ప్రవీణ్ నాయక్, తులసిరాం పాల్గొన్నారు.

## ఓవైసీ బ్రదర్స్‌కు భయపడొద్దు..

## సీఎం రేవంత్‌కు రాజాసింగ్ మద్దతు

**విశ్వంభర,తెలంగాణ బ్యూరో :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మద్దతు తెలిపారు. చెరువులను కాపాడాలని సీఎం సంకల్పం తీసుకోవటం అభినందనీయమని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం పూర్తి కావాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఓవైసీ బ్రదర్స్ బెదిరింపులకు భయపడొద్దని ఎమ్మెల్యే తెలిపారు. వేల మంది యువత మద్దతు ఉందని అక్బరుద్దీన్ బెదిరిస్తున్నారన్నారు. ఉచిత విద్య పేరుతో ఓవైసీ సోదరులు కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. చెరువులో 12ఎకరాలు ఆక్రమించి ఫాతిమా కాలేజ్‌ను నిర్మించారన్నారు. అసదుద్దీన్ ఓవైసీ బంగ్లా కూడా ప్రభుత్వ స్థలంలోనే ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంఐఎంకు గులాంగిరి చేసిందని విమర్శించారు. కలెక్టర్ సాయంతో గోషామహల్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయని రాజాసింగ్ పేర్కొన్నారు.

# త్వరలో జర్నలిస్టులకు మంచి రోజులు

**విశ్వంభర, నారాయణపూర్:** వార్తలు రాసే వాడే నిజమైన జర్నలిస్టు అని తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. వార్తలు రాయకుండా అక్రిడేషన్ కార్డులు కొనుగోలు చేసిన వారు జర్నలిస్టులు ఎలా అవుతారన్నారు. అక్రిడేషన్ కార్డులు ఉన్నా, లేకున్నా వార్తలు రాసే జర్నలిస్టులంతా సమానమేనని వివరించారు. త్వరలో జర్నలిస్టులకు మంచి రోజులు రాబోతున్నట్లు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మంగళవారం ఆయన సీపీఐ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులు ఆయనకు పూలబొకే తో స్వాగతం పలికి, శాలువాలతో సన్మానించారు. జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులందరికీ సమస్యలున్న మాట వాస్తవమన్నారు. గతంలో ఏ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారం పై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం దృష్టి సారించారని తెలిపారు. త్వరలో రాష్ట్రంలోని సీనియర్ జర్నలిస్టులతో కమిటీని ఏర్పాటు చేసి చిన్న పెద్ద పత్రికల మధ్య ఉన్న సమస్యలు, జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం చేయబోతున్నట్లు తెలిపారు. జర్నలిస్టులకు అన్యాయం జరగకుండా త్వరలో ఒక కమిటీని నియమించి సమస్యలన్నింటిని కొలిక్కి తెస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడేషన్లు,చిన్న పెద్దపత్రికల మధ్య తేడాలు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పత్రికల సర్కులేషన్ బట్టి అక్రిడేషన్ కార్డుల సంఖ్య పెరుగుతుందే తప్ప అన్ని పత్రికలు, జర్నలిస్టులు అంతా సమానమేనని వివరించారు. రాష్ట్రంలో 25 వేల మంది జర్నలిస్టులు పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్డులకు,హెల్త్ కార్డులకు,ఇంటిస్థలాలకు సంబంధం లేదని వివరించారు. విలేకరుల సమావేశంలోప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు



కే శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య యాదవ్, వివిధ దినపత్రిక విలేకరులు పాల్గొన్నారు.

# గోషామహల్‌లో కొత్త ఉస్మానియా ఆసుపత్రి

- 32 ఎకరాల్లో భవనాల నిర్మాణానికి నిర్ణయం
- రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని డిజైన్లు
- 22 జిల్లాల్లో జిల్లా సమాఖ్య భవనాలకు ఎకరం చొప్పున స్థలం
- వచ్చే ఏడాదిలోపు కొత్తగా 15 నర్సింగ్ కాలేజీ భవనాలు
- స్పీడ్ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్?లోని గోషామహల్ లో ఉస్మానియా హాస్పిటల్ కొత్త భవనాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను వేగవంతం చేయాలని చెప్పారు. గోషా మహల్ లోని పోలీస్ స్టేడియం, పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్కు దాదాపు 32 ఎకరాల స్థలముంది. ప్రస్తుతం పోలీస్ విభాగం అధ్వర్యంలో ఉన్న ఈ స్థలాన్ని వెంటనే వైద్య ఆరోగ్య శాఖకు బదిలీ చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అక్కడే ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా ఎంచుకున్న స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) ప్రణాళికలో ఉన్న వివిధ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సచివాలయంలో తొలి సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. స్పీడ్ జాబితాలో ఉన్న 19 పనుల్లో ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవన నిర్మాణం, 15 కొత్త నర్సింగ్ కాలేజీలు, 28 కొత్త పారామెడికల్ కాలేజీలు, జిల్లాల్లో సమాఖ్య భవనాల నిర్మాణాలకు సంబంధించిన ప్రణాళికలను ముఖ్యమంత్రి చర్చించారు. రాబోయే 50 ఏళ్ల అవసరాలను అంచనా వేసుకొని, కొత్త ఆసుపత్రి నిర్మాణ డిజైన్లు ఉండాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా అక్కడికి చేరుకునే కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేయాలని, ఆసుపత్రి చుట్టూరా నలు దిశలా రోడ్డు ఉండేలా డిజైన్ చేయాలని చెప్పారు. ఆసుపత్రికి అవసరమైన అన్ని విభాగాలతో పాటు అకడమిక్ బ్లాక్, నర్సింగ్ ఉద్యోగులకు హాస్టళ్లు కూడా నిర్మించాలని ఆదేశించారు. కార్పొరేట్ తరహాలో వైద్య విభాగాలు, సేవలన్నీ అక్కడే అందుబాటులో ఉండాలని సూచించారు. కేవలం కాంక్రీట్ భవంతులు, బహుళ అంతస్తులు కాకుండా ఆహ్లాదకరమైన విశాలమైన ఖాళీ ప్రాంగణం ఎక్కువగా ఉండేలా డిజైన్లు ఉండాలని సూచించారు. ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి అనుభవజులైన ఆర్కిటెక్టులతో డిజైన్‌లను తయారు చేయించాలని అన్నారు. ఇప్పుడున్న ఉస్మానియా ఆసుపత్రి భవనాలను చారిత్రక కట్టడాలుగా పరిరక్షించే బాధ్యతను చేపడుతామని ముఖ్యమంత్రి చెప్పారు. మూసీ రివర్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో భాగంగా అక్కడున్న భవనాలను పర్యాటకులను ఆకట్టుకునే చారిత్రక భవనాలుగా తీర్చిదిద్దుతా మని అన్నారు. గోషామహల్ స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించినందుకు పోలీసు విభాగానికి ప్రత్నామ్నాయ స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పేట్ల బుర్జులో ఉన్న పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఆర్గనైజేషన్, సిటీ పోలీస్ అకాడమీ, చుట్టూ ఉన్న స్థలాన్ని క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ఇప్పుడు గోషా మహల్ లో ఉన్న పోలీస్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను అక్కడికి తరలించేలా చూడాలని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మించే ఆసుపత్రుల పనులను వేగవంతం చేయాలని, 15 నర్సింగ్ కాలేజీ భవనాలను వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అందుకు వీలుగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది నుంచే నర్సింగ్ కాలేజీలను ప్రారంభించాలని, తాత్కాలికంగా అద్దె భవనాల్లో వీటిని నిర్వహించే ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇప్పటికే పది జిల్లాల్లో సమాఖ్య భవనాలున్నాయని, మిగతా 22 జిల్లాల్లో కొత్త భవనాల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఒక్కో జిల్లాలో సమాఖ్య భవనాలకు ఒక ఎకరం స్థలం కేటాయించేందుకు అంగీకరించారు. ముందుగా స్థలాలను గుర్తించాలని అధికారులను సీఎం ఆదేశించారు. హైదరాబాద్ లోని శిల్పారామం పక్కనే మహిళా శక్తి సంఘాలకు కేటాయించిన మూడు ఎకరాల స్థలాన్ని వెంటనే ఆ విభాగానికి బదిలీ చేయాలని సీఎం ఆదేశించారు. మహిళా శక్తి సంఘాలు తయారు చేసే తమ ఉత్పత్తులతో అక్కడ ఏడాది పొడవునా వివిధ స్టాళ్లు నిర్వహించేలా భారీ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రపంచ స్థాయి అతిథులు, వివిధ రంగాల ప్రముఖులు, జాతీయ స్థాయి నేతలు ఎవరు హైదరాబాద్ కు వచ్చినా తప్పకుండా సందర్శించే స్థలంగా ఆ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ఏడాది పొడవునా నిర్వహించే ఎగ్జిబిషన్ లా వివిధ రకాల ఉత్పత్తులు అక్కడ అందరికీ అందుబాటులో ఉంచాలని అన్నారు.

# న్యాయమే గెలిచింది.. కవిత భావోద్వేగం

- కవితకు బెయిల్ రావడంపై బీఆర్ఎస్ నేతల హర్షాతిరేకాలు
- బండి సంబయ్ పై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలి:
- సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు కేటీఆర్ విజ్ఞప్తి
- సుప్రీం కోర్టు న్యాయం పక్షాన నిలిచింది
- కవితకు బెయిల్‌ను స్వాగతిస్తున్నాం
- బీ ఆర్ ఎస్‌తో పాటు తెలంగాణ వాదులకు ఊరట
- లిక్కర్ పాలసీ పై అక్రమ కేసు
- వాస్తవాల్లేవని మేం ముందునుంచే చెబుతున్నాం



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయటంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ వివాదస్పద వ్యాఖ్యలు చేయటాన్ని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. సుప్రీంకోర్టుకు ఉద్దేశాలు ఆపాదించేలా కామెంట్స్ చేసిన బండి సంజయ్ తీరును తప్పుబట్టారు. ఎమ్మెల్సీ కవిత కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయటం కాంగ్రెస్, బీఆర్ఎస్ లా విజయమంటూ బండి సంజయ్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ లాయర్ చేసిన కృషితోనే బెయిల్ వచ్చిందనటాన్ని ఖండించారు. మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కవిత కు లిక్కర్ కేసులో బెయిల్ మంజూరు చేసిన సుప్రీం కోర్టు న్యాయం పక్షాన నిల్చిందని మాజీ స్పీకర్, బీఆర్ఎస్ నాయకులు సి. మధుసూదనాచారి, పల్లె రవికుమార్ అన్నారు. లిక్కర్ కేసులో కవితకు బెయిల్ వచ్చిన నేపథ్యంలో మంగళవారం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిన్న మొన్నటి వరకు బీఆర్ఎస్ , బీజేపీ కల్సిపోయిందని వ్యాఖ్యానించిన సీఎం రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలకు సుప్రీం కోర్టు చెప్పదెబ్బలాంటి తీర్పునిచ్చిందని వ్యాఖ్యానించారు. కవిత ఓ పోరాట యోధురాలని ఆమెపై నమోదైన కేసులో ఏ మాత్రం వాస్తవాల్లేవని, ఈ విషయం బీఆర్ఎస్ నేతలు ముందు నుంచే చెబుతున్నారని గుర్తు చేశారు. కవితకు ఈ రోజు బెయిల్ వచ్చింది, రేపు అక్రమంగా బనాయించిన కేసు నుంచి కడిగిన ముత్యంలా బయట పడతారని అన్నారు. సుప్రీంకోర్టు కవిత బెయిల్ పిటిషన్ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ఈడీ ,సీబీఐ లకు చెంప పెట్టు లాంటివని అన్నారు. దర్యాప్తు సంస్థల కక్ష సాధింపు చర్యలను సుప్రీం కోర్టు తీవ్రంగా తప్పు బట్టిందని వారు పేర్కొన్నారు. పాలక పక్షం రాజకీయ ప్రత్యర్థులను వేధిస్తున్న ఈడీ ,సీబీఐ ల తీరు పై దేశ వ్యాప్త చర్చ జరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు.

**కేంద్ర మంత్రి బండి వ్యాఖ్యలు రాజకీయ అజ్ఞానం : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి:** మద్యం పాలసీలో ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ కక్ష్యతో దర్యాప్తు సంస్థలు పెట్టిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం పట్ల మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆధారాల్లేని కేసులో ఐదు నెలలు జైలులో ఉంచడం బాధాకరమని, సుప్రీం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేయడాన్ని రెండు రాజకీయ పార్టీల ఒప్పందంగా పేర్కొనడం కేంద్ర మంత్రి స్థాయిలోఉన్న బండిసంజయ్ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని, ఈ వ్యాఖ్యలు కోర్టు ధిక్కరణ కిందకే వస్తాయని అన్నారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండిసంజయ్ ఇప్పటికైనా చౌకబారు వ్యాఖ్యలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

**ఇదీ రాజకీయ ప్రేరేపిత కేసు మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్:** ఎమ్మెల్సీ కవితపై నమోదు చేసిన ఢిల్లీ లిక్కర్ కేసు రాజకీయ ప్రేరేపిత కేసు అని మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చివరకు కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయటంతో న్యాయమే గెలిచిందన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఢిల్లీ లిక్కర్ కేసుపై స్పష్టత వచ్చిందన్నారు. అప్రూవర్స్ అంటే ఒకరు, ఇద్దరు వుంటారు కానీ ఢిల్లీ లిక్కర్ కేసులో 11 మంది అప్రూవర్లుగా మారారని, ఈ కేసులో ఇప్పటి వరకు రికవరీ ఏం చేయలేకపోయారన్నారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రశ్నించే విధంగా బీజేపీ, కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని తలసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు జడ్జీలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయటం సరికాదని సూచించారు. కవితకు బెయిల్ రావటంతో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు చేసుకుంటారని తెలిపారు. దిల్లి లిక్కర్ కేసులో చాలామందికి బెయిల్ ఇచ్చారని, కవితకు కూడా బెయిల్ ఇవ్వడంలో అభ్యంతరం ఏంటి అని ప్రశ్నించారు. బెయిల్ అడగడం అనేది కవిత హక్కు అన్నారు. విషయాన్ని ముందు నుంచే చెబుతున్నామన్న విషయాన్ని గుర్తు చేశారు.

**15 రోజుల్లోనే బెయిల్ వచ్చేది:** ఎమ్మెల్సీ కవిత కు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడం పట్ల సంతోషం ఉందని మాజీ ఎంపీ బోయిన్ పల్లి వినోద్ కుమార్ వ్యాఖ్యానించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎమ్మెల్సీ కవిత సంస్కృతి పరంగా కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. బతుకమ్మ పండుగను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లిన ఘనట కవితదే నని వ్యాఖ్యానించారు. రాజకీయ నేతలు ఈ కేసులో లేకపోతే, కేవలం 15 రోజుల్లో బెయిల్ వచ్చే కేసు ఇదని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ వ్యతిరేక పార్టీలకు చెందిన రాజకీయ నేతలుఈ కేసులో ఉన్నందునే, వారిని జైల్లో పెట్టారని, ఢిల్లీ లిక్కర్ కేసులో ఒక్క రూపాయి రికవరీ చేయలేదన్నారు. సౌత్ గ్రూప్ అని పేరు పెట్టి అహంకారంతో వ్యవహరించారని విమర్శించారు. ఛార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత జైల్లో ఎందుకు ఉండాలని కోర్టు అడిగిన ప్రశ్నకు అడిషనల్ సొలిసిటర్ జనరల్ నీళ్లు నమిలారని ఆయన వివరించారు.

**రాజకీయ కుట్రతోనే తప్పుడు కేసులు: దాసోజు:** రాజకీయ కుట్రతోనే ఎమ్మెల్సీ కవితపై తప్పుడు కేసులు బనాయించారని, చివరకు సుప్రీం కోర్టులో న్యాయమే గెలిచిందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ శ్రవణ్ దాసోజు అన్నారు. సుప్రీం కోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తూ, సత్యం, న్యాయం గెలిచినట్టు అభివర్ణించారు. విచారణ సమయంలో కోర్టు చేసిన వ్యాఖ్యలు కవితకు అన్యాయం జరిగిందని స్పష్టం చేశాయని ఆయన పేర్కొన్నారు. దర్యాప్తు పూర్తయ్యాక, ఛార్జ్ షీట్ సమర్పించిన తర్వాత కూడా కవితను కస్టడీలో ఉంచటానికి కారణం ఏమిటని సుప్రీం కోర్టు ప్రశ్నించినట్లు ఆయన వివరించారు.

# పాఠశాలలను సందర్శించిన విద్యాధికారి రేణుకా దేవి



**విశ్వంభర, దోమ:** వికారాబాద్ దోమ మండలంలోని జడ్పీహెచ్ఎస్ గుండాల్ ప్రాథమిక పాఠశాల, జెడ్ పీ హెచ్ ఎస్ ఉన్నత పాఠశాలను మంగళవారం వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకా దేవి సందర్శించడం జరిగినది. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని అన్ని వసతులను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులలో జరిగిన కార్యక్రమాలను గురించి తెలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ ఎల్ ఎన్, లిప్ కి సంబంధించి బేస్ లైన్ పరీక్షల నిర్వహణ గురించి ఎఫ్ ఏ వన్ పరీక్షల సమీక్ష, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందించిన యూనిఫార్మ్ గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన పౌష్టిక ఆహారాన్ని విద్యార్థులకు అందించవలసిందిగా సూచించారు. అలాగే అమ్మ ఆదర్శ కమిటీ లో భాగంగా పూర్తి చేయబడిన పనులను పరిశీలించారు. ప్రతి ఉపాధ్యాయుడు కూడా సమయ పాలన పాటించాలని ప్రతి విద్యార్థి పై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన విద్యను విద్యార్థులకు అందించాలని అన్ని విషయాలను సిలబస్ ప్రకారం పూర్తి చేయాలని పదవ తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక చొరవ చూపి ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి మంచి ఫలితాలను 100% ఫలితాల తీసుకురావాలని సూచించారు. పేరెంట్ టీచర్ మీటింగులను నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులతో విద్యార్థుల ప్రగతిని చర్చించి తల్లిదండ్రులను కూడ భాగస్వాములను చేయాలని, ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. జిల్లా స్థాయి అధికారి ఏఎమ్ఓ రామ్ మస్తా, ఉపాధ్యాయులు మల్లారెడ్డి, వెంకట్ రెడ్డి, సీ ఆర్ పీ రఘు సింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# మరో పోరాటం తప్పదు

**విశ్వంభర, రామన్నపేట:** మునిపంపుల–లక్ష్మాపురం మట్టిరోడ్డుకు బదులుగా బీటీ రోడ్డు నిర్మాణం చేసి, ప్రజల సమస్యను పరిష్కరించాలని మునిపంపుల గ్రామంలో సీపీయం చేపట్టిన నిరాహారదీక్ష ఐదవ రోజున పంచాయతీరాజ్ డీఈ అలంపల్లి శ్రీనివాస్, ఏఈ గాలయ్య దీక్షా శిబిరానికి వచ్చి దీక్ష విరమింపజేశారు. దీక్షలో కూర్చున్న నాయకులు అందించిన వినతిపత్రం స్వీకరించి, అనంతరం మాట్లాడుతూ గత కాలం నుండి బీటీ రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే అని ఐదు కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరు కాగానే మొదటి ప్రాదాన్యతగా రోడ్డుకు నిధులు కేటాయించి త్వరలోనే బీటీ రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చి దీక్ష విరమింపజేశారు. సీపీయం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేక అశోక్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు అనేక సంవత్సరాలుగా గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున స్వచ్ఛందంగా గ్రామ ప్రజలు ఐదు రోజుల పాటు పోరాటం చేస్తే స్పందించి దీక్షాశిబిరానికి వచ్చి హామీ ఇచ్చిన పంచాయతీరాజ్ అధికారులకు ధన్యవాదాలు అన్నారు. వెంటనే ప్రతిపాదనల తగినట్టుగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని అనేక వర్గాల ప్రజల సమస్యను పరిష్కరించాలని అన్నారు. లేని పక్షంలో సంబందిత గ్రామ ప్రజలను సమీకరించి మరో పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీయం జిల్లా కమిటి సభ్యులు జల్లల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కమిటి సభ్యులు జంపాల అండాలు, కల్లూరి నగేష్, శాఖ కార్యదర్శి తొలుపునూరి శ్రీనివాస్, గ్రామ నాయకులు ఉంద్రాతి నర్సింహ్మ, యండి మైనొద్దిన్, గునుగుంట్ల సత్యనారాయణ, జోగుల శ్రీనివాస్, తాళ్ళపల్లి జితేందర్, జంపాల ఉమాపతి, తొలుపునూరి చంద్రశేఖర్, బూడిద భిక్షం, పులిపలుపుల నాగార్జున, నోముల రమేష్, కుక్కడంపు స్వామి, మేడి బాషయ్య, సిరిశాల యాదగిరి, అప్పం సురేందర్, ఆకుల మల్లమ్మ, శేఖర్, ఎడ్ల ధనమ్మ, బొడ్డుపల్లి సంద్య, ఖలిమొద్దిన్, హరికృష్ణ, వస్కుప్పల ఎల్లయ్య, నోముల నర్సిరెడ్డి పాల్గొన్నారు.

# 25 లీటర్ల మద్యం పట్టివేత



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండలం, వెల్లంకి గ్రామంలో మద్యం అక్రమంగా అమ్ముతున్నారని సమాచారం అందడంతో ఎస్ఐ ఆదేశానుసారం ఎం.సురేందర్, ఏఎస్ఐతో సిబ్బంది కలిసి గ్రామంలో సోదాలు నిర్వహించారు. గ్రామంలోని పెద్దగోని సత్తయ్య ఇంటి వెనుక గల చెట్ల పొదలలో తనిఖీ చేయగా, అక్కడ అక్రమంగా నిల్వ చేసిన 25 లీటర్ల మద్యాన్ని స్వాదీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ ఎం. సురేందర్ తెలిపారు.

# రక్షణ కల్పించండి

## హెచ్.ఆర్,సీలో దళిత మహిళా జర్నలిస్టు ఫిర్యాదు




**విశ్వంభర, బషీర్ బాగ్:** మాజీ పోలీసు అధికారి కర్నాటి ఉదయ్ భాస్కర్ రెడ్డి, అతని భార్య ప్రమీలరెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉన్నదని, వారి నుంచి రక్షణ కల్పించాలని ఓ దళిత మహిళా జర్నలిస్టు ఎన్ఎస్ శాంతి మానవ హక్కుల కమిషన్ (హెచ్ ఆర్ సీ)ను ఆశ్రయించింది. ఈ మంగళవారం నాంపల్లిలోని హెచ్ ఆర్ సీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మణికొండలోని శ్రీలక్ష్మి నగర్ లో మాజీ పోలీసు అధికారి కర్నాటి ఉదయ్ భాస్కర్, ప్రమీలరెడ్డికి చెందిన దతాత్రేయ క్లాంప్లెక్స్ మూడో అంతస్మలోని ఫ్లాట్ నంబర్ 99ను అద్దెకు తీసుకొని సేవియర్ కేర్ హాస్పిటల్, కీర్తన టెలివిజన్ సంస్థలను మూడేండ్లుగా నిర్వహిస్తున్నట్టు శాంతి ఫిర్యాదులో పేర్కొన్నారు. తన సంస్థలను స్వాధీనం చేసుకోవాలనే దుర్బుద్ధితో ఉదయ్ భాస్కర్ రెడ్డి, ప్రమీల తనపై దుర్భాషలాడుతూ వేధిస్తున్నారని ఆమె తెలిపారు. తాను మాజీ పోలీస్ అధికారిని అంటూ దౌర్జన్యం చేస్తూ తన ఆఫీస్ లో విలువైన ఫర్నిచర్, హాస్పిటల్లో మిషనరీని ధ్వంసం చేశారని చెప్పారు. ఈ విషయమై మానవ హక్కుల కమిషన్ తనకు న్యాయం చేయాలని శాంతి ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలి

**విశ్వంభర,హైదరాబాద్:** జీహెచ్ఎంసీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని బీఎంఎస్ గుర్తింపు పొందిన భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ సర్కిల్ -17 (ఖైరతాబాద్) కొత్త డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డిని కోరింది. ఇటీవలే బదిలీ పై వచ్చిన ఆయనను యూనియన్ నేతలు మంగళవారం కలిసి సత్కరించారు. యూనియన్ జనరల్ సెక్రటరీ టి. కృష్ణ మాట్లాడుతూ ముఖ్యంగా పర్మినెంట్, కాంట్రాక్టు, ఔట్ సోర్స్ ఉద్యోగులు అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని, వీరిలో శానిటేషన్ విభాగంలో పని చేసే మహిళా కార్మికులు అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. వారికి బీఎంఎస్ ఎప్పటికీ అండగా నిలుస్తుందని వివరించారు. మహిళా స్వీపర్ల పై వేధింపులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని వివరించారు. ఇక శానిటేషన్ విభాగంలో పని చేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు సకాలంలో కొబ్బరి నూనె, సబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. నాలుగో తరగతికి చెందిన పర్మినెంట్ ఉద్యోగుల్లో చాలా మంది పదోన్నతులకు అర్హులైనా, వారికి ఇంత వరకు పదోన్నతులు కలగక ఎదురుచూస్తున్నారని వివరించారు. డీసీని కలిసిన వారిలో బీఎంఎస్ ఖైరతాబాద్ జనరల్ సెక్రటరీ ఆర్. వెంకటేశ్, మహిళా విభాగం నేత మనోరమ, యూనియన్ నేత రూపేశ్ కుమార్ ఉన్నారు.

# యువతను ప్రోత్సహించడమే లక్ష్యం



**విశ్వంభర, కత్బుల్లాపూర్:** మేడ్చల్ జిల్లా కత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా మాదకద్రవ్య రహిత, ఆరోగ్యమైన రాష్ట్రంగా క్రీడా రంగాలలో యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా డీసీపీ జోన్ పోలీసులు వాలీబాల్ టోర్నమెంట్ జీఆర్ఐటీ, డీసీపీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. దీనిని బాలానగర్ డీసీపీ కె.సురేష్ కుమార్ ప్రారంభించారు. దాదాపు 8 పోలీస్ స్టేషన్లో నుండి 40 జట్లు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ మహిళా జట్టు, సరూర్నగర్ స్పోర్ట్స్ అకాడమీ పాల్గొన్నారు. ఆటగాళ్లు, విద్యావంతులు, మీడియా విలేకరులు, రిఫరీలు, ఎన్.సి.సీ క్యాడేట్ ల జట్లుతో సహా సుమారు 500 మంది వాలీబాల్ టోర్నమెంట్ ఇనాగరేషన్ సెరమనిలో పాల్గొన్నారు.ఏడీవీపీ, ఏసీపీ శివభాస్కరన్, కె. పురుషోత్తం, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.



## నిబంధనల మేరకే ఖర్గే కుటుంబసభ్యుల ట్రస్ట్‌కు భూ కేటాయింపు : సిద్ధరామయ్య

**బెంగళూరు:** బెంగళూర్‌కు సమీపంలోని ఏరోస్పేస్ పార్క్‌లో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే కుటుంబానికి చెందిన ట్రస్ట్‌కు ప్లాట్ కేటాయించడంపై కర్నాటక సీఎం సిద్ధరామయ్య స్పందించారు. అధికారులు నిబంధనల మేరకే సదరు ట్రస్ట్‌కు భూమి కేటాయించారని, అర్హతలు, విధి, విధానాలను అనుసరించారని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కాషాయ పాలకులు చాణక్య యూనివర్సిటీకి భూములు కేటాయించారని ఆరోపించారు.కాగా, బెంగళూర్‌కు సమీపంలోని ఓ ఏరోస్పేస్ పార్క్‌లో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే కుటుంబానికి చెందిన ఓ ట్రస్ట్‌కు 5 ఎకరాల భూ కేటాయింపునకు ఆమోదం లభించడం పెను దుమారం రేపుతోంది. ఖర్గే కుమారుడు రాహుల్ ఈ ట్రస్ట్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఖర్గే కుటుంబానికి చెందిన ట్రస్ట్కు కర్నాటక పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి బోర్డు స్థల కేటాయింపు అధికార దుర్వినియోగమని, కర్నాటక సర్కార్ బంధుప్రీతికి సంకేతమని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాల్వీయ ట్వీట్ చేశారు.

ఈ ఉదంతంపై ఖర్గే సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. ఐదు ఎకరాల భూమిని ఎస్సీ కోటా కింద సిద్ధార్థ విహార్ ట్రస్ట్‌కు కట్టబెట్టారని, ఈ ట్రస్ట్ కాంగ్రెస్ చీఫ్ ఖర్గే అల్లుడు, కలబురగి ఎంపీ రాధాకృష్ణ, కుమారుడు రాహుల్ ఖర్గే ఇతర కుటుంబసభ్యులు నిర్వహిస్తున్నారని మాల్వీయ పేర్కొన్నారు. హైటెక్ డిఫెన్స్ ఏరోస్పేస్ పార్క్ కోసం కేఐఏడీబీ పక్కనపెట్టిన 45.94 ఎకరాల స్థలంలో ఈ 5 ఎకరాలు భాగమని వివరించారు. స్థలాల కేటాయింపులో అక్రమాలు జరిగాయని సామాజిక కార్యకర్త దినేష్ కలహళ్లి కర్నాటక గవర్నర్ తావర్ చంద్ గహ్లోట్‌కు ఫిర్యాదు చేశారు.

## బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలిగా మాయావతి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నిక



**లక్నో:** బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు గా మరోసారి మాయావతి ఎన్నికయ్యారు. బీఎస్పీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ, జాతీయ స్థాయి ఆఫీస్ బేరర్‌లు, రాష్ట్ర పార్టీ నేతలు అందరూ కలిసి ప్రత్యేక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ వెల్లడించింది. ప్రత్యక్ష రాజకీయాల నుంచి మాయావతి వైదొలుగుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఆమె కొట్టిపారేసిన మరుసటి రోజే అమెను మళ్లీ అధ్యక్షురాలిగా ఎన్నుకోవడం గమనార్హం. కాగా, మాయావతి క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకుంటున్నారంటూ ఈ మధ్యకాలంలో జరుగుతున్న ప్రచారాన్ని ఆమె కొట్టిపారేశారు. 'కులవాద మీడియా' ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేస్తోందని ఆరోపించారు. డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్, గౌరవనీయులైన కాన్షీరామ్ జీ లాంటి బహుజనుల ఆశయాలను నిర్వీర్యం చేసే ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టడం కోసం తన చివరి శ్వాస వరకు బీఎస్పీ ఆత్మగౌరవం, ఆత్మగౌరవ ఉద్యమానికి అంకితం కావాలన్నదే తన నిర్ణయమని చెప్పారు. క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాను లేనప్పుడు లేదా అనారోగ్యంతో ఉన్నప్పుడు ఆకాశ్ ఆనంద్‌ను బీఎస్పీ వారసుడిగా పార్టీ ప్రతిపాదించిందని మాయావతి చెప్పారు. అప్పటి నుంచి ఇలాంటి తప్పుడు వార్తలను కుల మీడియా ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఇలాంటి ప్రచారాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. గతంలో తనను రాష్ట్రపతిని చేస్తారన్న పుకార్లు కూడా వ్యాపించాయని మాయావతి గుర్తుచేశారు. రాష్ట్రపతి కావడమంటే క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకోవడమేనని, కాన్షీరామ్ శిష్యురాలిగా తాను ఆ పదవిని ఎలా స్వీకరిస్తాను..? అని ప్రశ్నించారు.

## అక్కడే కొత్త విగ్రహం నిర్మిస్తాం: ఫడణవీస్




**ముంబయి:** మహారాష్ట్రలో 35 అడుగుల ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం కూలిపోయిన సంగతి తెలిసిందే. తాజగా ఈ ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందిస్తూ.. విగ్రహం కూలిన ప్రదేశంలోనే కొత్త విగ్రహం నిర్మిస్తామని పేర్కొన్నారు. విగ్రహ నిర్మాణం నౌకాదళం పర్యవేక్షిందని, రాష్ట్ర ప్రభుత్వం కాదని వెల్లడించారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విగ్రహ నిర్మాణం, సంస్థాపనను నౌకాదళం పర్యవేక్షిందని, రాష్ట్ర ప్రభుత్వం కాదని ఫడణవీస్ స్పష్టం చేశారు. నిర్మాణం, స్థాపన సమయంలో గాలి వేగం వంటి ముఖ్యమైన స్థానిక అంశాలను పర్యవేక్షకులు విస్మరించి ఉంటారన్నారు. అదేవిధంగా విగ్రహానికి ఉపయోగించిన ఇనుము సముద్రపు గాలులకు తుప్పు పట్టే అవకాశం ఉందన్నారు. ఈ అంశాలను విగ్రహ తయారీ దారులు అర్థం చేసుకున్నారా లేదా అనేది ముందున్న ప్రశ్నని వెల్లడించారు. విగ్రహం కూలిన ప్రదేశంలోనే శివాజీ మహరాజ్ విగ్రహాన్ని నిర్మించాలనేది తమ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని వివరించారు. ఈ ఘటనపై విచారణ జరుగుతుందన్నారు. విగ్రహం కూలడంపై ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టడాన్ని ఆయన ఖండించారు. విగ్రహం కూలిపోవడం బాధాకరమైన విషయమేనని, దీన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేయాల్సిన అవసరం లేదన్నారు.సింధుదుర్గ్ జిల్లాలోని రాజ్కోట్ కోటలో 35 అడుగుల శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నౌకాదళ దినోత్సవం సందర్భంగా గతేడాది ప్రధాని నరేంద్ర మోదీ విగ్రహ ఆవిష్కరణ చేశారు. అయితే రాష్ట్రంలో గత రెండు, మూడు రోజులుగా భారీ వర్షాలు, ఈదురు గాలులు వీస్తున్నాయి. ఈ కారణంగానే విగ్రహం కూలినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనకు గల కారణాలు తెలుసుకునేందుకు విచారణ జరుగుతోంది.

## జాతీయ రహదారుల్లో ఆక్రమణలు తొలగించండి

### సుప్రీం కోర్టు ఆదేశం

**దిల్లీ:** జాతీయ రహదారుల ఆక్రమణలపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. హైవేల్లో ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రవాదారుల శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తరచూ పర్యవేక్షించాలని సూచించింది.అంతే కాకుండా, ఈ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ఒక పోర్టల్ను రూపొందించాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అది ఎల్లప్పుడు పౌరులకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నంబర్ను ఏర్పాటు చేయాలని సూచించింది. దీనిలో చిత్రాలను అప్లోడ్ చేసే విధంగా వీలు కల్పించాలని పేర్కొంది. ఈ పోర్టల్ గురించి ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని కేంద్రానికి సూచించింది. హైవేలపై ఆక్రమణలపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ విధంగా స్పందించింది.సెప్టెంబరు 30లోపు తన ఆదేశాలను పాటించాలని కేంద్రానికి స్పష్టం చేసింది. 2020 మార్చి 18నాటి సర్క్యులర్ ప్రకారం జాతీయ రహదారులు.. వాటిపై ఆక్రమణల తనిఖీల కోసం బృందాల ఏర్పాటుకు సంబంధించిన డేటాను న్యాయస్థానానికి సమర్పించాలని కేంద్ర మంత్రిత్వ శాఖను ఆదేశించింది.



### జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై

# ఉధృతమైన నిరసనలు

- జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై ఉధృతమైన నిరసనలు
- 'నబన్నా అభియాన్' పేరుతో హావ్లా నుంచి విద్యార్థుల ర్యాలీ
- సీఎం రాజీనామా చేయాలని డిమాండ్
- విద్యార్థులకు తోడుగా ఆందోళనల్లో పాల్గొన్న బీజేపీ కార్యకర్తలు
- బెంగాల్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ: జేపీ నడ్డా
- మమతా బెనర్జీకి లై డిటెక్టర్ టెస్ట్ నిర్వహించాలి: గౌరవ్ భాటియా



**కోల్‌కతా:** కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. ఈ కేసులో నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం 'పశ్చిమబంగా ఛాత్ర సమాజ్ మంగళవారం నిరసన చేపట్టింది. 'నబన్నా అభియాన్' పేరుతో హావ్లా నుంచి విద్యార్థులు ర్యాలీని ప్రారంభించారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సెక్రటేరియట్‌ను ముట్టడించాయి.

ఆందోళనకారులు బెంగాల్ సెక్రటేరియట్ ఉన్న నబానా వైపు దూసుకొచ్చారు. నబానా వైపు వచ్చే అన్ని రోడ్లను దిగ్బంధించారు పోలీసులు. ఒక్కరిని కూడా అటు వైపు అనుమతించలేదు. విద్యార్థులకు తోడుగా పలు బీజేపీ కార్యకర్తలు కూడా ఆందోళనకు దిగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. నిరసనల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

**సచివాలయం ముందు భారీ బందోబస్తు**

మంగళవారం ఈ కేసులో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థుల 'నబన్న మార్చ్'లో భాగంగా సచివాలయ భవనాన్ని ముట్టడిస్తామని ప్రకటించిన నేపథ్యంలో కోల్‌కతా పోలీసులు సచివాలయం చుట్టూ గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. హౌరాలో ఉన్న నబన్న భవన్ రాష్ట్ర సచివాలయం వరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పశ్చిమ బెంగాల్ ఛత్ర సమాజ్ అనే సంస్థ ఈ మార్చ్‌ను నిర్వహించింది. ఈ నిరసనలకు బీజేపీ కూడా మద్దతు తెలిపింది. రాష్ట్రంలోని విద్యార్థి సంఘాలు ఎలాంటి పార్టీ బ్యానర్ లేకుండా సోషల్ మీడియాలో నిరసనలో పాల్గొనాలని సామాన్య ప్రజలను ఆహ్వానించాయి. కాగా, శాంతియుతంగా సాగుతున్న ఈ నిరసనను అడ్డుకునే ప్రయత్నం చేయకూడదని పశ్చిమ బెంగాల్ గవర్నర్ డాక్టర్ సి.వి.ఆనంద్ బోస్ సోమవారం రాత్రి ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు.ఈ నేపథ్యంలోనే కోల్‌కతాలో విద్యార్థులు కదం తొక్కారు. డాక్టర్ హత్యాచారం ఘటనపై తమదైన శైలిలో నిరసన తెలిపారు. నలు దిక్కుల నుంచి సెక్రటేరియట్ నబానాను ముట్టడించేందుకు ప్రయత్నించారు. 15 నిముషాలకు ఓసారి విడతల వారిగా విద్యార్థులు దూసుకురావడం.. 15 నిముషాలకు ఓసారి పోలీసులు భాష్పవాయువు ప్రయోగించడంతో హైటెన్షన్ నెలకొంది.ఈ ప్రదర్శనను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర సచివాలయం పరిసర ప్రాంతాల్లో భద్రత కోసం 97 మంది సీనియర్ అధికారుల పర్యవేక్షణలో మొత్తం 2 వేల మంది పోలీసులను మోహరించినట్లు సమాచారం. ఇది కాకుండా, కోల్‌కతా, హౌర్వాను కలిపే ప్రదేశాలలో సుమారు 4,000 మంది పోలీసులను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిషనరేట్, జిల్లా విభాగాలకు చెందిన పోలీసు సిబ్బంది మోహరించారు. విద్యార్థి సంఘాలు . విద్యార్థులకు , పోలీసులకు మధ్య పలు చోట్ల ఘర్షణ చెలరేగింది. అయితే, వీరిని పోలీసులు అడ్డుకోవడంతో హావ్డాలోని సంతర్గాచి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.మార్చ్‌లో పాల్గొన్న ఆందోళనకారులు, బారికేడ్లను బద్దలుకొట్టేందుకు ప్రయత్నించారు. ఆందోళనకారులు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు వీరిపై బాష్పవాయువు ప్రయోగించారు. లాఠీఛార్జ్ చేసి గాల్లోకి కాల్పులు జరిపారు. మరోవైపు ఈ ఆందోళనకు ఎలాంటి అనుమతి లేదని చెబుతున్నారు పోలీసులు. పోలీసులు లాఠీఛార్జ్ చేసినప్పటికి , భాష్పవాయువు ప్రయోగించినప్పటికి ఆందోళనకారులు వెనక్కి తగ్గలేదు. హౌరా బ్రిడ్జి దగ్గర బైఠాయించారు. కొన్ని ప్రాంతాల్లో పోలీసులపైకి ఆందోళకారులు దాడులకు తెగబడ్డారు. గాయపడ్డ పోలీసులను ఆస్పత్రికి తరలించారు. ఈ ర్యాలీ నేపథ్యంలో సీఎం మమతా బెనర్జీ నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. హింసకు పాల్పడేందుకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ నలుగురు విద్యార్థులను అరెస్టు చేశారు. ఆ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించారు. అయితే ఆ విద్యార్థులు అర్ధరాత్రి సమయంలో అదృశ్యమయ్యారని బీజేపీ నేత సువేందు అధికారి ఆరోపించారు.సువేందు అధికారి మాట్లాడుతూ విద్యార్థులపై పోలీసులు చేస్తున్న దాడులను ఆపాలని, లేదంటే రాష్ట్రం మొత్తం స్తంభించిపోయేలా చేస్తామని హెచ్చరించారు.

బెంగాల్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ.. మహిళా భద్రత కోసం మాట్లాడే స్వేచ్ఛ లేదాః జేపీ నడ్డా

పశ్చిమ బెంగాల్ పరిస్థితుల పట్ల ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ వైఖరిపై భారతీయ జనతా పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షులు జగత్ ప్రకాష్ నడ్డా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కోల్‌కతాలో పోలీసుల అత్యుత్సాహ చర్యల పట్ల ప్రజాస్వామ్య సూత్రాలకు విలువనిచ్చే ప్రతి వ్యక్తికి కోపం తెప్పించేలా ఉన్నాయన్నారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సర్కార్, కోల్‌కతా సోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై జేపీ నడ్డా మండిపడ్డారు. బెంగాల్‌లో రేపిస్టులు, నేరస్థులకు సహాయం చేయడానికి ఇచ్చే విలువ, మహిళల భద్రత కోసం దీదీ సర్కార్ ఇవ్వడం లేదన్నారు.

మమతా బెనర్జీకి లై డిటెక్టర్ టెస్ట్ నిర్వహించాలి..

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై భారతీయ జనతా పార్టీ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన వారికి మమత రక్షణ కల్పిస్తున్నారని ఆరోపించింది. కేసులో నిజాలు బయటకు రావాలంటే ఆమెకు పాలీగ్రాఫ్ టెస్ట్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. మంగళవారం నిరసనలు చేపట్టిన విద్యార్థులను అడ్డుకోవడానికి ప్రభుత్వం భారీగా పోలీసు బలగాలను మోహరించడాన్ని ఖండించింది.విద్యార్థుల పట్ల మమత నియంతలా వ్యవహరిస్తున్నారని భాజపా జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో న్యాయమైన విచారణ జరగాలంటే ఆమె వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయాలని, వైద్యురాలిపై హత్యాచారం జరిగితే దానిని పోలీసులు ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజం తెలుసుకోవడానికి పోలీస్ కమీషనర్ వినీత్ గోయెల్కా కూడా లై డిటెక్టర్ టెస్ట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## భారీ వర్షా లకు గుజరాత్ అస్తవ్యస్తం..

### 6 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు



**గాంధీనగర్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌ను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. వరుసగా మూడోరోజైన మంగళవారం కూడా కుండపోత వర్షం కురిసింది. దీంతో రాష్ట్రం మొత్తం అస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వర్షపు నీరు చేరడంతో జనజీవనం స్తంభించిపోయింది. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ఈ వర్షాలకు ప్రధాన డ్యామ్‌లు, నదుల్లో నీటి మట్టాలు పెరిగాయి. చాలా నదులు ప్రమాదకరస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. పంచమహల్, నవ్‌సారి, వల్సాడ్, వడోదర, భరూచ్, ఖేడా, గాంధీనగర్, బోటాడ్, ఆరావళి జిల్లాల్లో నదులు, డ్యామ్‌ల్లో నీటి మట్టం భారీగా పెరిగి లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తింది. దీంతో ముందుజాగ్రత్త చర్యగా వందలాది మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఇప్పటి వరకూ 6 వేల మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. పంచమహల్‌లో దాదాపు 2,000 మందిని తరలించగా, వడోదరలో 1,000, నవ్‌సారిలో 1,200 మంది, వల్సాద్‌లో 800 మందిని ఇతర ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఇక ఈ వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. గాంధీనగర్, ఖేడా, వడోదర జిల్లాల్లో గోడ కూలిన ఘటనల్లో నలుగురు మృతి చెందగా.. ఆనంద్ జిల్లాలో చెట్టు కూలి ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరు వరద నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు.

బుధ, గురువారాల్లోనూ సౌరాష్ట్ర - కచ్ ప్రాంతంలో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. గురువారం వరకూ రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇక మంగళవారం కురిసిన తాజా వర్షాల కారణంగా రాజ్‌కోట్ నగరంలో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు, అండర్‌పాస్‌లు పూర్తిగా జలమయమయ్యాయి. ఒక్క రాజ్‌కోట్ నగరంలో ఉదయం 6 గంటల నుంచి నాలుగు గంటల వ్యవధిలోనే 142 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

24 గంటల వ్యవధిలో మొత్తం 251 తాలూకాల్లో కనీసం 24 తాలూకాల్లో 200 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మరో 91 తాలూకాల్లో 100 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు చెప్పారు. అత్యధికంగా మోర్బి జిల్లాలోని టంకారా తాలూకాలో 347 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. మోర్వ హడాఫ్‌లో 346 మి.మీ, ఖేడాలోని నడియాడ్‌లో 327 మి.మీ, ఆనంద్‌లోని బోర్సాద్‌లో 318 మి.మీ, వడోదర తాలూకాలో 316, ఆనంద్ తాలూకాలో 314 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

## భూములు దిగమింగి కాంగ్రెస్ హైకమాండ్‌కు భారీ ముడుపులు



**బెంగళూరు:** కర్నాటకలో కాంగ్రెస్ అగ్రనేతల భూఆక్రమణల ఆరోపణలు ప్రకంపనలు రేపుతున్నాయి. సీఎం సిద్ధరామయ్య ముడా స్కామ్‌లో కూరుకుపోగా తాజాగా ఆ పార్టీ జాతీయ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే మెడకూ భూముల కేటాయింపు వ్యవహారం చుట్టుకుంటోంది. బెంగళూర్‌కు సమీపంలోని ఏరోస్పేస్ పార్క్‌లో ఖర్గే కుటుంబసభ్యులు నిర్వహించే ట్రస్ట్‌కు భూముల కేటాయింపునకు గ్రీన్‌సిగ్నల్ లభించడం దుమారం రేపుతోంది.నిబంధనలకు విరుద్ధంగా ఖర్గే కుటుంబసభ్యులకు భూ కేటాయింపులు జరిపారని బీజేపీ భగ్గుమంటోంది. మూడేండ్ల కిందట కర్నాటకలో బీజేపీ అధికారంలో ఉండగా భూముల కేటాయింపులో స్కామ్ జరిగిందని కాంగ్రెస్ నానా రాద్ధాంతం చేసిందని ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ భారీ భూదందాకు తెరలేపిందని బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి ఆరోపించారు. 3677 ఎకరాల భూమిని ఎకరాకు కేవలం రూ. 1.22 లక్షలకు కట్టబెట్టాలని ఆ పార్టీ నేతలు నిర్ణయించారని అన్నారు.

కర్నాటక సీఎం అనుసరించే సోషలిజం అంటే పేదల నుంచి భూములు గుంజుకుని వాటిని పెద్దలకు కట్టబెట్టడమేనా అని ఆయన ప్రశ్నించారు. ఇవాళ మార్కెట్ రేటు ప్రకారం ఎకరం కనీసం రూ. 30 లక్షలు ఉంటుందని అన్నారు. కాంగ్రెస్, ఆ పార్టీ హైకమాండ్ కారుచౌకగా భూములు కట్టబెడుతూ భారీ ముడుపులు అందుకుంటున్నాయని తన సందేహమని సీటీ రవి ఆరోపించారు.

## యాపిల్ నూతన సీఎఫ్ఓగా కెవన్ పరేఖ్

**దిల్లీ:** యాపిల్ నూతన సీఎఫ్ఓగా భారత సంతతికి చెందిన కెవన్ పరేఖ్‌కు పదోన్నతి కల్పించింది. వచ్చే ఏడాది జనవరి నుంచి కెవన్ పరేఖ్ నూతన బాధ్యతలు చేపడతారు. 2014 నుంచి యాపిల్ సీఎఫ్ఓగా పనిచేస్తున్న లూకా మేస్త్రి స్థానంలో కెవన్ నియమితులయ్యారు. యాపిల్‌లో 11 ఏండ్ల ప్రస్థానంలో కెవన్ పలు హోదాల్లో పనిచేశారు.ప్రస్తుతం ఆయన కంపెనీ ఫైనాన్షియల్ ప్లానింగ్, ఎనాలిసిస్ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. సాధారణ, పాలనా వ్యవహారాలతో పాటు, ఇన్వెస్టర్ సంబంధాలు, మార్కెట్ రీసెర్చ్ వంటి పలు విభాగాలను కెవన్ పర్యవేక్షిస్తున్నారు. అంతకుముందు కెవిన్ పరేఖ్ గ్లోబల్ సేల్స్, రిటైల్, మార్కెటింగ్ ఫైనాన్స్ విభాగాలకు నేతృత్వం వహించారు.

ఇక యాపిల్‌లో ఆయన తొలినాళ్లలో ప్రోడక్ట్ మార్కెటింగ్, ఇంటర్నెట్ సేల్స్, సర్వీస్, ఇంజనీరింగ్ టీమ్స్‌లో పనిచేశారు. యాపిల్‌లో చేరకముందు కెవన్ పరేఖ్ థామ్సన్ రాయ్‌టర్స్, జనరల్ మోటార్స్ వంటి పలు కంపెనీల్లో నాయకత్వ స్థానాల్లో పనిచేస్తూ ప్రపంచవ్యాప్త అనుభవం గడించారు. మిచిగాన్ వర్సిటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పట్టా పొందిన ఆయన యూనివర్సిటీ ఆఫ్ చికాగో నుంచి ఎంబీఏ చేశారు.



### లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని

## ఆదివాసీల ధర్నా

**విశ్వంభర, ఆదిలాబాద్ బ్యూరో :** లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం ఆదిలాబాద్ ఆర్టీసీ బస్సు స్టాండ్ వద్ద ఆదివాసీలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సంద్భంగా అయన మాట్లాడుతూ.. జీవో నంబర్ 3ని యథావిధిగా కొనసాగించాలన్నారు. వలస లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్నారు. విద్య, ఉద్యోగ తదితర రంగాల్లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఎంతో వెనుకబడిన ఆదివాసీలకు న్యాయం జరుగాలంటే లంబాడీలను ఎస్టీ జాబితా నుంచే తొలగించాలన్నారు. కాగా, రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### రుణమాఫీలో ...

## తప్పుల సవరణ వేగవంతం చేయండి

### - అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** రుణమాఫీకి సంబంధించి రైతుల వివరాల నమోదులో ఎక్కడైనా తప్పులు ఉంటే వాటి సవరణ వేగవంతం చెయ్యాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు.రుణ మాఫీపై అధికారులుతో ఇప్పటి దాకా తీసుకున్న చర్యలను సమీక్షించి, బ్యాంక్ ల నుండి వచ్చిన వివరాలపై మంత్రి మంగళవారం సమీక్షించారు అనంతరం మంత్రి ఆదేశాలతో,అధికారులు టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు . ప్రతి మండల వ్యవసాయ అధికారి గ్రామాల వారీగా ప్రణాళికలను తయారు చేసి, దాని ప్రకారం గా కుంటుంబ సభ్యుల వివరాలను యాప్ లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. తప్పుగా నమోదు అయిన 124604 ఆధార్ వివరాలను సంబంధిత బ్యాంకులకు సరిచేయడానికి ఇవ్వటం జరిగిందని, ఇప్పటివరకు 41339 ఆదార్ వివరాలను సరిచేయటం జరిగిందన్నారు.ఈ సందర్బంగా వ్యవసాయ కార్యదర్శి మాట్లాడుతూ అగస్ట్ 15 , 2024 నాటికి 22,37, 848 లక్షల మంది రైతులకు 2 లక్షల లోపు ఉన్న పంట రుణ మాఫీ చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ కాని రైతుల కోసం యాప్ తయారు చేసినట్లు పేర్కొన్నారు. తేదీ 25.08.204 మరియు 26.08.2024 న రాష్ట్రం లోని అన్ని మండలాలలో టెస్ట్ ట్రయల్ చేశామని, బుధవారం నుండి పూర్తి స్థాయిలో ప్రతి జిల్లాలో గ్రామాల వారీగా మండల వ్యవసాయ అధికారి సర్వే చేయనున్నామని వివరించారు. రైతులందరి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసి నమోదు చేసుకోనున్నట్లు చెప్పారు. ఈ కాన్ఫరెన్స్ లో రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు గోపి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.





### ఎమ్మెల్సీ కవితకు బెయిల్ బీఆర్ఎస్, కాంగ్రెస్

# రెండింటి విజయం

### కాంగ్రెస్‌కు కంగ్రాట్స్ చెప్పిన కేంద్రమంత్రి బండి సంజయ్

**విశ్వంభర , తెలంగాణ బ్యూరో** : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కవితకు బెయిల్ మంజూరు చేయటంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలుఎ చేశారు. కాంగ్రెస్ లాయర్ల కృషితోనే కవితకు బెయిల్ వచ్చిందని ట్వీట్ చేశారు. కవితను బయటికి తీసుకొచ్చేందుకు కృషిచేసిన లాయర్‌ను కాంగ్రెస్ రాజ్యసభకు పంపిందని.. అభిషేక్ మను సింఘ్వీని ఉద్దేశించి పరోక్షంగా కామెంట్స్ చేశారు. రాజ్యసభ సభ్యునిగా ఆయన్ను ఎన్నుకునేందుకు కేసీఆర్ మద్దతు ఇచ్చారని ఆరోపించారు. అలాగే కవితకు బెయిల్ రావడం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల సమష్టి విజయం అంటూ కాంగ్రెస్‌కు కంగ్రాట్స్ చెప్పారు. లిక్కర్ కేసుకు సంబంధించి బెయిల్ కోసం మార్చి 15న అరెస్టైన ఆమె పలు మార్లు బెయిల్ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో ఈసారి పకడ్బందీగా వాదనలు వినిపించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈమేరకు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఢిల్లీ వెళ్లి న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపారు. కేసులో కవితకు వ్యతిరేకంగా ఈడీ ఎలాంటి ఆధారాలు చూపలేదని కవిత తరపు లాయర్ ముకుల్ రోహత్గీ వాదించి సక్సెస్ అయ్యారు. కవితకు సుప్రీం కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ లభించినందుకు కాంగ్రెస్ పార్టీకి, న్యాయవాదులకు అభినందనలు. మీ అలుపెరగని ప్రయత్నాలు చివరకు ఫలించాయి. ఈ బెయిల్ బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండింటికీ విజయం. కవిత బయటకు వస్తున్నారు. కాంగ్రెస్ వ్యక్తి రాజ్యసభకు వెళ్తున్నారు. తొలుత బెయిల్ కోసం వాదించిన అభ్యర్థిని అధికార కాంగ్రెస్ ఏకగ్రీవంగా రాజ్యసభకు నామినేట్ చేసింది. ఆయనకు మద్దతు ఇవ్వటంలో కేసీఆర్ అద్భుతమైన రాజకీయ చతుర ప్రదర్శించారని బండి సంజయ్ ట్వీట్ చేశారు.

### ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో స్థానికత జీవోపై

# హైకోర్టులో విచారణ



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో** : ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సు ప్రవేశాల్లో స్థానికత జీవోకు సంబంధించి హైకోర్టులో వాదనలు కొనసాగాయి. వైద్య ఆరోగ్యశాఖ జారీ చేసిన జీవోను సవాల్ చేస్తూ పలువురు విద్యార్థులు హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాదె, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. నీట్ ప్రవేశ పరీక్ష రాసే సమయానికి విద్యార్థి వరుసగా నాలుగేళ్లు చదివితేనే స్థానికుడిగా పరిగణించాలంటూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమంటూ పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదరించారు.

అహ్మదాబాద్ మహానగర పరిధిలోనూ ఇలాంటి జీవోనే విడుదల చేయడంతో అక్కడి హైకోర్టు కొట్టివేసిందని పిటిషనర్ తరపు న్యాయవాది మయూర్‌రెడ్డి ధర్మాసనానికి తెలిపారు. నీట్‌లో ర్యాంకు సాధించాలనే ఉద్దేశంతో మంచి కళాశాలలో చదువుకోవడానికి విద్యార్థులకు ఇతర రాష్ట్రాలకు వెళ్లొచ్చని, తల్లిదండ్రులు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళితే పిల్లలు కూడా వాళ్లతోపాటు వెళ్లాల్సి వస్తోందని కోర్టుకు తెలిపారు. ఓ విద్యార్థి ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు ఇక్కడే చదివాడని, తండ్రికి మహారాష్ట్ర బదిలీ కావడంతో అక్కడ పదో తరగతి మాత్రమే చదివాడని, తిరిగి ఇంటర్మీడియట్ ఇక్కడే చదివినా ప్రభుత్వ నిబంధనల దృష్ట్యా ఎంబీబీఎస్ సీటుకు నాన్ లోకల్ కింద పరిగణిస్తున్నారని కోర్టుకు తెలిపారు. తెలంగాణలో పుట్టి పెరిగి ఇక్కడే పదో తరగతి వరకు చదివి, ఇంటర్మీడియట్ ఇతర రాష్ట్రాల్లో చదివినంత మాత్రాన నాన్ లోకల్ కింద పరిగణనించడం నిబంధనలకు విరుద్ధమని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. తదుపరి విచారణను హైకోర్టు బుధవారానికి వాయిదా వేసింది.

# ప్రైవేటు ఉపాధ్యాయులను భాగస్వాములు చేయాలి

**విశ్వంభర, హైదరాబాద్:** సెప్టెంబర్ ఐదున జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వం గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరించే కార్యక్రమంలో ప్రైవేటు ఉపాధ్యాయులను కూడా భాగస్వాములు చేయాలని ప్రవేట్ టీచర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ షబ్బీర్ అలీ, వారి బృందం మంగళవారం ప్రజాభవన్లో ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ప్రైవేటు ఉపాధ్యాయుల న్యాయమైన కోరికను అర్థం చేసుకున్న చిన్నారెడ్డి వెంటనే విద్యాశాఖ సెక్రటరీ బుర్ర వెంకటేశంకు లెటర్ పై ఇండాస్ చేసి పంపించడం జరిగింది. అదేవిధంగా విద్యాశాఖ కమిషనర్ నరసింహారెడ్డితో మాట్లాడి ప్రైవేట్ టీచర్లకు న్యాయం జరిగేటట్లు చూడాలని ఫోన్ ద్వారా మాట్లాడారు.



### బీజేపీ, బీఆర్ఎస్

# ఒప్పందాల్లో భాగంగానే కవితకు బెయిల్

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు

**విశ్వంభర , హైదరాబాద్** : ఎమ్మెల్సీ కవిత బెయిల్ పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బెయిల్ పై విచారణ జరుగుతున్నప్పుడు జడ్జి చెప్పే వరకు తెలియదు.. కానీ కవిత బెయిల్ పై మూడు నాలుగు రోజుల నుండి కవితకు బెయిల్ వస్తుందని బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రచారం చేసిందని తెలిపారు. గాంధీ భవన్ లో ఆయన మీడియా తో మాట్లాడుతూ కేటీఆర్ రెండు రోజుల ముందే ఢిల్లీలో హడావుడి చేశారని.. జడ్జి చెప్పాల్సిన జడ్జిమెంట్ బీఆర్ఎస్ చెప్పేసిందని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం.. బీఆర్ఎస్ కి ఒప్పందాల్లో భాగంగానే బెయిల్ వచ్చిందని జగ్గారెడ్డి ఆరోపించారు. జడ్జి చెప్పకముందే.. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌లకు ముందు సమాచారం వచ్చిందన్నారు. దేశంలో విచిత్ర పరిపాలన జరుగుతుందని విమర్శించారు. బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని అన్నారు. అందుకే బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోయే దాంట్లో భాగమే లిక్కర్ కేసు అని పేర్కొన్నారు. బీజేపీ వ్యూహం ఏంటంటే... తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి, బీఆర్ఎస్ ను కలుపుకునే పనిలో ఉందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ డమ్మీ పాత్ర పోషించిందని విమర్శించారు. కవిత బెయిల్ కండిషన్ లో భాగమే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేయించారన్నారు. మెదక్ లో బీఆర్ఎస్ గెలుస్తది అనే పరిస్థితిలో మూడో స్థానంకి ఎందుకు పోయింది.. కవిత కోసం సొంత పార్లమెంట్ నియోజక వర్గం కేసీఆర్ వదిలేసుకున్నారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ కు నాలుగు సీట్లు తగ్గడానికి బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోవడమే కారణమని జగ్గారెడ్డి తెలిపారు. రాజకీయంగా కాంగ్రెస్ ను బలహీన పరిచే ఒప్పందంలో భాగమే బీజేపీ, బీఆర్ఎస్ ఎత్తుగడ అని అన్నారు. బీజేపీలో




బీఆర్ఎస్ విలీనం అవుతుందనే ప్రచారం చేసి... వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిసి పోటీ చేయబోతున్నాయని తెలిపారు. కవితకు బెయిల్ రావడం బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందంలో భాగమేనని పేర్కొన్నారు. సిసోడియా, కేజ్రీవాల్ కి బెయిల్ ఇవ్వడానికి ఆలోచించిన కోర్టులు.. కవితకు ఐదు నెలల్లో బెయిల్ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. బీజేపీ గెలిచిన పార్లమెంటు నియోజక వర్గాల్లో.. రేపు ఎన్నికలు అనగా బీఆర్ఎస్ ఏజెంట్లు, ఎమ్మెల్యేలు కూడా లేరన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు కూడా.. కాంగ్రెస్ కి వేయకండి, బీజేపీకి వేయండి అని ప్రచారం చేశారన్నారు. బీజేపీ ఉత్తరాదిన వీక్ అయ్యింది.. దక్షిణాదిలో బీఆర్ఎస్ ను బలహీన పరిచారని తెలిపారు. ఏపీలో చంద్రబాబు.. పవన్ కళ్యాణ్ తో పొత్తు పెట్టుకొని సీట్లు గెలిచిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఓ పావుగా బీజేపీకి పని చేస్తుందని జగ్గారెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ కి మంచి రోజులు బీజేపీ వల్ల వచ్చిందని.. తాము జడ్జిని తప్పు పట్టడం లేదు.. జడ్జి చెప్పక ముందే బీఆర్ఎస్ చెప్పడమేంటనేది తమ వాదన అన్నారు. మూడు రోజుల ముందే బెయిల్ వస్తుందని హడావుడి చేసిన కేసీఆర్ కుటుంబం పై న్యాయవ్యవస్థ చర్యలు తీసుకోవాలని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# వేములవాడ ఆలయంలో ఏసీబీ రైడ్స్

### పలు అధికారులపై బదిలీ వేటు



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో** : భక్తులకు కొంగు బంగారమైన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి దేవాలయంలో రికార్డులను పరిశీలించిన అవినీతి నిరోధక శాఖ అధికారులు స్టాక్ రిజిస్టర్లలో తప్పిదాలను గుర్తించారు. నెయ్యి, జీడిపప్పు, నూనెకు సంబంధించిన వివరాల్లో తేడాలు ఉన్నాయని తేల్చారు. ఆలయంలో మొక్కులు చెల్లించేందుకు వచ్చే భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయాన్ని కూడా గుర్తించారు. తలనీలాలు సమర్పించే ఒక్కో భక్తుని నుంచి రూ.50, 100 చొప్పున వసూలు చేస్తున్నారని ఇది నిబంధనలకు విరుద్ధమని నిర్ధరించారు. కొత్త టెండర్ల విధానానికి దేవదాయశాఖ ఆమోదం లేకుండానే పాత టెండర్ల ద్వారానే వస్తుసామాగ్రి కొనుగోలు చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. విచారణ పూర్తయిన తర్వాత పూర్తి సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అన్న సత్రం, కోడెల నిర్వహణ, భక్తుల సౌకర్యాలకు కేటాయించిన గదులు, వీఐపీల దర్శనాల వివరాలను పరిశీలిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కల్యాణం జరిపించే భక్తులకు ఇచ్చే ప్రసాద వితరణ, దాతల వివరాలు, సెక్యూరిటీ కోసం వెచ్చిస్తున్న ఖర్చుల వివరాలనూ సేకరిస్తే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు. అనుబంధ ఆలయాల నిర్వహణ పేరిట వెచ్చిస్తున్న నిధులపైనా ఏసీబీ అధికారులు వివరాలు సేకరించారు.

రాష్ట్రంలో దూకుడు పెంచిన ఏసీబీ పట్టుబడుతున్న అవినీతి అధికారులు తనిఖీల్లో అవకతవకలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన సిబ్బందిపై చర్యలు చేపట్టారు. ఈవో వినోద్‌రెడ్డి ని అంతర్గత బదిలీ చేశారు. కళ్యాణకట్టలో భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలతో ఇద్దరు రికార్డ్ అసిస్టెంట్లు ఒక పరిచారికను బాధ్యతల నుంచి తొలగించారు. ముగ్గురు ఆలయ సూపరిండెంట్లు, 9 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు రికార్డ్ అసిస్టెంట్లు, పరిచారికను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు పేర్కొన్నారు. "ఇన్‌స్పెక్టర్స్, సిబ్బందితో పాటు వేములవాడకు వచ్చి తనిఖీలు చేశామని ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు . ఈ ఆలయంపై ఇప్పటికే చాలా ఆరోపణలు వచ్చాయని , అందుకే మేము తనిఖీ చేయడానికి వచ్చామన్నారు. తనిఖీల తర్వాత నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని , ప్రతి డిపార్ట్‌మెంట్‌లో తనిఖీలు చేస్తున్నామని అయన తెలిపారు.

### బ్రాహ్మణకుంట కుంట చెరువు శిఖం భూమిని

# కబ్జా నుంచి కాపాడాలి



**విశ్వంభర, కరీంనగర్:** కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి పట్టణానికి కూతవేటు దూరంలో బ్రాహ్మణకుంట కుంట శిఖం భూమి యథేచ్ఛగా కబ్జాకు గురవుతుందని, పట్టా నెంబరు చూపుతూ కుంట (చెరువు) శిఖంలో ప్లాట్ల అమ్మకాలు చేస్తున్నారని, కుంట శిఖం భూమి పక్కనే పట్టా భూమి 301ని చూపుతూ దాని పక్కనే బ్రాహ్మణకుంట శిఖం భూమి సర్వేనెంబరు 300 లో ప్లాట్ల విక్రయాలను జరుపుతున్నారని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా ప్రధానకార్యదర్శి బండారి శేఖర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్‌కి, డిప్యూటీ ఇంజనీర్ గ్రూప్లో నాయక్ కి ఫిర్యాదు చేశారు. పట్టా భూమి యొక్క సర్వే నెంబర్ 301లో డీటీసీపీ లే ఔట్లు అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయాలు చేస్తున్నారు. 11 సెప్టెంబర్ 2023 రోజున కరీంనగర్ కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పిర్యాదు చేయడం జరిగిందని. అప్పటి తహసిల్దార్ నరేందర్, సర్వేయర్ జీవన్ రెడ్డి కబ్జాదారులతో కుమ్మక్కై బ్రాహ్మణకుంట శిఖం భూమి కబ్జాకు గురికాలేదని తప్పుడు నీవేదికలు ఇవ్వడం జరిగినదని పేర్కొన్నారు. జీఓ నెంబర్ 168 ప్రకారం జలవనరుల సమీపంలో రిక్రియేషన్ కార్యక్రమాలు, గ్రీన్ బఫర్ జోన్ పరిధిలో ఎలాంటి భావనల నిర్మాణం చేపట్టకూడదని జీవోలో పేర్కొంది. మున్సిపాలిటీలు, హెచ్ఎండీఏ యూడీఏ పరిధిలో నదులు చెరువులు, కుంటలకు ఎఫ్.టీ.ఎల్ ను ఎలా లెక్కించాలని దానిపై స్పష్టమైన విధివిధానాలు నిర్దేశించింది. వాస్తవానికి ఎఫ్ఎల్ మీద తహసిల్దార్, సర్వేయర్, నీటిపారుదల శాఖ ఏఈ, మున్సిపల్, అటవీశాఖ సిబ్బంది నేతృత్వంలో క్షేత్రస్థాయి పర్యటన, పరిశీలిన తర్వాత నివేదిక మాత్రమే ఇవ్వాలి. కానీ ఈ నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా నీటిపారుదల శాఖ ఎఫ్ఎల్ రిపోర్టు ఇచ్చేముందు ప్రభుత్వ నిబంధనలు ఏవి పాటించలేదు. కబ్జాదారులకు అనుకూలంగా ఎఫ్.టీ.ఎల్ రిపోర్ట్ లు ఇవ్వడం జరిగింది. రెవెన్యూ ఇరిగేషన్ ఇచ్చిన తప్పుడు రిపోర్టులతో చొప్పదండి మున్సిపల్ కమిషనర్ నిర్మాణ అనుమతులు ఇవ్వడం జరుగుతుంది. దీనివల్ల బ్రాహ్మణికుంట చెరువు పూర్తిగా కబ్జా గురవుతున్నది. ఎన్వోసీ సర్టిఫికెట్లు కూడా ఇస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. హద్దులు నిర్ణయించకుండా ఎన్వోసీ సర్టిఫికెట్లు ఇవ్వకూడదని కోరుతున్నాను. కుంట శిఖం భూమి అన్యాక్రాంతమైన దానిలో ప్లాట్లు కొనుగోలు చేసిన విక్రయదారులు కొందరు మున్సిపాలిటీ నుండి నిర్మాణం అనుమతులు తీసుకొని బ్యాంకుల నుండి రుణాలను సైతం నం పొందినట్లు సమాచారం ఉన్నది. మున్సిపల్ కార్యాలయం చుట్టూ గృహ నిర్మాణ అనుమతులు కావాలని విక్రయదారులు నిత్యం కార్యాలయానికి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు వారికి అనుమతులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుందని అనుమానం వ్యక్తం చేశారు. చొప్పదండి పట్టణంలోని బ్రాహ్మణకుంట కుంట శిఖం భూమి హద్దులు నిర్ణయించిన తర్వాతనేనిర్మాణ అనుమతులు ఇచ్చేవిధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పట్టభూమి సర్వే నెంబర్ 301 కుంట శిఖం సర్వే నెంబర్ 300 లో రిజిస్ట్రేషన్ అయిన వాటికి నిర్మాణ అనుమతులు ఇవ్వద్దని కోరుతున్నాము. తమరు జోక్యం చేసుకొని బ్రాహ్మణకుంట కుంట (చెరువు) శిఖం భూమి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీ సర్వే నిర్వహించి పూర్తస్థాయి హద్దులు నిర్ణయించాలని, ఎన్వోసీ సర్టిఫికెట్లు ఇవ్వకూడదని, చెరువు శిఖం భూమిలో అక్రమంగా కూల్చివేయాలని, చెరువు శిఖం భూమి కబ్జానుండి కాపాడాలని కరీంనగర్ నీటి పారుదల శాఖాధికారిని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధానకార్యదర్శి బండారి శేఖర్ కోరారు. బ్రాహ్మణకుంట కుంట చెరువు శిఖం భూమిని కబ్జాకు కారణమైన ఈఈ సుధాకిరణ్, డీఈ రూపాలల్ నాయక్‌కు బ్రమ్మని కుంట మీద బండారి శేఖర్ పిర్యాదు చేశారు.

# మానస పాఠశాలను సందర్శించిన కెన్యా క్రీడాకారులు




**విశ్వంభర, కొత్తపేట:** కెన్యా క్రీడాకారుల బృందం సోమవారం కొత్తపేట మోహన్ నగర్ లోని మానస చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థ, ప్రత్యేక పాఠశాలను సందర్శించింది. మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు అందిస్తున్న చికిత్సలు, అక్కడున్న సదుపాయాలను ప్రతినిధులు పరిశీలించారు. హైదరాబాద్ రన్నర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం లో కెన్యాకు చెందిన మారథాన్ రన్నర్స్ ఎజికిల్ కిప్కోరిర్, షీలా చెలంగాట్, జెనిత్ కిప్తు, హమింగ్టన్ చెరోప్ పాల్గొన్నారు. వీరు 25 ఆగష్టున జరిగిన ఎన్.ఎం.డి.సి. హైదరాబాద్ మారథాన్ 2024 పోటీలలో వివిధ పతకాలు గెలుపొందారు. ఈ బృదంలో ఢిల్లీకి చెందిన మారథాన్ రన్నర్ విపుల్, ఉత్తరాఖండ్ కు చెందిన భగీరథి, హిమాచల్ ప్రదేశ్ కు చెందిన సునీల్ శర్మ, ప్రస్తుతం భారత సైన్యంలో పనిచేస్తున్న విజయనగరానికి చెందిన భుగత శ్రీను కూడా ఉన్నారు. ఎన్.ఎం.డి.సి. హైదరాబాద్ మారథాన్ 2024 నందు స్వచ్ఛంద సంస్థ భాగస్వామిగా ఉన్న మానసకు దాతల ద్వారా అయిదు లక్షల రూపాయలు సమకూరినందున దాతలకు, ఇందుకు సహకరించిన హైదరాబాద్ రన్నర్స్ అసోసియేషన్ కు మానస కోశాధికారి తేరా మదన్ మోహన్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాజేష్ వెట్చ, స్మిత చామిలింగ్, కె. సుందర్ నాగేష్, విజిగీష, గౌతమ్ ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ లింగాల లక్ష్మి. న్యూరో డెవలప్మెంటల్ క్లినిక్ విభాగాధిపతి పి. మెర్సీ మధురిమ, ప్రత్యేక పాఠశాల సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



### రాజకీయ చదరంగంలో

# హైడ్రా పావుగా మారదలుచుకోలేదు

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం

**విశ్వంభర, హైదరాబాద్:** రాజకీయ చదరంగంలో హైడ్రా పావుగా మారదలుచుకోలేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. "ఒవైసీ, మల్లారెడ్డి అనేది చూడం. విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచిస్తాం. చెరువులను ఆక్రమించి కళాశాల భవనాలు కట్టడం వాళ్ల పొరపాటు అయి ఉండొచ్చు. ఎఫ్టీఎల్ అనేది ముఖ్యమైన అంశమే, దానికంటే విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యం. ఒవైసీ, మల్లారెడ్డి లాంటి వ్యక్తుల కళాశాలలకు సమయం ఇస్తాం. పార్టీలకు అతీతంగా మా చర్యలు ఉంటాయి. ధర్మసత్రమైనా ఎఫ్టీఎల్ పరిధిలో ఉంటే కూల్చేస్తాం. హైడ్రా నోటీసులు ఇవ్వదు.. కూల్చడమే" అని రంగనాథ్ స్పష్టం చేశారు. నగరంలోని పలు చెరువులు, పార్కుల ఆక్రమణలపై మంగళవారం పలువురు భాజపా కార్పొరేటర్లు హైడ్రా కమిషనర్ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

హైడ్రా కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు

హైదరాబాద్ మహానగరంలో చెరువులు, కుంటల ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బుద్ధభవన్లోని హైడ్రా కార్యాలయానికి మధ్యాహ్నం తర్వాత పెద్ద సంఖ్యలో ఫిర్యాదు దారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు క్యూ కడుతున్నారు. దీంతో హైడ్రా కార్యాలయానికి రోజు రోజుకీ తాకిడి పెరుగుతోంది. మొదట్లో పదుల సంఖ్యలో వచ్చిన ఫిర్యాదులు.. హైడ్రా కఠిన చర్యలతో వందల్లోకి చేరాయి. వాటన్నింటినీ స్వీకరిస్తున్న కార్యాలయ సిబ్బంది అందులోని వివరాలను నమోదు చేసుకుంటూ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తున్నారు.మరోవైపు ఫిర్యాదుదారుల తాకిడి పెరగడంతో హైడ్రా కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు పెంచారు.

# తెలంగాణ నుంచి ఇద్దరికి

### జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు..

**ఢిల్లీ:** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2024ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు అవార్డు వరించింది. ఖమ్మం జిల్లా తిరుమాలయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రభాకర్రెడ్డి పెసర, సిరిసిల్ల దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తాండూరి సంపత్ కుమార్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

# 83.4 కిలోల గంజాయి పట్టివేత

**విశ్వంభర, కంకోల్:** సంగారెడ్డి జిల్లా కంకోల్ చెకోపోస్టు వద్ద 83.4 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఏవోబీ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లుగా గుర్తించారు. చిత్తూరు జిల్లాకు చెందిన నిందితుడిని అరెస్టు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. ఈ గంజాయి విలువ రూ.33.50 లక్షలు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున చెకోపోస్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులకు ఓ కారులో గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. క్షుణ్ణంగా పరిశీలించగా.. సీట్ల కిందిభాగంలో ఏర్పాటు చేసిన ఓ ప్రత్యేక పెట్టెలో గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి నిందితుడిని పోలీస్ స్టేషన్కు తరలించారు.

# జగన్ విదేశీ పర్యటనకు సీబీఐ కోర్టు అనుమతి

**విశ్వంభర, హైదరాబాద్:** అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉన్న మాజీ సీఎం జగన్ విదేశీ పర్యటనకువెళ్లేందుకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. సెప్టెంబర్ 3 నుంచి 25 వరకు కుమార్తె పుట్టినరోజు కోసం యూకే వెళ్లేందుకు ఆయనకు కోర్టు అనుమతి కోరారు. యూకే వెళ్లే ముందు పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మొబైల్ నంబరు, మెయిల్ వివరాలు కోర్టుకు, సీబీఐకి ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. జగన్కు ఐదేళ్ల కాలపరిమితితో కొత్త పాస్పోర్టు జారీకి కూడా సీబీఐ కోర్టు నుంచి అనుమతి లభించింది.





# రాజకీయాల్లోకి రాబోను

## స్టార్ షూటర్ మను బాకర్

**విశ్వంభర, క్రిడావిభాగం :** పారిస్ విశ్వ క్రీడల్లో రెండు కాంస్య పతకాలు సాధించి చరిత్ర సృష్టించిన భారత స్టార్ షూటర్ మను బాకర్ కీలక వ్యాఖ్యలు చేసింది. తాను రాజకీయాల్లోకి రాబోనని వచ్చే ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడంపైనే దృష్టి పెడతానని మను స్పష్టం చేసింది. "నా దృష్టంతా క్రీడలపైనే ఉంది. నా లక్ష్యం ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడమే. యువత చదువుతో పాటు క్రీడలపై శ్రద్ధ పెట్టి దేశానికి పతకాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలి" అని మను బాకర్ తెలిపింది. ఒలింపిక్స్ 100 గ్రాముల అధిక బరువుతో పతకాన్ని కోల్పోయిన వినేశ్ ఫొగాట్ ఉదంతంపైనా మను బాకర్ స్పందించింది. "వినేశ్ ఫొగాట్ ఓ పోరాట యోధురాలు. వినేశ్ వచ్చే ఒలింపిక్స్‌లో పతకం సాధించేందుకు మళ్లీ రంగంలోకి దిగాలి. ఆమె రిటైర్‌మెంట్ ఆలోచన విరమించుకుని మళ్లీ రెజ్లింగ్ బౌట్‌లో దిగాలని నేను కోరుకుంటున్నా" అని పేర్కొంది.
తాను రాజకీయాల్లోకి వచ్చే అవకాశమే లేదని మను బాకర్ వెల్లడించింది. "ఒలింపిక్స్‌లో కాంస్య పతకం కల నెరవేరడం ఆనందంగానే ఉంది. ఇప్పుడు మరింత కష్టపడి స్వర్ణం సాధించి ఆ బంగారు కలను కూడా నెరవేర్చుకుంటా" అని ఈ స్టార్ షూటర్ తెలిపింది. తనకు బాలీవుడ్‌కు వెళ్లే ఆలోచన కూడా లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం తన దృష్టి అంతా క్రీడలపైనే ఉందని, నటన గురించి ఆలోచించడం లేదని చెప్పింది.




# మహిళల టీ20 ప్రపంచకప్ భారత జట్టు

**విశ్వంభర, క్రిడావిభాగం:** టీమ్ ఇండియా పురుషుల జట్టుకు ధీటుగా మహిళలు కూడా అదరగొడుతున్నారు. ఇటీవల ముగిసిన ఆసియా కప్‌లో మహిళలు ఫైనల్ వరకు వెళ్లి అద్భుతంగా ఆడి, అందరితో శభాష్ అనిపించుకున్నారు. అయితే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) లో జరగనున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్-2024 మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా బీసీసీఐ ఈ టోర్నీకి సంబంధించిన పూర్తి షెడ్యూల్, జట్టు సభ్యులను ప్రకటించింది. యూఏఈ వేదికగా అక్టోబరు 3 నుంచి 20 వరకూ జరగనుంది. దీని కోసం భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ (బీసీసీఐ) 15 మందితో కూడిన మహిళల జట్టును కరారు చేసింది. ఈసారి టీ 20 ప్రపంచ కప్ ఫైనల్‌లో కూడా గెలిచి కప్‌తో రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. వికెట్‌కీపర్ యాస్తికా భాటియా, ఆల్‌రౌండర్ శ్రేయంకా పాటిల్ మాత్రం ఫిట్‌నెస్ సాధిస్తేనే యూఏఈకి వెళ్తారు. ఇక తనుజా కన్వర్, ఉమా ఛెత్రి, సైమా ఠాకూర్‌ను ట్రావెలింగ్ రిజర్వ్‌గా ఎంపిక చేశారు. అయితే ఈ ప్రపంచ కప్ బంగ్లాదేశ్‌లో జరగాల్సింది. కానీ, అక్కడ జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో ఈ టోర్నీని యూఏఈకి షిఫ్ట్ చేసింది ఐసీసీ. ఇక మొత్తం 10 జట్లను రెండు గ్రూప్‌లుగా డివైడ్ చేశారు. గ్రూప్‌లోని ప్రతి జట్టు ఇతర జట్లతో చెరో మ్యాచ్ ఆడనుంది. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2లో నిలిచిన జట్లు మాత్రమే సెమీస్ బరిలో దిగుతాయి. ఇక గ్రూప్ Aలో భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంక ఉండగా, గ్రూప్ Bలో సౌతాఫ్రికా, ఇంగ్లాండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్ టీమ్స్ ఉన్నాయి.

**భారత్ షెడ్యూల్..**
అక్టోబర్ 4న భారత్ x న్యూజిలాండ్ మ్యాచ్ జరగనుండగా, ఆ తర్వాత 9న శ్రీలంక, 13న ఆస్ట్రేలియాతో టీమ్‌ఇండియా మహిళల జట్టు తలపడనుంది. ఇక చిరకాల ప్రత్యర్థులైన భారత్, పాక్ అక్టోబర్ 6న దుబాయ్‌లో ఆడనున్నారు. మరోవైపు అక్టోబర్ 17, 18న జరగనున్న సెమీఫైనల్స్‌తో పాటు 20న జరిగే ఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే ఉంది. ఇక భారత్ ఒకవేళ సెమీస్‌కు చేరితే అప్పుడు తొలి సెమీ ఫైనల్‌లో మన జట్టు తలపడనుంది.

**భారత జట్టు:** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, దీప్తి శర్మ, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తికా భాటియా (వికెట్ కీపర్), పూజా వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్, దయాళన్ హేమలత, ఆశా శోభన , రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్, సజన సజీవన్.

**ట్రావెలింగ్ రిజర్వ్‌లు:** ఉమా చెత్రీ (వికెట్ కీపర్), తనూజా కన్వర్, సైమా ఠాకోర్.

**నాన్ ట్రావెలింగ్ రిజర్వ్‌లు:** రాఘ్వీ బిస్త్, ప్రియా మిశ్రా

# రోహిత్ శర్మను దక్కించుకునేది ఎవరు?




**విశ్వంభర, క్రిడావిభాగం:** ఐపీఎల్ 2025 మెగా వేలంలో చాలా మంది టాప్ క్రికెటర్లు అందుబాటులో ఉండొచ్చని, వారిని కొత్త ఫ్రాంచైజీలు దక్కించుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయంటూ కొన్ని రోజులుగా కథనాలు వెలువడుతున్నాయి. ముంబై ఇండియన్స్ కెప్టెన్, స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ పేరు కూడా ఈ జాబితాలో గట్టిగానే వినిపిస్తోంది. ఫ్రాంచైజీలు ఆరుగురి కంటే ఎక్కువ మంది ఆటగాళ్లను రిటెయిన్ చేసుకోవడానికి వీల్లేదంటూ బీసీసీఐ నిబంధన విధించడం, 2024 ఐపీఎల్ సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ నుంచి తొలగించిన నేపథ్యంలో రోహిత్ శర్మ పేరు వేలం జాబితాలో ఉండడం ఖాయమని క్రికెట్ వర్గాల్లో విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రోహిత్ శర్మకు బ్రాండ్ వ్యాల్యూ ఉండడంతో వేలంలో అందుబాటులో ఉంటే ఫ్రాంచైజీలు అతడి కోసం ఎగబడే అవకాశాలు ఉన్నాయి. హిట్‌మ్యాన్‌ను దక్కించుకోవాలని భావిస్తున్న ఫ్రాంచైజీలలో పంజాబ్ కింగ్స్ కూడా ఉంది. ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ గెలవని ఈ జట్టు వీలైతే రోహిత్‌ను దక్కించుకోవాలని యోచిస్తోంది. కొన్నాళ్లుగా వెలువడుతున్న ఈ ఊహాగానాలపై పంజాబ్ కింగ్స్ క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ సంజయ్ బంగర్ స్పందించారు. రోహిత్‌ను దక్కించుకోవడంపై ఆసక్తిని ప్రదర్శించిన ఆయన.. ఫ్రాంచైజీ వద్ద ఎంత డబ్బు మిగిలి ఉందనేదానిపై హిట్‌మ్యాన్‌ను కొనుగోలు చేయడం ఆధారపడి ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. రోహిత్ వేలంలో అందుబాటులో ఉంటే అతడు అధిక ధరకు అమ్ముడు పోతాడని తాను కచ్చితంగా నమ్ముతున్నానని అన్నారు. రావు పోడ్‌కాస్ట్ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా ఐపీఎల్ గత సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జట్టుకు శిఖర్ ధావన్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయితే ఇటీవలే అతడు అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. దీంతో కొత్త కెప్టెన్‌ను అన్వేషించడం పంజాబ్ కింగ్స్ యాజమాన్యానికి అనివార్యమైంది. దీంతో రోహిత్ శర్మపై పంజాబ్ కింగ్స్ కన్నేసినట్టు కథనాలు వెలువడుతున్నాయి. కాగా ఐపీఎల్ 2024 సీజన్‌కు ముందు కెప్టెన్సీ నుంచి రోహిత్ శర్మను ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ తొలగించింది. హిట్‌మ్యాన్ స్థానంలో హార్దిక్ పాండ్యాను నియమించిన నాటి నుంచి రోహిత్ చుట్టూ అనేక కథనాలు వెలువడుతున్నాయి. ఏకంగా నాలుగు టైటిల్స్ అందించిన కెప్టెన్‌ను పక్కన పెట్టారంటూ రోహిత్ ఫ్యాన్స్ మండిపడ్డారు. హార్ధిక్ పాండ్యాతో పాటు ముంబై ఇండియన్స్ యాజమాన్యంపై విమర్శల దాడి చేసిన విషయం తెలిసిందే.





# జైషాకు జగన్‌మోహన్‌రావు శుభాకాంక్షలు

**విశ్వంభర, హైదరాబాద్:** ఐసీసీ నూతన చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బీసీసీఐ ప్రధాన కార్యదర్శి జైషాకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) తరఫున ఆ సంఘం అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు శుభాకాంక్షలు తెలిపారు. మంచి పరిపాలన దక్షుడైన జైషా నాయకత్వంలో ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధి సరికొత్త పుంతలు తొక్కనుందని అభిప్రాయపడ్డారు. కొత్త బాధ్యతలను జైషా సమర్థవంతంగా నిర్వహించి, బీసీసీఐకి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని జగన్‌మోహన్ రావు ఆకాంక్షించారు.


# హైదరాబాద్‌ను మిస్ అవుతున్నా.. డేవిడ్ వార్నర్

**విశ్వంభర, క్రిడావిభాగం :** ఆస్ట్రేలియా మాజీ బ్యాటర్ డేవిడ్ వార్నర్‌కు తెలుగు క్రికెట్ ఫ్యాన్స్‌కు మంచి అనుబంధం ఉంది. వార్నర్ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ జట్టుకు ప్రాతనిధ్యం వహించడంతోపాటు తెలుగు హీరోల సినిమాల్లోని ఎన్నో సాంగ్స్‌ను రీల్స్‌గా చేసి ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సినిమాల్లోని పాటలకు స్టెప్పులు వేసి, డైలాగ్స్ చెప్పి తెలుగు ఆడియెన్స్‌కు మరింత దగ్గరయ్యాడు. దీంతో వార్నర్‌కు తెలుగు క్రికెట్ ఫ్యాన్స్‌తో చక్కటి అనుబంధం ఏర్పడింది.
అటు వార్నర్ కూడా తరచూ తెలుగు ఫ్యాన్స్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకుంటాడు. తాజాగా సోషల్ మీడియా పోస్ట్‌తో వార్నర్ మరోసారి తెలుగు అభిమానుల దృష్టిని ఆకర్షించాడు. రంగురంగుల కాంతుల మధ్యలో వెలిగిపోతున్న ఛార్మినార్ ఫొటో ఒకటి షేర్ చేస్తూ, 'నాకు నచ్చిన ప్రదేశాలలో ఒకదాన్ని చాలా మిస్ అవుతున్నాను' అని రాసుకొచ్చాడు. దీంతో వార్నర్‌కు హైదరాబాద్‌తో విడదీయరాని బంధం ఉందంటూ నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. 2025 ఐపీఎల్ మెగా వేలంలో ఎలాగైనా సన్ రైజర్స్ వార్నర్‌ను కొనుగోలు చేస్తే బాగుంటుందని తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.
కాగా, 2014- 2021 మధ్యలో వార్నర్ సన్‌రైజర్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ఇందులో 2016 ఎడిషన్‌లో తన సారథ్యంలోనే సన్‌రైజర్స్ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ




ఎనిమిది ఎడిషన్‌లలో కలిపి వార్నర్ సన్‌రైజర్స్ తరఫున 95మ్యాచ్‌లు ఆడాడు. అందులో 142.59 స్ట్రైక్ రేట్‌తో 4014 పరుగులు చేశాడు. ఇక 2022 ఐపీఎల్‌కు ముందు సన్‌రైజర్స్ వార్నర్‌ను వదులుకుంది. అప్పట్నుంచి ఈ డాషింగ్ ఓపెనర్ దిల్లీ క్యాపిటల్స్‌కు ఆడుతున్నాడు.

# బీసీసీఐ కొత్త కార్యదర్శిగా రోహన్ జైట్లీ..!



**విశ్వంభర, క్రిడావిభాగం:** భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కొత్త కార్యదర్శిగా రోహన్ జైట్లీ నియమితులయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం బీసీసీఐ సెక్రటరీగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా తనయుడు జై షా కొనసాగుతున్నారు. ఈయన పదవీ కాలం వచ్చే నవంబరుతో ముగియనుంది. ఆ తర్వాత ఆయన ఐసీసీ చైర్మన్ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. దీంతో బీసీసీఐ తదుపరి కార్యదర్శిగా రోహాల్ జైట్లీ నియమితులుకానున్నారు. బీసీసీఐ కార్యదర్శి జై షా ఐసీసీ చైర్మన్ ఎన్నికల బరిలో దిగుతున్నట్లు గత కొంతకాలంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఐసీసీ చైర్మన్ గ్రెగ్ బార్ క్లే పదవీకాలం నవంబర్‌తో ముగియనుంది. అయితే మరోసారి ఆయన ఎన్నికల బరిలో నిలిచేందుకు నిరాసక్తి వ్యక్తం చేశాడు. దీంతో బీసీసీఐ సెక్రటరీ జై షా నిలుస్తారనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. ఒకవేళ ఆయన నిజంగానే బరిలోకి దిగితే తర్వాత బీసీసీఐ కార్యదర్శిగా ఎవరనే విషయంపై చర్చ జరుగుతోంది. అయితే తాజాగా ఓ బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి తనయుడు పేరు తెరపైకి వచ్చింది. అతనే ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) అధ్యక్షుడు రోహాన్ జైట్లీ. ప్రస్తుతం బీసీసీఐ కార్యదర్శి రేసులో ముందున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే, తాజాగా ఆయన ఈ వార్తలను కొట్టిపారేశారు. తాను బీసీసీఐ సెక్రటరీ రేసులో ఉన్నట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ప్రస్తుతం తాను ఢిల్లీ లీగ్‌ను ప్రమోట్ చేయడంపైనే దృష్టిసారించినట్లు స్పష్టం చేశారు.

# ఐఫోన్ 16 లాంచింగ్ ప్రకటించిన ఆపిల్

**వి శ్వంభర, బిజినెస్ :** ఐఫోన్ ప్రియులకు, టెక్ లవర్స్‌కు గుడ్‌న్యూస్. ఐఫోన్-16 విడుదల తేదీకి ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 9న యాపిల్ 16 ఈవెంట్ నిర్వహించనున్నట్టు కంపెనీ ప్రకటించింది. కాలిఫోర్నియాలో కుపెర్టినోలోని యాపిల్ పార్క్‌లో ఉన్న స్టీవ్ జాబ్స్ థియేటర్‌లో ఈవెంట్ ను నిర్వహించనున్నట్టు 'యాపిల్ 'ఇట్స్ గ్లో టైమ్' అనే ట్యాగ్‌లైన్‌తో మీడియాకు ఆహ్వానాలు పంపింది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఈవెంట్‌లో ఐఫోన్16 ఫోన్లను విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. యాపిల్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్, ఏఐ-ఆధారిత యాపిల్ ఇంటిలిజెన్స్ ఫీచర్లను ప్రకటించే ఛాన్స్ ఉంది. ఐవోఎస్ 18, ఐప్యాడ్ ఓఎస్ 18, మ్యాక్ ఓఎస్ సీక్వియా, వాచ్ ఓఎస్ 11తో పాటు ఇతర ప్రధాన ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్‌లు ప్రకటించిన తర్వాత యాపిల్ 16 ఫోన్లు విడుదల కానున్నాయి. అయితే ఈ ఏడాది హార్డ్‌వేర్ మార్పులు పెద్దగా ఉండకపోవచ్చనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. హార్డ్‌వేర్ అప్‌డేట్స్‌లో ఐఫోన్ చిప్‌సెట్ అప్‌గ్రేడ్ ఉండొచ్చని అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న అన్ని స్మార్ట్‌ఫోన్‌లు ఆపిల్ ఇంటెలిజెన్స్‌కు సపోర్ట్ చేసేలా ఈ మార్పు ఉండవచ్చని కథనాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఐఫోన్ 15 ప్రో, 15 ప్రో మ్యాక్స్ ఫోన్లు మాత్రమే అవసరమైన ప్రాసెసింగ్ కెపాసిటీ కలిగి ఉన్నాయి. ఇక యాపిల్ 16 మోడల్ ఫోన్ల విషయానికి వస్తే.. స్క్రీన్ పరిమాణాలు కొద్దిగా పెరగవచ్చు. ఐఫోన్ 16 బేసిక్ మోడల్‌లో కెమెరా అమరిక వరుసను కూడా మార్చే అవకాశాలున్నాయి. ప్రస్తుతం చతురస్రం లేఅవుట్‌లో ఉండగా కొత్త మోడల్‌లో




నిలువు అమరికతో వచ్చే ఛాన్స్ ఉంది. కెమెరా అప్‌గ్రేడ్‌లు కూడా ఉండొచ్చు. జూమ్ కంట్రోలింగ్ కోసం ప్రత్యేకంగా బటన్ ఇచ్చే అవకాశాలున్నాయి. ఇక ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది ఈవెంట్‌లో కొత్త ఆపిల్ వాచ్ మోడల్‌ను కంపెనీ ఆవిష్కరించింది. మెరుగైన పనితీరు, అధిక శక్తి సామర్థ్యం ఉన్న కొత్త చిప్‌తో ఆపిల్ వాచ్ సిరీస్ 10ను (సిరీస్ X) విడుదల చేస్తుందనే అంచనాలు ఉన్నాయి. పెద్ద స్క్రీన్‌ని అందించనుంది. కాగా ఐవోఎస్ 18.1 అప్‌డేట్‌ను అక్టోబర్‌లో విడుదల చేయనున్నట్టు యాపిల్ కంపెనీ తెలిపింది. కాగా మరో టెక్ దిగ్గజం గూగుల్ ఇటీవలే పిక్సెల్ 9 సిరీస్ స్మార్ట్‌ఫోన్‌లను విడుదల చేసిన విషయం తెలిసిందే. మరికొన్ని రోజుల్లో యాపిల్16 ఫోన్లు కూడా మార్కెట్‌లోకి రాబోతున్నాయి.

# త్వరలో అందుబాటులోకి యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్

**విశ్వంభర, బిజినెస్:**

దేశంలో యూపీఐ సేవలు ప్రజలు ఎంతగా ఆదరిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే ఇదే తరహాలో మరో ప్లాట్‌ఫామ్ అందుబాటులోకి రానుంది. డిజిటల్ బ్యాంకింగ్‌ను ప్రోత్సహించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) గత సంవత్సరం కొత్త పథకం పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ఈ పథకం పేరు ఫ్రిక్షన్‌లెస్ క్రెడిట్ ప్లాట్‌ఫామ్, రుణం తీసుకునే ప్రక్రియను సులభతరం చేయడం దీని లక్ష్యం. ఇప్పుడు ఈ ప్లాట్‌ఫారమ్ పేరు "యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (ULI)" గా మార్చింది. రుణాలు తీసుకోవడాన్ని మరింత సులభతరం చేయడం కోసం యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్‌ను జాతీయ స్థాయిలో త్వరలో అందుబాటులోకి రానున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ అన్నారు. బెంగళూరులో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై జరిగిన గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో గవర్నర్ ఈ విషయాన్ని ప్రకటించారు. యుఎల్ఐ రుణ మంజూరు ప్రక్రియను సులభతరం చేస్తుందని, దీంతో బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) రుణాలు ఇవ్వడం సులభతరం కానున్నట్లు చెప్పారు. ఎందుకంటే రుణం మంజూరు చేసే సంస్థలు ఒకే చోట నుంచి భూమి రికార్డుల వంటి ముఖ్యమైన డిజిటల్ సమాచారాన్ని పొందుతాయి. ఇది లోన్ ప్రాసెసింగ్‌లో ఉండే సమయం, పత్రాల సేకరణ సమయాన్ని తగ్గిస్తుంది. దేశంలోని చిన్న గ్రామాలు, పట్టణాలు, చిన్న-మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) యూఎల్ఐ ఎక్కువ ప్రయోజనం చేకూరుస్తుందని ఆర్‌బీఐ గవర్నర్ తెలిపారు. ULI ప్లగ్, ప్లే మోడల్ ఆధారంగా రూపొందించారు. తద్వారా ఏదైనా సంస్థ దానిని సులభంగా స్వీకరించవచ్చు. పైలట్ ప్రాజెక్ట్‌తో ULI త్వరలో దేశవ్యాప్తంగా అమలు కానుంది. యూపీఐ చెల్లింపుల మార్గాన్ని మార్చినట్లే.. యూఎల్ఐ కూడా లోన్ పంపిణీ ప్రక్రియలో గణనీయమైన మార్పును తీసుకురానుందని ఆర్బీఐ గవర్నర్ అభిప్రాయపడ్డారు. ఇది చిన్న పట్టణాలు, గ్రామాల ప్రజలకు పెద్ద ప్రయోజనం చేకూరనుందన్నారు. ఆర్థిక రంగాన్ని పటిష్టంగా, చైతన్యవంతంగా, కస్టమర్ కేంద్రంగా మార్చే విధానాలు, వ్యవస్థలు, ప్లాట్‌ఫారమ్‌లను రూపొందించడంలో సెంట్రల్ బ్యాంక్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (DPI), అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు ప్రపంచంలోని దాదాపు అన్ని ఆర్థిక వ్యవస్థల భవిష్యత్తు ప్రయాణాన్ని రూపొందిస్తాయని చెప్పారు.





# సీక్వెల్‌కు ఈగ ఉంటే చాలు

## నానితో దర్శకుడు రాజమౌళి సరదా కామెంట్

విజువల్ వండర్ అనే పదానికి టాలీవుడ్‌లో అసలైన అర్థం చెప్పిన చిత్రం 'ఈగ'.. పెద్ద హీరోలతోనే కాదు.. చిన్న ఈగతోనూ సినిమా తీసి బాక్సాఫీసు దగ్గర రికార్డులు సృష్టించొచ్చని నిరూపించారు దర్శకుడు రాజమౌళి. తాజాగా ఈ సినిమా సీక్వెల్ గురించి నాని ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. రాజమౌళికి తనకు మధ్య జరిగిన సరదా సంభాషణను పంచుకున్నారు. 'నేను విజయేంద్ర ప్రసాద్ సర్‌ని ఎప్పుడూ 'ఈగ' సీక్వెల్ గురించి అడగలేదు. కానీ, రాజమౌళితో దీని గురించి సరదాగా చర్చించాను. 'ఈగ 2' చేస్తానన్నారు కదా.. ఇది ఎప్పుడు మొదలుపెడదామని అడిగాను. అప్పుడు దానికి ఆయన.. 'మేము ఈగ 2' చేసినా నీతో అవసరం లేదు. ఈగ ఉంటే చాలు. అదే సీక్వెల్‌లో తిరిగి వస్తుంది' అని చెప్పారు. 'ఈగ' సినిమా చేయాలనే ఆలోచన రావడమే చాలా గొప్ప విషయం. రాజమౌళి ధైర్యానికి మెచ్చుకోవాల్సిందే. ఆయనకు దీని సీక్వెల్ గురించి ఆలోచన వచ్చినప్పుడు కచ్చితంగా ఆ పనులు ప్రారంభిస్తారని నేను అనుకుంటున్నా. అదే జరిగితే మరో అద్భుతమైన చిత్రంతో ప్రపంచాన్ని ఆకర్షిస్తారు' అంటూ దర్శకధీరుడిపై ప్రశంసలు కురిపించారు. నాని, సమంత ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'ఈగ' బాక్సాఫీసు వద్ద ఘన విజయం అందుకుంది. సుదీప్ విలనిజం ఎంతగానో ఆకట్టుకుంది. 2012లో విడుదలైన ఈ సినిమా 2 జాతీయ అవార్డులు, 3 సైమా అవార్డులు, 5 సౌత్ ఫిల్మ్‌ఫేర్ అవార్డులు సాధించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం నాని 'సరిపోదా శనివారం' అంటూ సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# బెంగాల్లోనూ కాస్టింగ్ కౌచ్

## దర్యాప్తు చేపట్టాలన్న బెంగాలీ నటి రితాభరీ చక్రవర్తి

మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళల స్థితిగతులపై జస్టిస్ హేమ కమిటీ నివేదిక సంచలనం సృష్టిస్తోంది. దాంతో పలువురు నటీమణులు తాము ఎదుర్కొన్న వేధింపుల గురించి బహిరంగంగా వెల్లడిస్తున్నారు. ఈ తరుణంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపులపై దర్యాప్తు చేపట్టాలని ముఖ్యమంత్రి మమతా బెనర్జీని నటి రితాభరీ చక్రవర్తి కోరారు. ఈ మేరకు ఫేస్‌బుక్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఇక్కడ కూడా జస్టిస్ హేమా కమిటీ వంటి దానిని ఏర్పాటు చేసే దిశగా కృషి చేయాలని అభ్యర్థించారు. రితాభరీ.. బెంగాలీ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ నటి. లైంగిక వేధింపుల కేసుల్లో కఠిన చర్యలు తీసుకోవాలని తన పోస్టులో పేర్కొన్న ఆమె.. దీదీని ట్యాగ్ చేశారు. తనతో పాటు తనతోటి వారికి కొందరు. నటులు, దర్శకనిర్మాతల చేతిలో భయానక అనుభవాలు ఎదురయ్యాయని తెలిపారు. అయితే ఆమె ఎవరి పేరును ప్రస్తావించలేదు. ఇలా వేధింపులకు పాల్పడిన ఆ వ్యక్తులు.. బెంగాల్ హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా జరుగుతోన్న నిరసనల్లో ఎలాంటి సిగ్గులేకుండా పాల్గొనడం ఆశ్చర్యపరిచిందన్నారు. మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళల స్థితిగతులపై జస్టిస్ హేమ కమిటీ కొన్నేళ్లపాటు శ్రమించి ఒక నివేదిక రూపొందించింది. ఇందులో ఎన్నో షాకింగ్ విషయాలు వెలుగుచూశాయి. ఆ సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వర్కింగ్ కండిషన్లు, రెమ్యూనరేషన్, సాంకేతిక రంగంలో మహిళల భాగస్వామ్యం తదితర అంశాలను అధ్యయనం చేసిన కమిటీ.. కాస్టింగ్ కౌచ్ మొదలు వివక్ష వరకు మాలీవుడ్‌లో మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. హేమ కమిటీ రూపొందించిన నివేదిక అంతటా చర్చకు దారితీసింది.



# నా జర్నీ ఇప్పుడే మొదలయ్యింది

## మిస్టర్ బచ్చన్ బ్యూటీ భాగ్యశ్రీ భోర్సే

కొన్ని రోజులుగా నెట్టింట మార్మోగుతున్న పేరు భాగ్య శ్రీ బోర్సే .ఇటీవలే మాస్ రవితేజ-హరీష్ శంకర్‌కాంబినేషన్‌లో వచ్చిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది. సినిమా విడుదల కాకముందే ఏదో ఒక స్టిల్‌తో నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ఊహించని డిజాస్టర్ టాక్ తెచ్చుకుంది. సినిమా హిట్టా.. ఫట్టా అనేది పక్కన పెడితే.. తెలుగులో ఇది మొదటి సినిమా కాబట్టి నటిగా తన ఫీలింగ్‌ను అందరితో షేర్ చేసింది. మీ అమ్మాయిపై మీరంతా చూపిస్తున్న ప్రేమ ఊహించలేనిది. నా ప్రయాణం కేవలం ఇప్పుడే మొదలైంది. నా నెక్స్ట్ చాప్టర్‌ను మీతో పంచుకునేందుకు వేచి ఉండలేకపోతున్నా.. అంటూ సోషల్ మీడియాలో రాసుకొచ్చింది భాగ్య శ్రీ బోర్సే. మొత్తానికి భాగ్య శ్రీ బోర్సే సక్సెస్‌ఫుల్‌గా జర్నీ సాగించాలంటే హిట్టు, ఫ్లాపులను ఒకేలా స్వీకరించాలంటూ చెప్పకనే చెబుతోంది. ఈ భామ ప్రస్తుతం విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్న వీడీ 12 చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న చిత్రంలో కూడా ఫీమేల్ లీడ్ రోల్‌లో కనిపించబోతున్నట్టు వార్తలు వస్తుండగా.. వీటిపై క్లారిటీ రావాల్సి ఉంది.



# బాలీవుడ్ నుంచి శోభితకు ప్రత్యేక సాంగ్ ఆఫర్

## వెడ్డింగ్ ఫిక్స్‌తో ..అంగీకరిస్తుందా ..అన్న చర్చ

మరో కొద్ది రోజుల్లో బాలీవుడ్ బ్యూటీ, తెలుగు సోయగం శోభిత దూళిపాళ్ల అక్కినేని వారి ఇంట అడుగుపెట్టబోతున్నది.ఇప్పటికే ఎంగేజ్‌మెంట్ పూర్తి చేసుకున్న నాగ చైతన్య, శోభిత జంట మరో రెండు మూడు నెలల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌తో పెళ్లి పీటలు ఎక్కనున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం తమ సినిమా షూటింగ్‌లను కానిచ్చేస్తున్నారు. నాగ చైతన్య తండేల్ సినిమా షూటింగ్ బిజీలో ఉండగా శోభిత సితార అనే ఓ హిందీ చిత్రంలో నటిస్తోంది. అయితే తాజాగా శోభితకు బాలీవుడ్ ప్రోడక్షన్ హౌజ్ నుంచి ఓ బంఫరాఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. షారుఖ్‌ఖాన్, రణ్ వీర్ సింగ్ వంటి అగ్ర హీరోలు నటిస్తున్న డాన్3 సినిమాలో ఓ ప్రత్యేక పాట కోసం మూవీ మేకర్స్ శోభితను సంప్రదించినట్లు బాలీవుడ్ కోడై కూస్తోంది ఈ విషయమై ఇప్పటికే ఆమెతో చర్చలు కూడా ముగిసినట్లు తెలుస్తోంది. అయితే శోభిత ఇప్పటి వరకు తన సినీ కెరీర్‌లో ఒక్క ఐటెం సాంగ్ కూడా చేయలేదు. ఈమధ్యే నాగ చైతన్యతో పెళ్లికి సిద్ధమైన శోభిత మరి ఈ ఐటం సాంగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా, ఇస్తుందా అనే విషయం తెలియాల్సి ఉంది. మరి కొద్ది రోజుల్లో అధికార ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఇదిలాఉండగా గతంలో నాగ చైతన్య, సమంత పెళ్లి తరువాత అక్కినేని ఫ్యామిలీ ఆమె కెరీర్ విషయంలో ఫుల్ ఫ్రీడమ్ ఇవ్వగా నాగ చైతన్య సమంతను బాగా ప్రోత్సహించాడు. ఆ క్రమంలో సమంత ఒకటి రెండు బోల్డ్ రోల్స్ చేసింది. దీంతో అవే వారి మధ్య విభేదాలకు కారణమనే ప్రచారం కూడా నడిచింది. ముఖ్యంగా ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ వారి విడాకులకు ప్రధాన కారణమన్న వార్తలు కూడా అప్పట్లో బాగా హల్‌చల్ చేశాయి. అదే నిజమన్నట్లుగా చైతన్యతో కలిసి విడాకుల ప్రకటన జరిగిన నెలలోపే పుష్ప సినిమాలో సమంత గాటు ఐటెం సాంగ్ కూడా చేసింది.అదంతా ఇప్పుడు గతం అనుకుంటే కొద్దిరోజుల క్రితమే నాగచైతన్య ,శోభిత ల ఎంగేజ్మెంట్ జరగగా రాజస్థాన్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్ కు ప్లానింగ్ జరుగుతున్నట్లుగా సమాచారం. మరి ఈ పెళ్లయ్యాక అక్కినేని ఫ్యామిలీ సమంతకు ఇచ్చినట్టుగానే శోభిత సినిమాల్లో నటించడానికి ఒప్పుకుంటారా అనేది వంద డాలర్ల ప్రశ్నలా ఉంది. ఎదయితే సమంత చైతన్య విడాకుల విషయంలో ప్రముఖంగా వినిపించిన బోల్డ్ రోల్స్‌ను శోభితా తన కెరీర్ ముందు నుంచి పోషిస్తూ మంచి పేరు తెచ్చుకుంది. మరి ఇప్పుడు దర్శకుడు ఫరాన్ అక్తర్ డాన్ 3 సినిమాలో ఐటం సాంగ్ ఆఫర్ ఇచ్చారని తెలుస్తోంది. మరీ ఈ ఛాన్స్ ను శోభితా ఉపయోగించుకుంటుందా.. శోభితకు ఫ్యామిలీ నుంచి సపోర్ట్ లభిస్తుందా అనే ఆసక్తికరమైన చర్చ సోషల్ మీడియాలో తెగ నడుస్తోంది.



# చిత్రపరిశ్రమలో లైంగిక వేధింపులు

## మీడియా అతిగా చేస్తోందని మండిపడ్డ సురేశ్ గోపి

నటులు, దర్శకుల నుంచి మలయాళ చిత్ర పరిశ్రమలోని మహిళలు లైంగిక వేధింపులు ఎదుర్కొన్నారని హేమ కమిటీ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో వస్తున్న ఆరోపణలపై కేంద్రమంత్రి సురేశ్ గోపీ స్పందించారు. ఈ అంశంపై మీడియా చేస్తున్న ప్రచారంపైనా ఆయన మండిపడ్డారు. చిత్ర పరిశ్రమపై ప్రజల అభిప్రాయాన్ని తప్పుదోవ పట్టించేలా ప్రవర్తిస్తోందంటూ మీడియా తీరుపై మండిపడ్డారు.చిత్రసీమలో వస్తున్న లైంగిక ఆరోపణలు గురించి మీడియా చేస్తున్న ప్రచారం ప్రజల అభిప్రాయాన్ని తప్పుదోవ పట్టిస్తోంది. ఈ ఆరోపణలే మీడియాకు ఆహారం పెడుతున్నాయి. మీరు డబ్బు సంపాదించేందుకు వీటిని ఉపయోగించుకుంటున్నారని అర్థమవుతోంది. అయితే.. వాస్తవాలు ఏంటో తెలియకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని సురేశ్ గోపీ మీడియా అడిగిన ప్రశ్నకు ఈ విధంగా స్పందించారు. మీ స్వలాభాల కోసం అలజడి సృష్టించేందుకు ప్రయత్నించడమే కాకుండా.. వారి అభిప్రాయాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. మీరు న్యాయస్థానం కంటే గొప్పకాదు. ఈ సమస్య కోర్టు పరిధిలో ఉంది. నిజానిజాలు తెలుస్తాయి. అంతవరకు వేచి ఉండండి. న్యాయస్థానాన్ని ఓ నిర్ణయం తీసుకోనివ్వండని పేర్కొన్నారు. కాగా.. 2017లో నటిపై దాడి జరిగిందంటూ కేసు నమోదైంది. దీనిపై సమగ్ర నివేదిక కోసం కేరళ ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మలయాళ చిత్రసీమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులపై కమిటీ ఇచ్చిన నివేదికపై తీవ్ర చర్చ నడుస్తోంది. ఈ క్రమంలోనే మలయాళీ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సిద్ధిఖీ నుంచి ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదుర్కొన్నానంటూ నటి రేవతి సంపత్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ప్రముఖ దర్శకుడు, కేరళ స్టేట్ చలచిత్ర అకాడమీ అధ్యక్షుడు రంజిత్ బాలకృష్ణన్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించారని బెంగాలీ నటి శ్రీలేఖ కూడా ఆరోపించడం సంచలనం రేపుతోంది. దీనిపై మీడియాలో వస్తున్న కథనాలపై తాజాగా స్పందించిన కేంద్రమంత్రి సురేశ్ గోపీ ఈ వ్యాఖ్యలు చేశారు.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com